



# చైతన్యరథం



సమాజమే దేవాలయం, ప్రజలే దేవుళ్ళు

నా ముద్దుల మావయ్య బాలయ్యకి జన్మదిన శుభాకాంక్షలు
- మంత్రి నారా లోకేష్ 6

# ఖరీఫ్.. కాస్త ముందుకు!



- తుపాను ముప్పు తప్పేలా వ్యవసాయ శాఖ చర్యలు
- పంట కాల్వలకు ముందుగానే సాగునీరు
- ఖరీఫ్ ప్రణాళిక పక్కాగా అమలు చేయాలన్న సీఎం
- 365 రోజుల్లో 3 పంటలు పండించేలా చర్యలు
- నరేగా నిధులతో వరిపొలాల గట్లు వెడల్పు...
- అంతరపంటలతో అధిక లాభాలపై అవగాహన
- 35 లక్షల మెట్రిక్ టన్నులకు ఎరువుల వినియోగం తగ్గాలి
- సేద్యం సమీక్షలో సీఎం చంద్రబాబు ఆదేశాలు

2

# నేరగాళ్లకు వణుకు పుట్టాలి



- తప్పుడు ఆలోచన చేయడానికే భయపడాలి
- ఆడబిడ్డలపై చేయివేసే సాహసం చేయకూడదు
- పోలీసులకు పూర్తి స్వేచ్ఛనిస్తున్నా..
- విచారణను శరవేగంగా పూర్తి చేయండి
- గంజాయిగాళ్లను రాష్ట్రంనుంచి ఏరేయండి
- నిర్దుష్ట సమయంలో శిక్షలు పడేలా చూడాలి
- ఉమ్మడి అనంతపురం ఘటనలపై సీఎం సమీక్ష
- దర్యాప్తు వివరాలను నివేదించిన డీజీపీ..

2



## ఆపన్నులకు అండగా..!

- విశాఖలో మంత్రి నారా లోకేష్ 65వ రోజు ప్రజాదర్బార్
- వివిధ సమస్యలతో బాధపడుతున్న వారి నుంచి వినతులు స్వీకరణ
- జోరువానలోనూ ప్రజాదర్బార్ కొనసాగింపు
- చివరి వ్యక్తి వరకూ కలిసి ఫొటోలు దిగిన మంత్రి లోకేష్

4

యోగా డే రికార్డు కోసం..

# విశాఖవైపు చూస్తున్న ప్రపంచం

- రాజకీయాలకు అతీతంగా ప్రతిఒక్కరూ భాగస్వాములు కావాలి
- పట్టుదల, కమిట్‌మెంట్‌తో విజయవంతం చేయాలి
- కార్యక్రమానికి వచ్చే ప్రజలు ఇంటికి క్షేమంగా వెళ్లేవరకు అధికారులదే బాధ్యత
- అధికారులతో సమీక్షలో రాష్ట్ర విద్య, ఐటీ, ఎలక్ట్రానిక్స్ శాఖల మంత్రి లోకేష్

3



## మీ చొరవ అభినందనీయం

- ఎన్‌సీడబ్ల్యూ చైర్‌పర్సన్‌కు మంత్రి లోకేష్ అభినందనలు
- కృష్ణంరాజు నీచ వ్యాఖ్యలను సుమోటోగా తీసుకున్న ఎన్‌సీడబ్ల్యూ
- డీజీపీకి సంస్థ చైర్‌పర్సన్ విజయ రహత్కర్ లేఖ
- వేగంగా స్పందించారని మంత్రి లోకేష్ ప్రశంసలు
- అమరావతి మహిళలపై అసభ్య వ్యాఖ్యలు క్షమించరాని నేరమని వ్యాఖ్య
- పోరాటపటిమకు మారుపేరైన వారిని అవమానించారని ఆగ్రహం
- సత్వరం న్యాయం జరగాలని డిమాండ్

6

ఐదేళ్లు పోలీసురాజ్యం నడిపించి..

## నంగనాచి కబుర్లా

- జగన్‌రెడ్డిపై మంత్రి లోకేష్ ఫైర్
- మీ పాలన రాష్ట్రానికి చీకటి అధ్యాయం
- నేను మహిళలను గౌరవిస్తూ పెరిగాను
- మీరు తల్లిని, చెల్లిని వెళ్లగొట్టి, రోజూ అవమానిస్తున్నారు
- నాది కాలేజీ లైఫ్.. మీది జైల్ లైఫ్

6



## మంచికి మరోపేరు పల్లా సింహాచలం


- చిత్రపటానికి నివాళులు అర్పించిన మంత్రి లోకేష్
- పల్లా కుటుంబ సభ్యులకు పరామర్శ

5

## పోలవరంపై వైకాపా విష ప్రచారం

- దయాఫ్రం వాల్ మందంపై సాక్షిలో అసత్య కథనాలు
- 1.5 మీటర్ల మందంతోనే నిర్మాణం
- 0.9 మీటర్లకు కుదించారంటూ అవినీతి పత్రిక దుష్ప్రచారం
- షెడ్యూల్ ప్రకారమే ప్రాజెక్ట్ పనులు
- 2027 నాటికి పూర్తి చేస్తామని మంత్రి నిమ్మల స్పష్టీకరణ
- ప్రాజెక్ట్ నిర్మాణపనులు క్షేత్రస్థాయిలో పరిశీలన
- కంపెనీ ప్రతినిధులతో డీ వాల్ మందాన్ని కొలిపించి పాత్రికేయులకు చూపించిన మంత్రి

7



# ఖరీఫ్.. కాస్త ముందుకు!

- తుఫాను ముప్పు తప్పేలా వ్యవసాయ శాఖ చర్యలు
- పంట కాల్వలకు ముందుగానే సాగునీరు
- ఖరీఫ్ ప్రణాళిక పక్కాగా అమలు చేయాలన్న సీఎం
- 365 రోజుల్లో 3 పంటలు పండించేలా చర్యలు
- నరేగా నిధులతో వరిపొలాల గట్లు వెడల్పు..
- అంతరపంటలతో అధిక లాభాలపై అవగాహన
- 35 లక్షల మెట్రిక్ టన్నులకు ఎరువుల వినియోగం తగ్గాలి
- సేద్యం సమీక్షలో సీఎం చంద్రబాబు ఆదేశాలు

అమరావతి (చైతన్య రథం): తుపానుల ముప్పునుంచి ఖరీఫ్‌ను సంరక్షించుకునేలా సాగుకాలాన్ని ముందుకు తేవాలన్న సీఎం చంద్రబాబు ఆదేశాలతో వ్యవసాయ శాఖ అధికారులు కార్యాచరణ ఆరంభించారు. ఇందుకు అనుగుణంగా గోదావరి, కృష్ణా డెల్టా ప్రాంతాలకు ఈ ఏడాది ముందుగానే సాగునీరు విడుదల చేశారు. అధికారులు ఈమేరకు వివరాలను మంగళవారం ఉండవల్లి క్యాంపు కార్యాలయంలో జరిగిన వ్యవసాయ శాఖ సమీక్షలో ముఖ్యమంత్రికి నివేదించారు. పశ్చిమ గోదావరి, ఏలూరు, కోనసీమ, తూర్పుగోదావరి, కాకినాడ, కృష్ణా జిల్లాల్లో భూములకు కాల్వల ద్వారా ఇప్పటికే నీరు విడుదల చేశామని, జూలై మొదటివారంలో గుంటూరు, బాపట్ల, ప్రకాశం జిల్లాలకు నీరు ఇచ్చేందుకు ప్రణాళికలు సిద్ధం చేశామని వివరించారు. అలాగే రాష్ట్రంలో ఖరీఫ్ సీజన్‌లో ప్రధానంగా వరి, కందులు, వేరుశనగ, ప్రత్తిసాగు చేస్తుండగా... వేరుశనగ, ప్రత్తి సాగు తగ్గుతూ వస్తోందని, కందుల సాగుమాత్రం పెరిగిందని, వరి సాగు స్థిరంగా కొనసాగుతోందని అధికారులు చెప్పారు.



### 20 ఏళ్లల్లో 14 తుఫాన్లు

గత 20 ఏళ్లుగా పరిశీలిస్తే ఆంధ్రప్రదేశ్ 14 తుఫాన్లను ఎదుర్కొంది. వీటిలో 5 తుఫాన్లు అక్టోబర్‌లో, 6 తుఫాన్లు నవంబర్‌లో, 3 తుఫాన్లు డిసెంబర్‌లో రాష్ట్రంపై ప్రభావం చూపాయి. అక్టోబర్‌లో వచ్చే తుఫాన్లు ఎక్కువగా ఉత్తర కోస్తా, తూర్పుగోదావరి జిల్లాలకు నష్టం కలిగించాయి.

### ఇక నుంచి ఏటా 3 పంటలు

365 రోజులు సాగుభూములు పచ్చగా ఉండేలా చూడాలని... ఇందుకోసం 3 పంటల విధానం తీసుకురావాలని ముఖ్యమంత్రి అధికారులకు సూచించారు. వచ్చే ఏడాది వేసవిలో ఉత్తర కోస్తా, గోదావరి, కృష్ణా డెల్టా ప్రాంతాల్లోని ఐదు లక్షల ఎకరాల్లో వేసవి పంటలు వేయాలని సూచించారు. అనంతపురం వంటి జిల్లాల్లో 365 రోజుల్లో కేవలం 4 నెలలే పంటలు సాగుచేసి, 8 నెలల పాటు భూములు ఖాళీగా వదిలేస్తున్నారని... దీనివల్ల భూసారం దెబ్బతింటోందని, అలాకాకుండా మిగిలిన 8 నెలలు కూడా ఏదోక పంట సాగు చేసే పరిస్థితులు కల్పించాలని సూచించారు. వచ్చే వేసవిలో జలవనరుల లభ్యతవున్న 141 మండలాల్లోనూ పంటల సాగు జరిగేలా రైతుల్ని సన్నద్ధం చేయాలన్నారు. ఇందులో 19 మండలాలు రిజర్వాయర్లు, 57 మండలాలు చెరువులు, 65 మండలాలు భూగర్భ జలాలపై ఆధారపడి ఉన్నాయని... వీటిని వినియోగించుకుని దిగుబడులు సాధించాలన్నారు. అలాగే వరిలో అధిక డిమాండ్ ఉన్న సన్నరకాలను పండించేలా రైతులను ప్రోత్సహించాలని సీఎం చంద్రబాబు సూచించారు.

### వరి రైతు లాభపడేలా చర్యలు

వరి రైతుకు ఆదాయం మరింత పెరిగే మార్గాలు చూడాలని అధికారులకు చెప్పిన ముఖ్యమంత్రి... వరిలో అంతర పంటగా గట్లపై కూరగాయలు, పండ్ల మొక్కలు పెంచే విధానాన్ని ప్రయోగాత్మకంగా అమలు చేయాలన్నారు. రైతుల పొలం మధ్యలో వెడల్పుగా అదనపు గట్లు వేసేలా అవగాహన కల్పించాలన్నారు. అవసరమైతే ఈ గట్లు నరేగా నిధులతో ఏర్పాటు చేయాలని అధికారులకు ముఖ్యమంత్రి సూచించారు. అలాగే వరిపంట మధ్యలో లేదా, పంట చుట్టూ ఆక్వాకల్చర్, హార్టీకల్చర్ సాగును కూడా ప్రయత్నించాలన్నారు.

### కొనుగోళ్లతో పొగాకు రైతుల్లో సంతృప్తి

హెచ్టీ బర్లీ పొగాకు కొనుగోళ్లు పర్చూరు ఏఎంసీలో ప్రారంభించామని, దీనిపై రైతుల్లో సంతృప్తి వ్యక్తమైందని అధికారులు ముఖ్యమంత్రికి తెలిపారు. హెచ్టీ బర్లీ స్థానంలో ప్రత్యామ్నాయ పంటల సాగును ప్రోత్సహిస్తున్నామని చెప్పారు. కోకో, మామిడి కొనుగోళ్ల వివరాలను ఈ సందర్భంగా ముఖ్యమంత్రి అడిగి తెలుసుకున్నారు. మరోవైపు వాట్సాప్ గవర్నెన్స్ మన మిత్ర ద్వారా కొత్తగా వ్యవసాయ శాఖకు సంబంధించి మూడు సేవలు అందుబాటులోకి తెచ్చామని వెల్లడించారు. పంటల బీమా, వ్యవసాయ యాంత్రీకరణ, మార్కెఫెడ్‌కు సంబంధించిన సేవలను ఇకపై వాట్సాప్ ద్వారా రైతులు పొందే అవకాశం కలిగిందన్నారు. రైతులకు ఆఫ్ లైన్, ఆన్ లైన్‌లో కూడా వ్యవసాయ విజ్ఞానంపై అవగాహన పెంచాలని ముఖ్యమంత్రి ఆదేశించారు.

### ఎరువుల వినియోగం తగ్గాలి

'ఎరువులు, పురుగుమందుల వినియోగాన్ని తగ్గించి... భూసారాన్ని కాపాడేందుకు కృషి చేయాలని సీఎం చంద్రబాబు సూచించారు. ఎక్కడా ఎరువుల కొరత లేకుండా చూడాలి. ఎరువులు, పురుగుమందుల వినియోగంపై తాజా సమాచారం ఉండాలి. రాష్ట్రంలో గత ఏడాది పంటకాలంలో 39 లక్షల మెట్రిక్ టన్నుల ఎరువులు వినియోగించగా, ఈ ఏడాది దానిని 35 లక్షల మెట్రిక్ టన్నులకు తగ్గించేలా చూడాలి. పల్సెస్, మిల్లెట్స్ సాగు పెరగాలి. ఈ సీజన్‌లో రైతులు కోరిన 24 గంటల్లో బ్యాంకులు రుణాలివ్వాలి' అని ముఖ్యమంత్రి చంద్రబాబు చెప్పారు.

# నేరగాళ్లకు వణుకుపుట్టాలి

- తప్పుడు ఆలోచన చేయడానికే భయపడాలి
- ఆడబిడ్డలపై చేయివేసే సాహసం చేయకూడదు
- పోలీసులకు పూర్తి స్వేచ్ఛనిస్తున్నా..
- విచారణను శరవేగంగా పూర్తి చేయండి
- గంజాయిగాళ్లను రాష్ట్రంనుంచి ఏరేయండి
- నిర్దుష్ట సమయంలో శిక్షలు పడేలా చూడాలి
- ఉమ్మడి అనంతపురం ఘటనలపై సీఎం సమీక్ష
- దర్యాప్తు వివరాలను నివేదించిన డీజీపీ..



అమరావతి (చైతన్య రథం): ఉమ్మడి అనంతపురం జిల్లాలో ఆడబిడ్డలపై జరిగిన రెండు ఘటనలను ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఉండవల్లి సీఎం క్యాంప్ కార్యాలయంలో సమీక్షించారు. అనంతపురం పట్టణంలో ఇంటర్ విద్యార్థిని హత్య, శ్రీ సత్యసాయి జిల్లా రామగిరి మండలం ఏడుగుర్రాళ్లపల్లిలో బాలికపై అత్యాచారం.. రెండు ఘటనలపై డీజీపీ సహా ఉన్నతాధికారులు ముఖ్యమంత్రికి దర్యాప్తు అంశాలను వివరించారు. అనంతపురం ఘటనలో తన్మయి అనే యువతి తెలిసిన వ్యక్తి చేతిలో హత్యకు గురైతే.. ఏడుగుర్రాళ్లపల్లిలో బాలికపై కొద్దిమంది చాలాకాలంగా అత్యాచారానికి పాల్పడడం దారుణమన్నారు. ఈ రెండు ఘటనలపై సీఎం తీవ్ర ఆవేదనవ్యక్తం చేశారు. కేసు పూర్వాపరాలు పూర్తిగా తెలుసుకున్న సీఎం.. ఈ కేసుల్లో నిందితులకు వెంటనే శిక్షలు పడాలన్నారు. వెంటనే విచారణ పూర్తి చేసి ఛార్జిషీట్ దాఖలు చేసి ట్రయల్స్ పూర్తయ్యేలా చూడాలని పోలీస్ యంత్రాంగాన్ని ఆదేశించారు. ప్రత్యేక శ్రద్ధతో పక్కాగా ఆధారాలు సేకరించి నిందితులకు అత్యంత కఠిన శిక్షలు పడేలా చూడాలని సీఎం ఆదేశించారు. మహిళలపై నేరాల విషయంలో పోలీసు శాఖ కఠినంగా వ్యవహరించాలన్నారు. నేరం చేయాలనే ఆలోచన ఉన్నవారు పోలీసులు తీసుకునే చర్యల గురించి భయపడే పరిస్థితి రావాలన్నారు. ఆడబిడ్డలపై క్షణికావేశంలోనో... గంజాయి మత్తులోనో... వ్యవస్థీకృతంగానో నేరాలకు పాల్పడే వారికి శిక్షతప్పదనే అభిప్రాయాన్ని కలిగించాల్సి ఉందని సీఎం సూచించారు. ఈ రెండు ఘటనలే కాకుండా... మహిళలపై అఘాయిత్యాలకు, వారిపై హింసకు, లైంగిక దాడికి ఎవరు పాల్పడినా గట్టి సందేశం ఇచ్చేలా పోలీస్ శాఖ దర్యాప్తు, చర్యలు ఉండాలని సీఎం ఆదేశించారు. గత ప్రభుత్వంలో ఐదేళ్లు నేరగాళ్లపై నియంత్రణ లేదని, గంజాయి, డ్రగ్స్, చట్టమంటే భయం లేకపోవడంవల్ల నేరగాళ్లు అదుపులో లేకుండా పోయారని... దీంతో నేటికీ కొందరు పాత అలవాట్లను మానుకోవడం లేదన్నారు. ముఖ్యంగా గంజాయి బ్యాచ్ ఆగడాలకు అడ్డుకట్ట వేయాలని ఆదేశించారు. ఈ విషయంలో పోలీసులకు పూర్తి స్వేచ్ఛ ఇస్తున్నానని.... 100 శాతం మార్పు కనిపించాలని సీఎం ఆదేశించారు. సమీక్షలో చీఫ్ సెక్రటరీ కె.విజయానంద్, డీజీపీ హరీష్ కుమార్ గుప్తా, ఇంటలిజెన్స్ చీఫ్ మహేష్ చంద్ర లడ్డా ఇతర అధికారులు పాల్గొన్నారు.



# యోగాడే రికార్డు కోసం..

## విశాఖవైపు చూస్తున్న ప్రపంచం

- రాజకీయాలకు అతీతంగా ప్రతిఒక్కరూ భాగస్వాములు కావాలి
- పట్టుదల, కమిట్‌మెంట్‌తో కార్యక్రమాన్ని విజయవంతం చేయాలి
- కార్యక్రమానికి వచ్చే ప్రజలు ఇంటికి క్షేమంగా వెళ్లేవరకు అధికారులదే బాధ్యత
- అధికారులతో సమీక్షలో రాష్ట్ర విద్య, ఐటీ, ఎలక్ట్రానిక్స్ శాఖల మంత్రి లోకేష్





విశాఖపట్నం (చైతన్యరథం): విశాఖపట్నంలో అంతర్జాతీయ యోగా దినోత్సవం సందర్భంగా నిర్వహించే యోగాంధ్ర కార్యక్రమం అత్యంత కీలకమైంది, ఆరోజున మనం సాధించబోయే రికార్డు కోసం ప్రపంచమంతా విశాఖ మహానగరం వైపు చూస్తోంది, ప్రధాని మోదీ ప్రతిష్టాత్మకంగా తీసుకున్న ఈ కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహించాలని అధికారులకు రాష్ట్ర విద్య, ఐటి, ఎలక్ట్రానిక్స్ శాఖల మంత్రి నారా లోకేష్ విజ్ఞప్తి చేశారు. ఈనెల 21న యోగా డే నిర్వహణ ఏర్పాట్లపై ఆంధ్రా యూనివర్సిటీ లోని సాగరిక కన్వెన్షన్ హాలులో మంగళవారం ఉన్నతస్థాయి సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి లోకేష్ మాట్లాడుతూ.... ఒకే ప్రాంతంలో 5లక్షలమందితో నిర్వహించే ఈ ఈవెంట్ ప్రపంచంలోనే అతిపెద్దదిగా చరిత్ర సృష్టించబోతోంది, ప్రధాని మోదీ హాజరుకాబోతున్నారు,అధికారులంతా పట్టుదల, క్రమశిక్షణ,కమిట్‌మెంట్‌తో పకడ్బందీగా కార్యక్రమాన్ని నిర్వహించాలని దిశానిర్దేశం చేశారు. ఇది రాష్ట్రప్రజలందరి కార్యక్రమం, రాజకీయాలకు అతీతంగా అన్ని రాజకీయపక్షాలు భాగస్వాములు కావాలి. యోగావల్ల ప్రజల మానసిక, శారీరక ఆరోగ్యం బాగుంటుందని ప్రధాని చెబుతున్నారు. దీనిపై ప్రసార మాధ్యమాల్లో విస్తృత ప్రచారం కల్పించాలి. ఈనెల 21న విశాఖ ఆర్‌కె బీచ్ నుంచి భీమిలి వరకు 26 కి.మీ.ల పొడవున 247 కంపార్ట్‌మెంట్లలో నిర్వహించే ఈ కార్యక్రమానికి వచ్చే ప్రజలకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా చూడాలి. ఆ రోజు ఉదయం 6.30 గంటలకు ప్రధాని ఆర్‌కె బీచ్ ఖాళీమాత ఆలయం వద్ద ప్రధాన ప్రాంగణానికి చేరుకుంటారు. అంతకు గంటముందే ప్రజలంతా ఆయా కంపార్ట్‌మెంట్లకు చేరేలా రవాణా సౌకర్యం కల్పించండి. సుదూర ప్రాంతాల్లో నిలిపివేసి ఇబ్బందులకు గురిచేయొద్దు. 600 మీటర్లకు మించి ప్రజలను నడిపించకుండా వాహనాలను వదలాలి. ప్రజలు ఇళ్లవద్ద నుంచి ప్రాంగణానికి చేరేదగ్గర నుంచి తిరిగి వారు ఇంటికి చేరేవరకు అధికారులు బాధ్యత తీసుకోవాలి. 19,20,21 తేదీలు కీలకం, అధికారులంతా ప్రణాళికాబద్ధంగా, కలసికట్టుగా కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని మంత్రి నారా లోకేష్ కోరారు. సమావేశానికి ముందు ఎయు గ్రౌండ్స్ లో నిర్వహిస్తున్న యోగా శిక్షణను మంత్రి లోకేష్ తిలకించారు.




### ప్రతి కంపార్ట్‌మెంట్‌కు ఒక గెజిటెడ్ అధికారి!

విశాఖలో నిర్వహించే 11వ అంతర్జాతీయ యోగా దినోత్సవానికి రాష్ట్రస్థాయి నోడల్ ఆఫీసర్‌గా నియమితులైన ఎంటి కృష్ణబాబు మాట్లాడుతూ... యోగా డే నిర్వహించే 247 కంపార్ట్‌మెంట్లలో ప్రజలకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా ప్రతి కంపార్ట్‌మెంట్‌కు ఒక గెజిటెడ్ అధికారికి బాధ్యతలు అప్పగించామని తెలిపారు. కార్యక్రమానికి హాజరయ్యే ప్రజలంతా ఇప్పటికే రిజిస్ట్రేషన్ చేసుకున్నారు. క్యూ ఆర్ కోడ్ ద్వారా వారిని నిర్ణీత కంపార్ట్‌మెంట్లలోకి అనుమతిస్తాం. సుదూర ప్రాంతాల నుంచి వచ్చేవారిని రాత్రి 2గంటలనుంచే అనుమతించేలా చర్యలు చేపట్టాం. జనాన్ని తీసుకొచ్చే వాహనాలకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా క్రమబద్ధీకరించేందుకు వీలుగా కమాండ్ కంట్రోల్ రూమ్ ఏర్పాటుచేసి, 1200 కెమెరాలను అమర్చాం. ఆర్‌కె బీచ్ నుంచి భీమిలివరకు 30 ప్రధాన లోకేషన్లతోపాటు మరో 18 అదనపు లోకేషన్లలో కూడా ఏర్పాట్లు చేశాం. కార్యక్రమ నిర్వహణ కోసం 2వేలమంది యోగా ఇన్‌స్ట్రక్టర్లకు బాధ్యతలు అప్పగించాం. వారందరినీ ముందురోజు రాత్రే ఎయు గ్రౌండ్స్‌కి రప్పిస్తాం. ముందుజాగ్రత్త చర్యగా 116 అంబులెన్స్‌లను సిద్ధం చేశాం. హాజరయ్యే వారందరికీ మ్యాట్లు, టీ షర్ట్‌లు ఆయా కంపార్ట్‌మెంట్ల వద్దే అందించేలా ఏర్పాట్లు చేశాం. 1400 బయో టాయ్‌లెట్లను అందుబాటులో ఉంచుతాం. విశాఖతోపాటు పరిసర జిల్లాల నుంచి వచ్చే ప్రజల కోసం 3,500 ఆర్టీసీ బస్సులు, 8 వేల ప్రైవేటు, స్కూలు బస్సులను సిద్ధంచేశాం. ప్రజలను సురక్షితంగా రప్పించి తిరిగే తీసుకెళ్లేలా సెక్రటేరియట్ ఉద్యోగులకు బాధ్యతలు అప్పగించామని కృష్ణబాబు తెలిపారు.

ఈ సమావేశంలో కేంద్ర మంత్రి రామ్మోహన్ నాయుడు, జిల్లా ఇన్చార్జి మంత్రి డోలా శ్రీబాలవీరాంజనేయుస్వామి, రాష్ట్రమంత్రులు వంగలపూడి అనిత, అనగాని సత్యప్రసద్, గుమ్మడి సంధ్యారాణి, కలెక్టర్ హరీంద్రప్రసాద్, రాష్ట్ర, జిల్లాస్థాయి అధికారులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.





# ఆపన్నులకు అండగా..!

- విశాఖలో మంత్రి నారా లోకేష్ 65వ రోజు ప్రజాదర్బార్
- వివిధ సమస్యలతో బాధపడుతున్న వారి నుంచి వినతులు స్వీకరణ
- జోరువానలోనూ ప్రజాదర్బార్ కొనసాగింపు
- చివరి వ్యక్తి వరకూ కలిసి ఫొటోలు దిగిన మంత్రి లోకేష్

విశాఖపట్నం (చైతన్యరథం): కూటమి ప్రభుత్వంలో ప్రజాసమస్యలు త్వరితగతిన పరిష్కారం కోసం అవిశ్రాంతంగా కృషిచేస్తున్న విద్య, ఐటీ శాఖల మంత్రి నారా లోకేష్.. ఉత్తరాంధ్రలో తన రెండో రోజు పర్యటనలో మంగళవారం విశాఖ పార్టీ కార్యాలయంలో 65వ రోజు ప్రజాదర్బార్ నిర్వహించారు. వివిధ సమస్యలతో బాధపడుతున్న సామాన్యుల నుంచి వినతులు స్వీకరించారు. ప్రతి ఒక్కరిని స్వయంగా కలుసుకుని వారి సమస్యలు విన్నారు. ఆయా వినతుల పరిష్కారంపై అక్కడికక్కడే సిబ్బందికి ఆదేశాలు జారీ చేశారు.

## అనాథలా వదిలేశారు, ఆదుకోండి

రాష్ట్రవ్యాప్తంగా ప్రభుత్వ డిగ్రీ కళాశాలల్లో పనిచేస్తున్న అధ్యాపకులకు నెలవారీ జీతం చెల్లించడంతో పాటు ఇంటర్ జోనల్ బదిలీలకు అవకాశం కల్పించాలని ఆంధ్రప్రదేశ్ గవర్నమెంట్ డిగ్రీ కాలేజెస్ గెస్ట్ ఫ్యాకల్టీ అసోసియేషన్ ప్రతినిధులు.. మంత్రి నారా లోకేష్‌ను కలిసి విజ్ఞప్తి చేశారు.

ఇటీవల తన భర్త మరణించారని, ఉన్న ముగ్గురు పిల్లలు తనను అనాథలా వదిలేశారని, వృద్ధాప్య పెన్షన్ అందించి ఆదుకోవాలని విశాఖకు చెందిన అవ్వా కాంతం విన్నవించారు.

రెండేళ్ల క్రితం రోడ్డు ప్రమాదంలో తన భర్త మరణించారని, తమ కుటుంబానికి చెందవలసిన ఆస్తిని అత్త, మామ, మరిది అన్యాయంగా కాజేశారని విశాఖకు చెందిన రెడ్లదిన్నె శ్రావణి ఆవేదన వ్యక్తం చేశారు. ఎలాంటి ఆదరణ లేక ఇద్దరు చిన్నపిల్లలతో ఇబ్బందులు ఎదుర్కొంటున్నానని, విచారించి తగిన న్యాయం చేయాలని కోరారు.




ప్రతిపక్ష నేతగా చంద్రబాబునాయుడు 2020లో విశాఖ పర్యటనకు వచ్చినప్పుడు వైసీపీకి చెందిన కేకే రాజు..ఆ పర్యటనను అడ్డుకుని నానా బీభత్సం సృష్టించారని, పోలీసులు తూతూ మంత్రంగా కేసు నమోదు చేసి చేతులు దులుపుకున్నారని విశాఖ తాటిచెట్లపాలెంకు చెందిన కే.గోపాల్ రెడ్డి ఫిర్యాదు చేశారు. విచారణ జరిపి తగిన చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు.

విశాఖపట్నం జిల్లా ఆనందపురం మండలంలో ప్రభుత్వ జూనియర్ కళాశాల నిర్మాణానికి గతంలో కేటాయించిన రెండున్నర ఎకరాల స్థలంలోనే శాశ్వత భవనాలు నిర్మించేలా చర్యలు తీసుకోవాలని ఆనందపురం ప్రభుత్వ జూనియర్ కాలేజీ విద్యార్థులు, తల్లిదండ్రులు, గ్రామస్థులు విజ్ఞప్తి చేశారు. స్వలాభం కోసం సదరు స్థలంలో ప్రభుత్వ డిగ్రీ కాలేజీ నిర్మాణానికి కొందరు యత్నిస్తున్నారని, దీనివల్ల విద్యార్థులు నష్టపోతారని మంత్రి లోకేష్ దృష్టికి తీసుకువచ్చారు.

ఎన్టీఆర్ జిల్లా కంచికచర్ల మండలం పరిటాల గ్రామంలో తమకు పసుపు-కుంకుమ కింద ఇచ్చిన 1.09 ఎకరాల వ్యవసాయ భూమి ఉందని, ఈ భూమి తమకు వంశపారపర్యంగా వచ్చిందని, అయితే 2022లో జరిగిన రీసర్వేలో ఎఫ్‌ఎమ్‌బీలో సదరు భూమి సబ్ డివిజన్‌ను తప్పుగా నమోదు చేయడంతో ఇబ్బందులు పడుతున్నామని విశాఖ శాతవాహన నగర్‌కు చెందిన వై.వసంత లక్ష్మి ఆవేదన వ్యక్తం చేశారు. రీసర్వేలో జరిగిన తప్పులను సరిదిద్ది సదరు భూమిని ఆన్ లైన్ లో నమోదు చేయాలని విజ్ఞప్తి చేశారు.

విశాఖ లంకలపాలెంలోని కోనేరు అభివృద్ధి పనుల్లో రూ.1.20 కోట్ల నిధుల గోల్ మాల్ జరిగిందని, దీనిపై విచారణ జరిపి బాధ్యులపై చర్యలు తీసుకోవాలని 79వ వార్డు కార్పొరేటర్ రౌతు శ్రీనివాస్ కలిసి ఫిర్యాదు చేశారు.

ఆయా సమస్యలను పరిశీలించి తగిన చర్యలు తీసుకుంటామని మంత్రి లోకేష్ హామీ ఇచ్చారు.

## జోరువానలోనూ ఆగని ప్రజాదర్బార్

విశాఖ పార్టీ కార్యాలయంలో నిర్వహించిన ప్రజాదర్బార్ జోరువానలోనూ కొనసాగింది. మంత్రి నారా లోకేష్ ను స్వయంగా కలిసి పలు సమస్యలపై వినతులు ఇచ్చేందుకు ఉదయం విశాఖ పార్టీ కార్యాలయానికి ప్రజలు పెద్దసంఖ్యలో చేరుకున్నారు. ఈ సమయంలో భారీ వర్షం కురిసింది. జోరువానలోనూ ప్రజాదర్బార్ ను కొనసాగించిన మంత్రి.. ప్రజల నుంచి వినతులు స్వీకరించారు. చివరి వ్యక్తి వరకు కలిసి అందరితో ఫొటోలు దిగారు. ప్రజాసమస్యల పరిష్కారంపై మంత్రి లోకేష్ చిత్తశుద్ధి పట్ల ప్రజలు సంతోషం వ్యక్తం చేశారు.





















చైతన్యరథం



# మంచికి మరోపేరు పల్లా సింహాచలం

## చిత్రపటానికి నివాళులు అర్పించిన మంత్రి లోకేష్ - పల్లా కుటుంబ సభ్యులకు పరామర్శ

విశాఖపట్నం(చైతన్యరథం):టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావు తండ్రి, మాజీ ఎమ్మెల్యే పల్లా సింహాచలానికి విద్య,ఐటీ శాఖల మంత్రి నారా లోకేష్ నివాళులు అర్పించారు. గత శనివారం పల్లా సింహాచలం స్వర్గస్థులయిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో మంగళవారం ఉదయం విశాఖ నగరం సీతంపేటలోని పల్లా శ్రీనివాసరావు నివాసానికి చేరుకున్న మంత్రి లోకేష్.. అక్కడ పల్లా సింహాచలం చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. పల్లా సింహాచలం మంచికి మారుపేరుగా నిలిచారని, విశాఖ-2 ఎమ్మెల్యేగా నియోజకవర్గ అభివృద్ధికి కృషి చేశారని ఈ సందర్భంగా ఆయన సేవలను మంత్రి లోకేష్ గుర్తుచేసుకున్నారు. పల్లా శ్రీనివాస రావు, ఇతర కుటుంబ సభ్యులను పరామర్శించి ధైర్యం చెప్పారు. పల్లా సింహాచలం మృతి పట్ల తన ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో స్పీకర్ అయ్యన్నపాత్రుడు, విశాఖ ఎంపీ శ్రీ భరత్, హోంమంత్రి వంగలపూడి అనిత, సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి డోలా బాలవీరాంజనేయ స్వామితో పాటు పాటు ఉత్తరాంధ్ర ప్రాంత ఎమ్మెల్యేలు, ఇతర ప్రజాప్రతినిధులు, నాయకులు పాల్గొన్నారు.















# మీ చొరవ అభినందనీయం

- ఎన్‌సీడబ్ల్యూ చైర్‌పర్సన్‌కు మంత్రి లోకేష్ అభినందనలు
- కృష్ణంరాజు నీచ వ్యాఖ్యలను సుమోటోగా తీసుకున్న ఎన్‌సీడబ్ల్యూ
- డీజీపీకి సంస్థ చైర్‌పర్సన్ విజయ రహత్కర్ లేఖ
- వేగంగా స్పందించారని మంత్రి లోకేష్ ప్రశంసలు
- అమరావతి మహిళలపై అసభ్య వ్యాఖ్యలు క్షమించరాని నేరమని వ్యాఖ్య
- పోరాటపటిమకు మారుపేరైన వారిని అవమానించారని ఆగ్రహం
- సత్వరం న్యాయం జరగాలని డిమాండ్



అమరావతి (చైతన్యరథం): సాక్షి ఛానల్ డిబేట్‌లో అమరావతి మహిళలను ఉద్దేశించి వీవీఆర్ కృష్ణంరాజు చేసిన అనుచిత వ్యాఖ్యలు తీవ్ర దుమారం రేపుతున్న సంగతి తెలిసిందే. అమరావతిని వేశ్యల నగరంగా కృష్ణంరాజు అభివర్ణించారు. దీంతో ఆంధ్రప్రదేశ్‌లో పెద్దఎత్తున ఆగ్రహ జ్వాలలు రేగుతున్నాయి. సాక్షి ఛానెల్‌పై, జర్నలిస్ట్ కృష్ణంరాజుపై తీవ్ర విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. కాగా, కృష్ణంరాజు చేసిన అసభ్యకర వ్యాఖ్యలను జాతీయ మహిళా కమిషన్ సుమోటోగా తీసుకుంది

ఈ విషయంలో జాతీయ మహిళా కమిషన్ చొరవను ఆంధ్రప్రదేశ్ విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ అభినందించారు. ఈ మేరకు ఆయన ఎక్స్ వేదికగా ఓ ట్వీట్ చేశారు. అమరావతి మహిళలను ఉద్దేశిస్తూ కృష్ణంరాజు చేసిన నీచమైన, అసభ్యకర వ్యాఖ్యలపై తక్షణమే స్పందించి చర్యలకు ఆదేశించిన జాతీయ మహిళా కమిషన్ చైర్ పర్సన్ విజయ రహత్కర్‌కు అభినందనలు. ధైర్యానికి, పోరాటపటిమకు మారుపేరైన అమరావతి మహిళా రైతులను వేశ్యలుగా అభివర్ణించడం సిగ్గుచేటు మాత్రమే కాదు.. క్షమించరాని నేరం కూడా. వారి త్యాగాలను అవమానించడమే. ఈ ఘటనపై జాతీయ మహిళా కమిషన్ సత్వరమే స్పందించి వేగంగా చర్య తీసుకోవడం ద్వారా అలాంటి వ్యాఖ్యలను ఉపేక్షించేది లేదనే బలమైన సందేశం ఇచ్చింది. మేమంతా అమరావతి మహిళా రైతుల వెనుక ఉన్నాం. మహిళలను అవమానించినవారిని వదిలిపెట్టేది లేదు. అమరావతి ఉద్యమానికి మహిళలే వెన్నెముకగా నిలిచారు. వారికి సత్వరమే న్యాయం జరగాలని నారా లోకేష్ ట్వీట్ చేశారు.

ఇలాఉంటే అమరావతి మహిళలను ఉద్దేశించి సాక్షి ఛానెల్లో జర్నలిస్టు కృష్ణంరాజు చేసిన అసభ్యకర వ్యాఖ్యలను జాతీయ మహిళా కమిషన్ (ఎన్‌సీడబ్ల్యూ) సుమోటోగా తీసుకుంది. ఈ మేరకు రాష్ట్ర డీజీపీకి కమిషన్ చైర్‌పర్సన్ విజయ రహత్కర్ లేఖ రాశారు. కృష్ణంరాజు చేసిన అసభ్యకర వ్యాఖ్యలను ఎన్సీడబ్ల్యూ తీవ్రంగా ఖండించింది. ఈ వ్యవహారంలో ఎలాంటి చర్యలు తీసుకున్నారో మూడు రోజుల్లో నివేదిక ఇవ్వాలని డీజీపీని ఆదేశించింది. అమరావతి ఉద్యమంలో మహిళా రైతులు కీలకపాత్ర పోషించారని మహిళా కమిషన్ పేర్కొంది. కృష్ణంరాజు వ్యాఖ్యలపై మీడియాలో వచ్చిన కథనాల ఆధారంగా సుమోటోగా తీసుకుని విచారణకు ఆదేశించింది.

## ఐదేళ్లు పోలీసు రాజ్యం నడిపించి..

# నంగనాచి కబుర్లా

- జగన్‌రెడ్డిపై మంత్రి లోకేష్ ఫైర్
- మీ పాలన రాష్ట్రానికి చీకటి అధ్యాయం
- నేను మహిళలను గౌరవిస్తూ పెరిగాను
- మీరు తల్లిని, చెల్లిని వెళ్లగొట్టి, రోజా అవమానిస్తున్నారు
- నాది కాలేజీ లైఫ్.. మీది జైల్ లైఫ్



అమరావతి(చైతన్యరథం): వైసీపీ కర పత్రిక సాక్షిలో వస్తున్న అభూత కల్పనలు, అసత్య కథనాలపై విద్య, ఐటీశాఖల మంత్రి నారా లోకేష్ మండిపడ్డారు. ఐదేళ్ల పాలనలో రాష్ట్రాన్ని రావణకాష్టంలా మండించిన జగన్‌రెడ్డి ఇప్పుడు తమపై బురద జల్లేందుకు ప్రయత్నిస్తున్నాడని దుయ్యబట్టారు. జగన్‌రెడ్డి కపటత్వాన్ని చూసి నవ్వుకోవటం మినహా తాను చేయ గలిగింది లేదని చురకలు వేశారు. ఈ మేరకు ఎక్స్‌లో మంత్రి లోకేష్ పోస్ట్ పెట్టారు.

జగన్ రెడ్డీ.. మీ కపటత్వాన్ని చూసి నవ్వుకోవటం మినహా ఏమీ చేయలేను. నాకు కాలేజీ జీవితం ఉండేది,మీకు జైలు జీవితం ఉండేది. నాకు క్లాస్‌మేట్స్ ఉండే వారు, మీకు జైలు సహచరులు ఉండే వారు. నేను మహిళలను గౌరవిస్తూ పెరిగాను. స్త్రీలను గౌరవించేలా నన్ను పెంచారు. మీరు మీ సొంత తల్లిని, సోదరిని బయటకు వెళ్లగొట్టారు. వారిని కోర్టుకు లాగారు. మీ మీడియా, సోషల్ మీడియా ద్వారా ప్రతిరోజూ వారి శీల హననం చేస్తున్నారు. అదే మీకు.. నాకు తేడా. ముఖ్యమంత్రిగా మీ ఐదేళ్ల పాలన రాష్ట్రంలో ఒక చీకటి అధ్యాయం. ప్రతీకార రాజకీయాలకు పరాకాష్టగా.. దళితులు, మహిళలపై దమనకాండకు, దారుణాలకు, అబద్ధాలకు నిలయంగా నిలిచింది. మీ దుష్టపాలనను వ్యతిరేకించిన ప్రత్యర్థులపై అక్రమ కేసులు పెట్టి జైళ్లకు పంపించారు. రాష్ట్రంలో పోలీసు రాజ్యం నడిపించారు. ఇప్పుడేమో నంగనాచి కబుర్లు చెబుతున్నారు. మీ హయాంలో, మీ కనుసన్నల్లో మీ పార్టీ నేతలు చేసిన నేరాలను మాకు ఆపాదించే ప్రయత్నాలు మానుకోండి. మీ తప్పులకు ఎదుటివారిపై బురద జల్లడం ఆపండి. కప్పిపుచ్చుకునే కాలం ముగిసింది. అర్థం అయ్యిందా రాజా.. అంటూ మంత్రి లోకేష్ పోస్ట్ చేశారు.



ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడిని మంగళవారం ఉండవల్లి క్యాంపు కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిసిన కేంద్ర గనుల మంత్రి కిషన్‌రెడ్డి



## బాల అన్నయ్యకి జన్మదిన శుభాకాంక్షలు

**- నారా భువనేశ్వరి**



అమరావతి (చైతన్యరథం): హిందూపూర్ ఎమ్మెల్యే, అగ్రనటుడు నందమూరి బాలకృష్ణకు ఆయన సోదరి, సీఎం చంద్రబాబు సతీమణి నారా భువనేశ్వరి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. ఈ మేరకు ఎక్స్‌లో భువనేశ్వరి పోస్ట్ పెట్టారు. నాన్న నట వారసత్వంతో పాటు మంచి మనస్సు, కాస్త చిలిపితనం, ఎంతో క్రమశిక్షణ, దైవభక్తి కలగలిసిన, మనందరి అభిమాన నటుడు, మా బాల అన్నయ్యకి హృదయ పూర్వక జన్మదిన శుభాకాంక్షలు అని ఆమె ట్వీట్ చేశారు.

## నా ముద్దుల మావయ్య బాలయ్యకి జన్మదిన శుభాకాంక్షలు

**- మంత్రి నారా లోకేష్**

విశాఖపట్నం (చైతన్యరథం): హిందూపూర్ ఎమ్మెల్యే నటసింహం నందమూరి బాలకృష్ణకు విద్య, ఐటీశాఖల మంత్రి నారా లోకేష్ జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. సిల్వర్ స్క్రీన్ పై ఆయన లెజెండ్..పొలిటికల్ స్క్రీన్ పై ఆయన అన్ స్టాపబుల్.. ప్రజల గుండెల్లో ఆయన బాలయ్య.. నా ముద్దుల మావయ్య పద్మభూషణ్ నందమూరి బాలకృష్ణకి హృదయపూర్వక జన్మదిన శుభాకాంక్షలు అంటూ ఎక్స్‌లో మంత్రి లోకేష్ పోస్ట్ చేశారు.



## సజ్జలకు సమన్లు పంపిస్తాం

**- రాష్ట్ర మహిళా కమిషన్ చైర్‌పర్సన్ రాయపాటి శైలజ**

అమరావతి (చైతన్యరథం): రాజధాని మహిళలపై అనుచిత వ్యాఖ్యలు చేసిన వైసీపీ నేత సజ్జల రామకృష్ణారెడ్డికి సమన్లు పంపిస్తామని ఏపీ మహిళా కమిషన్ చైర్పర్సన్ రాయపాటి శైలజ చెప్పారు. వాటికి సజ్జల వ్యక్తిగతంగా హాజరై వివరణ ఇవ్వాలని కమిషన్ స్పష్టం చేసింది. సజ్జల వ్యాఖ్యలను నిరసిస్తూ రాజధాని మహిళలు మంగళగిరిలోని మహిళా కమిషన్ కార్యాలయంలో చైర్‌పర్సన్‌ను కలిసి ఫిర్యాదు చేశారు. వైసీపీ నేతలకు అమరావతి ప్రాంత మహిళలంటే చులకనైపోయిందని ఆవేదన వ్యక్తం చేశారు. ఐదేళ్ల పాలనలో వైసీపీ ప్రభుత్వం కేసులతో వేధించగా.. ఇప్పుడు ఆ పార్టీ నాయకులు అసభ్య వ్యాఖ్యలతో మానసిక క్షోభకు గురి చేస్తున్నారని కన్నీటి పర్యంతమయ్యారు. 11 సీట్లకే పరిమితం కావడానికి రాజధాని మహిళలే కారణమనే కోపంతో ఈ విధంగా తమను కించపరిచేలా వ్యాఖ్యానించడం తగదని హితవు పలికారు. రాజధాని మహిళల ఫిర్యాదును జాతీయ మహిళా కమిషన్‌కు పంపిస్తామని శైలజ చెప్పారు.



# పోలవరంపై వైకాపా విష ప్రచారం

- డయాఫ్రం వాల్ మందంపై సాక్షిలో అసత్య కథనాలు
- 1.5 మీటర్ల మందంతోనే నిర్మాణం
- 0.9 మీటర్లకు కుదించారంటూ అవినీతి పత్రిక దుష్ప్రచారం
- షెడ్యూల్ ప్రకారమే ప్రాజెక్ట్ పనులు
- 2027 నాటికి పూర్తి చేస్తామని మంత్రి నిమ్మల స్పష్టీకరణ
- ప్రాజెక్ట్ నిర్మాణపనులు క్షేత్రస్థాయిలో పరిశీలన
- కంపెనీ ప్రతినిధులతో డీ వాల్ మందాన్ని కొలిపించి పాత్రికేయులకు చూపించిన మంత్రి



పోలవరం (చైతన్యరథం): పోలవరం ప్రాజెక్ట్ పనులు షెడ్యూల్ ప్రకారమే జరుగుతున్నాయని జలవనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు స్పష్టం చేశారు. అవినీతి పత్రిక సాక్షి మాత్రం అబద్ధాలు పోగేసి ప్రాజెక్ట్ నిర్మాణ పనులపై అసత్య కథనాలు ప్రచురిస్తోందని మండిపడ్డారు. పోలవరం ప్రాజెక్టుకు సంబంధించి డయాఫ్రమ్ వాల్ మందం 1.5 మీటర్ల నుంచి 0.9 మీటర్లకు తగ్గించేస్తున్నారని సాక్షి పత్రిక చేస్తున్న విష ప్రచారాన్ని మంత్రి నిమ్మల రామానాయుడు తీవ్రంగా ఖండించారు. కనీస అవగాహన లేకుండా, ప్రాథమిక సాంకేతిక పరిజ్ఞానం లేకుండా నోటికొచ్చిన అబద్ధాలు అచ్చేసి పోలవరం ప్రాజెక్టు పనుల వేగంపై నీళ్లు చల్లాలనుకోవటం వైకాపా అవివేకం, అజ్ఞానం అని మంత్రి దుయ్యబట్టారు. మంగళవారం పోలవరం ప్రాజెక్టు పనులను క్షేత్ర స్థాయిలో పరిశీలించిన మంత్రి సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి రామానాయుడు పాత్రికేయుల సమక్షంలో డయాఫ్రమ్ వాల్ ప్యానల్ మందం.. బావర్ కంపెనీ ప్రతినిధులతో కొలిపించి 1.5 మీటర్లు ఉండడాన్ని చూపించారు. దీనిని 0.9 మీటర్లకు కుదించారంటూ సాక్షి పత్రిక చేస్తున్న ప్రచారం తప్పని నిరూపించారు. గతంలో కూడా పోలవరం డ్యాం ఎత్తు తగ్గించేస్తున్నారంటూ విష ప్రచారం చేసి, వాస్తవాలు తెలుసుకున్న తర్వాత ముఖం చాటేసారని మంత్రి గుర్తుచేశారు. పోలవరం ప్రాజెక్ట్ పూర్తి కావడం అభివృద్ధి నిరోధక వైకాపాకు ఇష్టం లేదన్నారు. కూటమి ప్రభుత్వం చేస్తున్న చారిత్రాత్మక అభివృద్ధి పనులకు అనుక్షణం అడ్డు తగలడానికి వైకాపా ప్రయత్నిస్తోందన్నారు. ఈ క్రమంలో ప్రజలు ఛీదరించుకుంటున్నా ఆ పార్టీకి బుద్ధి రావటం లేదన్నారు.

## 2027 నాటికి పూర్తి

ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఆధ్వర్యంలో పోలవరం ప్రాజెక్టుకు సంబంధించి సీడబ్ల్యుసీ, ఇరిగేషన్ అధికారులు, నిర్మాణ ఏజెన్సీలు సమన్వయంతో కలిసికట్టుగా తీసుకున్న సమయాధారిత నిర్దేశిత షెడ్యూల్ ప్రకారమే ప్రాజెక్టు పనులు శరవేగంగా జరుగుతున్నాయని మంత్రి రామానాయుడు తెలిపారు. అధికారులతో కలిసి పోలవరం ప్రాజెక్టు పనులను పరిశీలించిన మంత్రి నిమ్మల సంతృప్తి వ్యక్తం చేశారు. పోలవరం ప్రాజెక్టు పనులను ఇప్పటికే క్షేత్ర స్థాయిలో ముఖ్యమంత్రి చంద్రబాబు 3 సార్లు పరిశీలించారని మంత్రి చెప్పారు. సెక్రటేరియట్‌లో ప్రతి 15 రోజులకు ఓ సారి పోలవరం పనులపై చంద్రబాబు స్వయంగా సమీక్షిస్తున్నారని చెప్పారు. డయాఫ్రమ్ వాల్ నిర్మాణం ఈ సంవత్సరానికి పూర్తి కావాలన్న లక్ష్యం మేరకే పనులు జరుగుతున్నాయని, అనుకున్న లక్ష్యాన్ని సాధిస్తామన్నారు. వర్షాకాలంలో కూడా పనులు చేసేలా బట్రస్ డ్యామ్ పనులు పూర్తి కావచ్చాయని చెప్పారు. 2027 చివరినాటికి పోలవరం ప్రాజెక్టు పనులు పూర్తి చేసేలా ప్రణాళికాబద్ధంగా పనులు చేస్తున్నాం.. పూర్తిచేసి తీరతామని నిమ్మల ధీమా వ్యక్తం చేశారు.. ఇందులో భాగంగా ఇప్పటికే పోలవరం హెడ్ వర్క్స్ పనులు 80 శాతం పైగా పూర్తయ్యాయని ఆయన వివరించారు. ప్రాజెక్ట్ పనుల్లో ప్రపంచంలోనే పేరెన్నికగన్న జర్మనీకి చెందిన బావర్ కంపెనీ తో "మేఘా" పనులు చేయిస్తుంటే దుష్ప్రచారం చేయడం దుర్మార్గం అన్నారు. వైకాపా హయాంలో పోలవరం ప్రాజెక్టు మాకు అర్థం కాలేదు, ఎప్పటికీ పూర్తవుతుందో చెప్పలేం.. అని చేతులెత్తేసిన, చేతకాని అప్పటి మంత్రులు నేడు పరుగులు పెడుతున్న పోలవరం ప్రాజెక్టును చూసి ఓర్వలేకపోతున్నారన్నారు. సీఎం చంద్రబాబు నేతృత్వంలోని కూటమి ప్రభుత్వం.. పోలవరం ప్రాజెక్టు పనులు వేగవంతం చేసి చూపిస్తుంటే తట్టుకోలేకపోతున్నారని విమర్శించారు. పోలవరం ప్రాజెక్ట్ నిర్మాణంలో నాణ్యత విషయంలో రాజీ పడే ప్రసక్తే లేదని మంత్రి స్పష్టం చేశారు. ప్రధాని మోదీ సహకారంతో చంద్రబాబు సమర్థ నాయకత్వంలో 2027 డిసెంబరు నాటికి పోలవరం ప్రాజెక్టు పూర్తి చేసి చూపిస్తామని మంత్రి రామానాయుడు మరోసారి స్పష్టం చేశారు.

ఈ పర్యటనలో మంత్రి నిమ్మల రామానాయుడుతో పాటు పోలవరం ఎమ్మెల్యే బాలరాజు, పోలవరం నియోజకవర్గం టీడీపీ ఇంచార్జ్ బోరగం శ్రీనివాస్, ఇరిగేషన్ అడ్వైజర్ ఎం. వెంకటేశ్వరరావు, ఈఎన్సీ నరసింహామూర్తి, మేఘా ఇంజనీరింగ్ డైరెక్టర్ సుబ్బయ్య, ఇతర ఇరిగేషన్ అధికారులు, నిర్మాణ ఏజెన్సీల ప్రతినిధులు పాల్గొన్నారు.





# సీఎం చంద్రబాబు విజనరీ నాయకుడు

- కొనియాడిన యూపీ సీఎం యోగి ఆదిత్యనాథ్
- సీఎం యోగిని లక్నోలో కలిసిన మంత్రి నారాయణ

లక్నో (చైతన్యరథం): ఏపీ ముఖ్యమంత్రి చంద్రబాబు విజన్ ఉన్న నాయకుడని ఉత్తరప్రదేశ్ ముఖ్యమంత్రి యోగి ఆదిత్యనాథ్ కొనియాడారు. ఘనవ్యర్థాల ప్లాంట్ల అధ్యయనం కోసం ఉత్తరప్రదేశ్ వెళ్లిన మంత్రి నారాయణ మంగళవారం ఆ రాష్ట్ర రాజధాని లక్నోలోని కాళిదాస్ మార్గ్‌లో ఉన్న యూపీ సీఎం నివాసంలో ముఖ్యమంత్రి యోగి ఆదిత్యనాథ్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు. తొలుత మంత్రి నారాయణ బృందం క్షేత్రస్థాయిలో పర్యటించింది. అనంతరం యూపీ సీఎం, అధికారులతో భేటీ అయింది. ఉత్తరప్రదేశ్‌లో ఘన వ్యర్థాల నిర్వహణ తీరుతెన్నులను ఆ రాష్ట్ర అధికారులు వివరించారు. ఏపీలో సాలిడ్ వేస్ట్ మేనేజ్మెంట్ కోసం ఉపయోగిస్తున్న పద్ధతులను సీఎం యోగి ఆదిత్యనాథ్‌కు మంత్రి నారాయణ, ఏపీ అధికారులు వివరించారు. ఏపీలో అనుసరిస్తున్న పద్ధతులను పరిశీలించేందుకు రావాలని యూపీ అధికారులను మంత్రి నారాయణ ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఏపీ ముఖ్యమంత్రి చంద్రబాబుపై యూపీ సీఎం యోగి ఆదిత్యనాథ్ ప్రశంసలు కురిపించారు. సీఎం చంద్రబాబు మంచి విజన్ ఉన్న నాయకుడని కొనియాడారు.



# స్వర్ణాంధ్ర సాధనే లక్ష్యంగా...

ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడి సారథ్యంలోని కూటమి ప్రభుత్వం నేటికి ఏడాది పాలన పూర్తి చేసుకుంటున్న సందర్భంలో ప్రత్యేక వ్యాసం

# కూటమి ఏడాది పాలన!



**వైసీపీ ఐదేళ్ల పాలనాకాలంలో దెబ్బతిన్న ఏపీ బ్రాండ్ ఇమేజ్‌ను తిరిగి సాధించేందుకు సీఎం చంద్రబాబు చేస్తోన్న ప్రయత్నాలు సత్ఫలితాలిస్తున్నాయి. పారిశ్రామికాభివృద్ధికి ప్రభుత్వం ప్రవేశపెట్టిన పాలసీల వరంగా మారడమే కాదు, పెట్టుబడులకు ఏపీ స్వర్గధామమైంది. రాష్ట్రానికి పెద్దఎత్తున పెట్టుబడులు సాధించి.. రాష్ట్రాదాయం పెంచడమే కాదు, యువతకి ఉపాధి కల్పిస్తానన్న సీఎం మాటపై ప్రజలకు నమ్మకం పెరుగుతోంది. అందుకు తొలి ఏడాదిలో కూటమి ప్రభుత్వం సాధించిన విజయాలే నిదర్శనం! ప్రజాస్వామ్య ప్రభుత్వాలకు గుండెలుంటాయి కానీ హృదయం అరుదు. నేడు అటువంటి హృదయమున్న చంద్రబాబు ప్రభుత్వం రాష్ట్రంలో పాలన సాగిస్తోంది. 2047 విజన్ సాకారం కోసం సీఎం చంద్రబాబు నిర్దేశించుకున్న పది సూత్రాలే ప్రగతికారక ఏపీకి శ్రీరామ రక్ష!!**

గత ఐదేళ్ల జగన్ పాలన రాష్ట్రానికి ఒక పీడకల. రాష్ట్రం ఏర్పడిన తర్వాత తొలి ఐదేళ్లలో జరిగిన అభివృద్ధిని తర్వాత ఐదేళ్ల పాలన విధ్వంసానికి గురిచేసింది. రాష్ట్రంలో ఆర్థిక అరాచకం రాజ్యమేలింది. రాష్ట్రం అప్పుల ఊబిలో కూరుకుపోయింది. సకల వ్యవస్థలు అస్తవ్యస్తమయ్యాయి. వీటిని సరిదిద్ది ప్రగతి రథాన్ని పట్టాలెక్కించడానికి కూటమి ప్రభుత్వానికి పెద్ద సవాల్‌గా మారింది. అందుకే -పునర్నిర్మాణంతో ఏపీని ఛాంపియన్‌గా నిలపాలన్న లక్ష్యంతో సీఎం చంద్రబాబు కాలంతో పోటీపడ్డారు. కేంద్ర సహకారంతో ఏపీని ప్రగతిపథాన నిలపడంపైనే దృష్టి పెట్టారు. కూటమి ఏడాది శ్రమ ఫలించిందన్న విషయాన్ని కేంద్ర గణాంకాలే చెబుతున్నాయి. 2024-25లో జీఎస్‌డీపీ వృద్ధిరేటులోనూ, తలసరి ఆదాయం పెరుగుదలలోనూ రాష్ట్రం గణనీయమైన వృద్ధి సాధించింది. 8.21 శాతం వృద్ధిరేటుతో దేశంలో ఏపీ రెండోస్థానంలో, తలసరి ఆదాయ వృద్ధిలో మూడోస్థానంలో నిలిచిందన్న విషయాన్ని కేంద్ర గణాంకాలే (మినిస్ట్రీ ఆఫ్ స్టాటస్టిక్స్ అండ్ ప్రోగ్రామ్ ఇంప్లిమెంటేషన్) చెబుతున్నాయి. సీఎం చంద్రబాబు నేతృత్వంలో ఏర్పడిన కూటమి ప్రభుత్వ పాలన ఈనెల 12నాటికి ఏడాది పూర్తవుతున్న సందర్భంగా ప్రభుత్వ పనితీరు విశ్లేషించినప్పుడు.. ప్రజాకాంక్షలను నెరవేరుస్తూ.. నమ్మకాన్ని నిలుపుకుంటూ ముందుకు సాగుతోందన్న సంతృప్తికర సమాధానాలే లభిస్తున్నాయి.

వైకాపా ఐదేళ్ల పాలనలో దగాపడ్డ మధ్యతరగతి, అట్టడుగు ప్రజల జీవితాల్లో వెలుగులు నింపడమే లక్ష్యంగా..అన్నివర్గాల జీవనాన్ని గుణాత్మకంగా మార్చే బృహత్తర లక్ష్యంతో విలక్షణ ప్రజా సంక్షేమ పాలనకు శ్రీకారం చుట్టింది కూటమి. రాష్ట్ర ప్రజలు తనపై పెట్టుకున్న నమ్మకాన్ని నిలబెట్టుకోవడానికి చంద్రబాబు 15శాతం వృద్ధి రేటు లక్ష్యంగా ప్రణాళికలు సిద్ధం చేశారు. ఆధునికతను అందిపుచ్చుకొని అద్భుత వ్యూహంతో రెండంకెల వృద్ధి రేటుసాధించి నవ్యాంధ్రను ప్రగతిపథం బాట పట్టించటంలో కృతకృత్యులయ్యారు. ఏడాది పాలనలోనే రాష్ట్రం 8.21 శాతం వృద్ధి సాధించడమే అందుకు నిదర్శనం. సుస్థిర అభివృద్ధి లక్ష్యాల సాధనకు సీఎం చంద్రబాబు ఏపీలో అమలుచేసిన పాలసీలు, విధానాలు రాష్ట్రాభివృద్ధికి ఇతోధికంగా దోహదపడ్డాయి. 2023-24 (వైసీపీ హయాం)లో వృద్ధి రేటు 6.19 శాతమైతే.. 2024-25లో 8.21 శాతం సాధించి దేశంలోనే ఏపీని రెండోస్థానంలో నిలపడం వెనుక కూటమి కృషి లేదని ఎవరనగలరు. ఏడాది కాలంలో వృద్ధి రేటు పెంపు 2.02 శాతం. వ్యవసాయం, పరిశ్రమలు, సేవలు, ఇంధన రంగం సహా పలు విభాగాల్లో తీసుకొచ్చిన పాలనా సంస్కరణలు మెరుగైన ఫలితాలనిచ్చి.. రాష్ట్రాన్ని గాడిలోకి తెస్తున్నాయి. 2024-25లో రాష్ట్రం 8.21 శాతం వృద్ధిరేటుతో రూ.8.65 లక్షల కోట్ల జీఎస్‌డీపీని సాధించిందన్నది కేంద్రం తన నివేదికలో పొందుపర్చిన అంశం. ప్రస్తుత ధరల ప్రకారం 12.02 శాతం వృద్ధిరేటుతో రూ.15.93 లక్షల కోట్ల జీఎస్‌డీపీ నమోదు చేసుకుని 5వ స్థానంలో నిలిచింది. వ్యవసాయ, అనుబంధ రంగాల్లో 15.41 శాతం వృద్ధిరేటు నమోదైంది. వ్యవసాయ రంగంలో 22.98 శాతం, ఉద్యాన రంగంలో 21.29, పారిశ్రామిక రంగంలో 6.4, నిర్మాణ రంగంలో 10.28, ఉత్పాదక రంగంలో 15.18, సేవలు 11.82, విద్య, ఆరోగ్యం 12.15, వాణిజ్యం, హోటళ్లు, ఇతర రంగాల్లో 11.58 శాతం వృద్ధి నమోదైంది. రియల్ ఎస్టేట్స్, ఇతర రంగాలు 11.22 శాతం నమోదు చేశాయి. 2024-25లో తలసరి ఆదాయంలో 11.89 శాతం వృద్ధి నమోదైంది. తలసరి రాబడి రూ.2,66,240కు చేరింది. ఇందులో రాష్ట్రం 3వ స్థానంలో నిలవగా, తమిళనాడు, కర్ణాటక మొదటి రెండు స్థానాల్లో ఉన్నాయి.

వైసీపీ ఐదేళ్ల పాలనాకాలంలో దెబ్బతిన్న ఏపీ బ్రాండ్ ఇమేజ్‌ను తిరిగి సాధించేందుకు సీఎం చంద్రబాబు చేస్తోన్న ప్రయత్నాలు సత్ఫలితాలిస్తున్నాయి. పారిశ్రామికాభివృద్ధికి ప్రభుత్వం ప్రవేశపెట్టిన పాలసీల వరంగా మారడమే కాదు, పెట్టుబడులకు ఏపీ స్వర్గధామమైంది. రాష్ట్రానికి పెద్దఎత్తున పెట్టుబడులు సాధించి.. రాష్ట్రాదాయం పెంచడమే కాదు, యువతకి ఉపాధి కల్పిస్తానన్న సీఎం మాటపై ప్రజలకు నమ్మకం పెరుగుతోంది. అందుకు తొలి ఏడాదిలో కూటమి ప్రభుత్వం సాధించిన విజయాలే నిదర్శనం!

తొలి ఏడాదిలోనే ఎన్నో విజయాలు సాధించింది కూటమి ప్రభుత్వం. చంద్రబాబు గద్దెనెక్కే సమయానికి రాష్ట్రం ఆర్థిక సుడిగుండంలో చిక్కుకునివున్నా వెరవకుండా.. ఇచ్చిన మాటమేరకు పింఛను పథకంపై ముందడుగే వేశారు. అప్పటి వరకూ అమలవుతున్న రూ.3వేల పింఛనును ఒక్కసారిగా వెయ్యి పెంచి రూ.4 వేలను అందించారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు ఏప్రిల్ నుంచే పెంపును వర్తింపజేసి.. జూలై 1న పింఛను కింద రూ.7వేల చొప్పున ఇవ్వడంతోనే కూటమి సర్కారు ప్రజా నమ్మకాన్ని చూరగొంది. 2019లో అధికారంలోకి వచ్చిన జగన్ రూ.2వేల పింఛనును రూ.3వేలు చేయడానికి ఐదేళ్ల సమయం తీసుకున్నారు. అదీ.. దివ్యాంగులకు ఒక్క రూపాయి పెంచలేదు. దివ్యాంగులకిచ్చే రూ.3 వేల పింఛనును రూ.6 వేలకు పెంచి.. తీవ్ర అనారోగ్యంతో మంచాన పడ్డవారికి రూ.5 వేల పింఛనును రూ.15వేలు చేసిన ఘనత కూటమిదే. కిడ్నీ, కాలేయం, గుండె మార్పిడి చేసుకున్న వారికి, డయాలసిస్ స్టేజ్‌కాకుండా ఇంకా ముందున్న కిడ్నీ వ్యాధిగ్రస్తులకు పింఛను కింద అందే రూ.5వేల మొత్తాన్ని రూ.10 వేలకు పెంచారు. జగన్‌రెడ్డి సర్కారు పింఛను సంక్షేమం కోసం నెలకు రూ.1,939 కోట్లు వెచ్చిస్తే.. కూటమి సర్కారు ఎన్టీఆర్ భరోసా సామాజిక భద్రత పథకానికి నెలకు రూ.2,834 కోట్లు ఖర్చు చేస్తోంది. ఒక్క పింఛన్లకే ఏడాదికి రూ.34 వేల కోట్లు... ఐదేళ్ళల్లో రూ.1.7 లక్షల కోట్లు ఖర్చు చేయనుంది.

పేదోడి నోటిదగ్గర కూడు లాగేసి.. జగన్ నిలిపేసిన అన్న క్యాంటీన్లను కూటమి అధికారంలోకి రాగానే పునరుద్ధరించింది. 204 అన్న కాంటీన్లను నెలకొల్పి.. సగటున రోజుకు 3 లక్షల మంది ఆకలి తీరుస్తోంది. దీపం-2 పథకం ప్రారంభించి 2025 మార్చినాటికి తొలి విడతగా 1.15 కోట్లమందికి ఉచిత సిలిండర్ అందించింది. ఏడాదికి 3 ఉచిత సిలిండర్లకు రూ.2,684 కోట్ల వ్యయం కాగా.. ఐదేళ్లలో మొత్తం ప్రభుత్వంపై రూ.13,423 కోట్ల భారం పడనుంది. మూడో విడతనుంచి సిలిండర్‌కి అయ్యే సొమ్మును ముందుగానే లబ్ధిదారుల ఖాతాలో జమ చేయనుంది. 16,347 ఉపాధ్యాయ నియామకాలకు డీఎస్సీ నోటిఫికేషన్ విడుదల చేసింది కూటమి. జగన్ ఐదేళ్ల పాలనాకాలంలో ఒక్క డీఎస్సీ నిర్వహించలేదన్నది అక్షర సత్యం. కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే ఉపాధి రంగానికి ఊతమిచ్చేలా ఉచిత ఇసుక విధానాన్ని అమలు చేసింది. 20 లక్షల ఉద్యోగాల కల్పనకు మార్గాలు సిద్ధం చేస్తోంది. 6,100 పోలీస్ ఉద్యోగాల రిక్రూట్‌మెంట్‌కు చర్యలు తీసుకుంది. రూ.9.4 లక్షల కోట్లు పెట్టుబడులు ద్వారా 6 లక్షల మందికి ఉద్యోగావకాశాలు కల్పించేందుకు రంగం సిద్ధం చేస్తోంది. ల్యాండ్ టైటిలింగ్ యాక్టు రద్దు చేసి ప్రజల ఆస్తులకు రక్షణ కల్పించింది. సబ్‌ప్లాన్ నిధులను మళ్ళించకుండా.. బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనారిటీల స్వయం ఉపాధి పథకాలకు వెచ్చిస్తోంది. సుప్రీం కోర్టు తీర్పు మేరకు ఎస్సీ వర్గీకరణ అమలుకు రంగం సిద్ధం చేసింది. ఇంటర్ విద్యార్థులకు తిరిగి మధ్యాహ్న భోజనం ప్రారంభించింది. గంజాయి, డ్రగ్స్, ల్యాండ్, శాండ్, వైన్, మైన్ మాఫియాలపై ఉక్కుపాదం మోపింది. గుంతలమయమైన 20 వేల కి.మీ రోడ్లు మరమ్మత్తులు చేసింది. వీటితోపాటు, సీసీ, బీటీ, రాష్ట్ర రహదారులు 7వేల కి.మీ నిర్మిస్తోంది. ఒకేరోజు 13,326 పంచాయతీల్లో గ్రామ సభలు నిర్వహించి రికార్డు సృష్టించింది. 15వ ఆర్థిక సంఘం నిధులు రూ.1,987 కోట్లు పంచాయతీలకు విడుదల చేసింది. అన్నదాత సుఖీభవ పథకం కింద దాదాపుగా 55 లక్షలమంది రైతులకు ఆర్థిక సాయం అందిస్తోంది. పీఎం కిసాన్‌తో కలిపి ఏడాదికి మూడు విడతల్లో రూ.20 వేలు ఇచ్చేందుకు నిర్ణయం తీసుకుంది. బడికి వెళ్లే పిల్లలు ఎంతమంది ఉన్నా.. తల్లికి వందనం కింద ఒక్కొక్కరికీ ఏడాదికి రూ.15 వేల చొప్పున ఆర్థికసాయం ఈనెల నుంచే అందించనుంది. వ్యవసాయ ఉత్పత్తి ఖర్చులు తగ్గించి దిగుబడులు పెంచేందుకు అత్యాధునిక సేద్యం ఆవిష్కరణలకు శ్రీకారం చుట్టింది. అంతర్జాతీయంగా వస్తోన్న సాంకేతిక మార్పులకు అనుగుణంగా ఏఐ ద్వారా ఆధునిక లాభసాటి సేద్యంవైపు రైతులను మళ్లిస్తోంది. ప్రకృతి వ్యవసాయానికి ప్రాధాన్యతనిచ్చి.. ఆరోగ్యకర సేద్యపు వాతావరణాన్ని ఆవిష్కరించే ప్రణాళికలు అమలు చేస్తోంది.



అనేక విభాగాలకు గత ప్రభుత్వం పెట్టిన బకాయిలు రూ.24 వేల కోట్లు కూటమి సర్కారు చెల్లించింది. పోలవరానికి కేంద్రంనుంచి రూ.12,157కోట్లు సాధించింది. నిర్వాసితులకు రూ.1,000 కోట్లు చెల్లించింది. ప్రజా రాజధాని అమరావతి నిర్మాణాలకు కేంద్రం నుంచి రూ.15 వేల కోట్లు సాధించింది. విశాఖ స్టీల్ పరిరక్షణకు రూ.11వేల కోట్లు, విశాఖ రైల్వే జోన్ ప్రధాన కార్యాలయానికి ప్రధాని శంకుస్థాపన, ఓర్వకల్లు పారిశ్రామికవాడకు రూ.2,786 కోట్లు, కొప్పర్తి పారిశ్రామికవాడకు రూ.2,137 కోట్లు కేంద్రంనుంచి సాధించడం విశేష ఫలితమే. హంద్రీనీవా విస్తరణకు రూ.3,800 కోట్లతో వేగంగా పనులు నిర్వహిస్తోంది. కర్నూలుకు హైకోర్టు బెంచ్ ఏర్పాటుకు నిర్మాణాత్మక కృషి సలిపింది. ఐదు మెడికల్ కళాశాలల నిర్మాణానికి రూ.1,198.12కోట్లు కేటాయించింది. ప్రతి ఇంటికి తాగునీరు అందించేందుకు జల జీవన్ మిషన్ పునరుద్ధరించింది. కర్నూల్‌లో 300 ఎకరాల్లో డ్రోన్ హబ్ ఏర్పాటు, 35వేల డ్రోన్ పైలట్లకు శిక్షణ లక్ష్యంగా పెట్టుకుంది. 2024-25లో రాష్ట్ర జీడీపీ రూ.16 లక్షల కోట్లకు చేరుకుంది. సుదీర్ఘ సముద్ర తీరం, విశాల భూభాగం, పెట్టుబడులకి అనుమైన వాతావరణం, అందుబాటులో మానవ వనరులు.. అన్నిటికీతోడు రాష్ట్రాన్ని సమర్థంగా ముందుకు నడిపే నాయకుడు. వెరసి ముక్కోణపు వ్యూహంతో ఏపీ ముందడుగు వేసింది, వేస్తోంది. భవిష్యత్ అవసరాల్ని అందుకునే భారీ ప్రణాళికలు ఇప్పటికే ఉన్నాయి. స్వర్ణాంధ్రగా తనని తాను ఆవిష్కరించుకునే దిశగా ఆంధ్రప్రదేశ్ అడుగులేస్తోంది. మొత్తంమీద శిథిలం నుంచి శిఖరంవైపు సాగుతోన్న ప్రయాణం.. ఏడాది పాలనా కాలంలో స్పష్టంగా కనిపిస్తోంది!

ఆంధ్రప్రదేశ్‌ను అమరావతి, తిరుపతి, కర్నూలు-ఓర్వకల్లు, గోదావరి జోన్లుగా విభజించి ప్రాంతీయంగా అభివృద్ధి చేయాలని, రాష్ట్రంలో అతిపెద్ద నగరమైన విశాఖపట్నాన్ని ఆర్థిక కేంద్రంగా అభివృద్ధి చేయడానికి మాస్టర్ ప్లాన్ సిద్ధం చేసింది ఏపీ సర్కారు. ప్రస్తుతం అమరావతిలో క్వాంటం వ్యాలీ, కర్నూలు-ఓర్వకల్లులో డ్రోన్ సిటీ, విశాఖపట్నంలో మెడిటెక్ జోన్లను అభివృద్ధి చేయాలని, వీటికితోడు విశాఖ-చెన్నై, హైదరాబాద్- బెంగళూరు, చెన్నై-బెంగళూరు ఇండస్ట్రియల్ కారిడార్లలో పారిశ్రామిక నగరాల అభివృద్ధికి శ్రీకారం చుడుతోంది. రాష్ట్రంలో అత్యధిక సంఖ్యలో బ్లూ, వైట్‌కాల్ జాబ్‌లు సృష్టించి ప్రత్యక్షంగా, పరోక్షంగా పనిచేసే వాతావరణాన్ని కల్పించే ప్రణాళికలు అమలు చేస్తోంది. సౌర, పవన, బ్యాటరీ, గ్రీన్ హైడ్రోజన్, గ్రీన్ అమ్మోనియా, పంప్డ్ స్టోరేజీ ఉత్పత్తి ద్వారా రాష్ట్రాన్ని గ్రీన్ ఎనర్జీ హబ్ తయారుచేసే దిశగా ప్రయాణం సాగిస్తోంది. రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాటు చేస్తున్న రతన్ టాటా ఇన్నోవేషన్ హబ్ రాష్ట్రంలో నవకల్పనలను ప్రోత్సహించి పరిశ్రమ- విద్యారంగం మధ్య అనుసంధానాన్ని ఏర్పాటు చేసి, వర్క్ ఫ్రం హోం విధానాన్ని ప్రోత్సహించాలని చంద్రబాబు సారథ్యంలోని కూటమి ప్రభుత్వం కృషి చేస్తోంది. ప్రజాస్వామ్య ప్రభుత్వాలకు గుండెలుంటాయి కానీ హృదయం అరుదు. నేడు అటువంటి హృదయమున్న ప్రభుత్వం రాష్ట్రంలో పాలన సాగిస్తోంది. పీ-4తో నిరుపేద రహిత రాష్ట్రంగా ఏపీని తీర్చిదిద్దేందుకు చంద్రబాబు కంకణం కట్టుకున్నారు. 2047 విజన్ సాకారం కోసం సీఎం చంద్రబాబు నిర్దేశించుకున్న పది సూత్రాలే శ్రీరామ రక్ష!

- నీరుకొండ ప్రసాద్



# భగవంతుడు విధించే శిక్షకు జగన్, ఆయన బ్యాచ్ సిద్ధంగా ఉండాలి

**- టీడీపీ పొలిట్‌బ్యూరో సభ్యుడు వర్ల రామయ్య**

అమరావతి (చైతన్యరథం): సాక్షి టీవీలో జరిగిన డిబేట్‌లో మహిళల గురించి అత్యంత నీచంగా మాట్లాడించిన వారిని భగవంతుడు క్షమించబోడని టీడీపీ పొలిట్‌బ్యూరో సభ్యుడు వర్ల రామయ్య స్పష్టం చేశారు. సాక్షి డిబేట్‌ను మహాభారతంలోని దుశ్శాసన పర్వంతో పోలుస్తూ ఎక్స్‌లో వర్ల పోస్ట్ చేశారు.

జగన్ రెడ్డీ.. ఆనాడు మహా భారతంలో కౌరవ సభలో ఓ మహిళ వలువలూడదీస్తే, కురుక్షేత్ర సంగ్రామంలో కౌరవులందరూ హతులయ్యారు. ఈనాడు మీ సాక్షి చానల్లో అమరావతి మహిళలను అత్యంత జుగుప్సాకరంగా, వారి వ్యక్తిత్వాన్ని హననం చేసే రీతిలో అవమానించిన మీకు, మీ సైన్యానికి భగవంతుడేమి శిక్ష విధిస్తాడో.. అని వర్ల రామయ్య పోస్ట్ చేశారు.

# మహిళల భద్రతే కూటమి ప్రభుత్వ లక్ష్యం

**కడుపు మంటతో వైసీపీ దుష్ప్రచారం: ఎమ్మెల్యే బండారు శ్రావణి**

అమరావతి (చైతన్యరథం): పూటకో కుట్ర, రోజుకో కుతంత్రం పన్నుతూ రాష్ట్ర ప్రతిష్టకు మచ్చ తేవడమే అజెండాగా వైసీపీ నేతలు వ్యవహరిస్తున్నారని అనంతపురం జిల్లా శింగనమల ఎమ్మెల్యే బండారు శ్రావణి ఆగ్రహం వ్యక్తం చేశారు. పటిష్టమైన శాంతిభద్రతలతో దేశ, విదేశాల నుంచి పెట్టుబడులు తీసుకువచ్చేందుకు ప్రభుత్వం కృషి చేస్తుంటే వైసీపీ నేతలు ఓర్వలేక తప్పుడు ప్రచారాలు చేస్తున్నారని దుయ్యబట్టారు. తాడేపల్లి ప్యాలెస్‌కు టు లెట్ బోర్డు పెడుతున్నారనే భయంతో వైసీపీ నేతలు చెవిరెడ్డి భాస్కర్ రెడ్డి, కరుణాకర్ రెడ్డి, ఆర్.కె.రోజా, అంబటి రాంబాబు, కన్నబాబు వంటి వారు మీడియా ముందుకు వచ్చి నోరుపారేసుకుంటున్నారు. బూతు భాషే వీరి అధికార భాషగా అయిదేళ్లపాటు వ్యవహరించారు. ఇప్పుడు శవ రాజకీయాలే నైజం.. అబద్ధాలను నిజాలుగా ప్రచారం చేయడమే అజెండాగా, కులచిచ్చులు పెట్టడమే ధ్యేయంగా వ్యవహరిస్తున్న వైసీపీ నేతల తీరును



ప్రజలు గమనిస్తున్నారు. గత మూడు రోజులుగా మీడియా, సోషల్ మీడియా, ట్విట్టర్ ద్వారా ఒక్క వైసీపీ నేత కూడా మహిళా లోకంపై కొమ్మినేని, కృష్ణంరాజు, సజ్జల చేసిన వ్యాఖ్యలను ఖండించకపోవడం వైసీపీ దిగజారుడుతనానికి నిదర్శనం. విద్వేషాలను విరజిమ్మే క్రూర మృగాలపై చర్యలు తీసుకోవడం నేరమా? రక్తం పంచుకుని పుట్టిన సొంత చెల్లెలే జగన్ రెడ్డి నుంచి తనకు ప్రాణహాని ఉందని బహిరంగంగా చెప్పిన విషయం వాస్తవం కాదా? ఒక్క అవకాశం అంటూ అధికారంలోకి వచ్చి వైసీపీ చేసిన అరాచకాన్ని, విధ్వంసాన్ని ప్రజలు మరిచిపోలేదు. కూటమి ప్రభుత్వ హయాంలో శాంతిభద్రతలు పటిష్టంగా ఉన్నాయి. మహిళలు నిర్భయంగా తిరుగుతున్నారు.. ప్రజలు స్వేచ్ఛగా మాట్లాడుకుంటున్నారు. మహిళల భద్రత కోసం శక్తి యాప్, 164 శక్తి టీమ్‌లు రాష్ట్రవ్యాప్తంగా ఏర్పాటు చేసి మహిళలపై కన్నెత్తి చూడాలంటే భయపడే పరిస్థితిని ప్రభుత్వం కల్పించింది. ప్రభుత్వ చర్యలతో రాష్ట్రంలో అత్యాచారాలు, కిడ్నాప్‌లు, వేధింపులు గణనీయంగా తగ్గిన విషయాన్ని కూడా వక్రీకరించి వైసీపీ నేతలు విష ప్రచారం చేస్తున్నారు. 24/7 పోలీసు పెట్రోలింగ్, ఈవ్ టీజింగ్‌పై ఉక్కుపాదం, గంజాయి, డ్రగ్స్‌పై నియంత్రణతో రాష్ట్రం సుభిక్షంగా ఉంది, ప్రజలు సంతోషంగా ఉన్నారని ఒక ప్రకటనలో ఎమ్మెల్యే శ్రావణి పేర్కొన్నారు.

# విశాఖలో యోగా డే విజయవంతం చేయాలి

**- శాప్ ఛైర్మన్ రవినాయుడు**




అమరావతి (చైతన్యరథం): విశాఖపట్టణంలో ఈనెల 21న జరగనున్న అంతర్జాతీయ యోగా దినోత్సవంలో ప్రధాని నరేంద్ర మోదీ పాల్గొంటున్న సందర్భంగా యోగాంధ్ర కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఏపీ స్పోర్ట్స్ అథారిటీ ఛైర్మన్ రవినాయుడు పిలుపు ఇచ్చారు. విజయవాడ ఆటోనగర్‌లోని యోగా అసోసియేషన్ ఆఫ్ ఆంధ్రప్రదేశ్ ప్రధాన కార్యాలయంలో యోగా అసోసియేషన్ గౌరవ అధ్యక్షుడు గొట్టిపాటి రామకృష్ణప్రసాద్, ఆచార్య నాగార్జున యూనివర్సిటీ యోగా హెచ్ఓడీ రాధిక నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు.

# సర్పంచ్‌గా రూ.50 లక్షల దుర్వినియోగం

**- వైసీపీ ఎమ్మెల్యే తాటిపర్తి చంద్రశేఖర్ వదినపై ఫిర్యాదు**
**- అవినీతిని బయట పెట్టిన తమ ఇళ్లపై ఆ పార్టీ నేతలు దౌర్జన్యం చేశారని ఆవేదన**
**- వివిధ సమస్యలపై టీడీపీ కేంద్ర కార్యాలయానికి తరలి వచ్చిన అర్జీదారులు**
**- వినతులు స్వీకరించిన గుమ్మడి గోపాలకృష్ణ, నరసింహ యాదవ్**




అమరావతి (చైతన్యరథం): వివిధ సమస్యలతో బాధపడుతున్న ప్రజలు వాటి పరిష్కారం కోసం మంగళగిరిలోని టీడీపీ కేంద్ర కార్యాలయానికి తరలివచ్చారు. భారీగా తరలివచ్చిన అర్జీదారుల నుంచి నాటక అకాడమీ చైర్మన్ గుమ్మడి గోపాలకృష్ణ, యాదవ కార్పొరేషన్ చైర్మన్ నరసింహ యాదవ్ మంగళవారం వినతులు స్వీకరించి వాటి పరిష్కారానికి కృషి చేశారు.

ఐనాబత్తిన రాజేష్ అర్జీ ఇస్తూ..యర్రగొండపాలెం వైసీపీ ఎమ్మెల్యే తాటిపర్తి చంద్రశేఖర్‌కు వదిన అయిన సింగరాయకొండ వైసీపీ సర్పంచ్ బాధ్యతలు చేపట్టినప్పటి నుండి  దాదాపు రూ. 50 లక్షలకు పైగా ప్రజాధనాన్ని స్వాహా చేశారని ఫిర్యాదు చేశారు. విచారణ అధికారులు కూడా నివేదికల ద్వారా దీన్ని నిర్ధారించి చెక్ పవర్ ఉన్న సర్పంచ్, కార్యదర్శులిద్దరిపై చర్యలు తీసుకోకుండా కార్యదర్శిని మాత్రమే సస్పెండ్ చేశారని తెలిపారు. ఆమె అవినీతి బయట పెట్టడంతో వైసీపీ గూండాలు తమ ఇళ్ళు, షాపులపై దౌర్జన్యానికి వచ్చారని.. అవినీతికి పాల్పడిన సర్పంచ్‌పై ఉన్నతాధికారులు ఉదాసీనంగా వ్యవహరించడం వలనే ఇలాంటి పరిస్థితులు తలెత్తుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా అధికారులు అవినీతి సర్పంచ్‌పై చర్యలు తీసుకోవాలని కోరారు.

ప్రకాశం జిల్లా త్రిపురాంతకం మండలం మేడపికి చెందిన మర్రి వీరాంజనేయులు విజ్ఞప్తి చేస్తూ..  పల్నాటి వీరులు యుద్ధరంగంలో ఉపయోగించిన ఆయుధాలను ఉంచుటకు అప్పుడు వీర్ల గుడిని ఏర్పాటు చేశారని, గ్రామంలోని శ్రీ లక్ష్మీ చెన్నకేశవస్వామి గుడి నుండి వీర్ల గుడి వరకు నాడు రోడ్డును వేశారని, ఈరోడ్డు నేడు అన్యాక్రాంతం అవ్వడంతో సుమారు మూడు కిలోమీటర్లు తిరిగి గుడికి వెళ్లాల్సి వస్తోందని తెలిపారు. దయచేసి అధికారులు సర్వే చేపట్టి కబ్జాకు గురైన దారిని పున:నిర్మాణం చేపట్టాలని విజ్ఞప్తి చేశారు.

అనంతపురం జిల్లా సింగనమల మండలం, సి. బండమీద పల్లి గ్రామానికి చెందిన మన్నెపాకుల భాస్కర్ విజ్ఞప్తి చేస్తూ.. వెంకట స్వామి అనే వ్యక్తి దౌర్జన్యంగా తమ భూమిని ఆక్రమించుకొని చీనీ చెట్లను నాటాడని ఫిర్యాదు చేశారు. అధికారులు వచ్చి పరిశీలించి అక్రమంగా నాటిన చీనీ చెట్లను తొలగించాలని చెప్పినా అతను అధికారుల మాట కూడా లెక్కచేయకుండా తమను బెదిరిస్తున్నాడని ఆవేదన వ్యక్తం చేశారు.





అతని వల్ల తమకు ప్రాణహాని ఉందని, తగు చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు.

జగన్ రెడ్డి వలన మున్సిపాలిటీలో నాన్ పిహెచ్ వర్కర్స్ గా పనిచేస్తున్న తాము తీవ్రంగా నష్టపోయామని.. తమకు జీతం పెంచకుండా విభజించు-పాలించు విధానంతో  తమకు అన్యాయం చేశాడని.. దయచేసి కూటమి ప్రభుత్వం తమకు న్యాయం చేయాలని పలువురు మున్సిపల్ ఇంజనీరింగ్ వర్కర్స్ అభ్యర్థించారు.

గుంటూరు జిల్లా తాడేపల్లి మండలం పెనుమాక గ్రామానికి చెందిన సీహెచ్ చిన్ని విజ్ఞప్తి చేస్తూ..  ఇళ్లలోని వాడకపు నీటిని దిగువకు వెళ్లనివ్వకుండా అడ్డకట్టలు వేయడంతో ఈగలు దోమలు వ్యాప్తి చెంది ప్రజలు అంటువ్యాధుల బారిన పడే అవకాశముందుని.. కొత్తూరు సెంటర్ మసీదుకు ఎదురు రోడ్డులో నీరు దిగువకు వెళ్లేలా కాలువ ఏర్పాటు చేయాలని విజ్ఞప్తి చేశారు.

APSWR SCHOOL/ COLLEGESలో పార్ట్ టైమ్ టీచర్స్‌గా కొన్ని సంవత్సరాలుగా పనిచేస్తున్న తమకు శాలరీ పెరుగుదల లేక, జాబ్ సెక్యూరిటీ లేక ఇబ్బంది పడుతున్నామని.. దయచేసి తమ సమస్యను పరిష్కరించాలని పలువురు టీచర్లు అభ్యర్థించారు.

గుంటూరు జిల్లా తాడేపల్లి మండలం సీతానగరంకు చెందిన కె. నారాయణ విజ్ఞప్తి చేస్తూ.. తమ వీధిలో రోడ్డు, డ్రైన్ సదుపాయాలు కల్పించి వీధి దీపాలు వేయాలని అభ్యర్థించారు.

# రాక్షసుల్లా వైసీపీ నేతల తీరు

- సజ్జలది అసలు మానవజాతేనా?
- రాష్ట్రంలో మంచి జరుగుతుంటే ఓర్వ లేకపోతున్నారు
- కుట్రలతో రాష్ట్రంలో కల్లోలం సృష్టించేయత్నం
- జగన్ రెడ్డి, భారతి, సజ్జల మహిళలకు బహిరంగ క్షమాపణ చెప్పాలి
- ఎమ్మెల్యే నసీర్ అహ్మద్, యాదవ కార్పొరేషన్ చైర్మన్ నరసింహ యాదవ్ డిమాండ్





అమరావతి (చైతన్యరథం): మహిళలను కించపరిచేలా మాట్లాడిన కొమ్మినేని, కృష్ణంరాజు, సజ్జల రామకృష్ణారెడ్డికి కొమ్ముకాస్తున్న జగన్ రెడ్డి, భారతి వెంటనే మహిళా లోకానికి బహిరంగ క్షమాపణ చెప్పాలని గుంటూరు ఈస్ట్ ఎమ్మెల్యే నసీర్ అహ్మద్, యాదవ కార్పొరేషన్ చైర్మన్ నరసింహ యాదవ్ డిమాండ్ చేశారు. మంగళగిరిలోని టీడీపీ కేంద్ర కార్యాలయంలో మంగళవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ రాష్ట్రంలో జరుగుతున్న అభివృద్ధిని అడ్డుకునేందుకు వైసీపీ నేతలు రాక్షసుల మాదిరిగా వ్యవహరిస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు.

**ఎవరిది సంకరజాతి: ఎమ్మెల్యే నసీర్**

ఎమ్మెల్యే నసీర్ అహ్మద్ మాట్లాడుతూ హిందూ, బౌద్ధ ధర్మాల కర్మభూమిగా.. శాతవాహనుల రాజధానిగా ఉన్నటువంటి అమరావతి ప్రాంతంలో రాష్ట్రం కోసం, రాష్ట్ర హితం కోసం గతంలో ఎక్కడా చేపట్టని విధంగా ఒక మహా ఉద్యమాన్ని చేపట్టి ఆంధ్రరాష్ట్ర ప్రతిష్టను కాపాడిన మహిళలను వైసీపీ దుష్టులు విమర్శించడం చాలా దారుణం అన్నారు. సాక్షి ఛానల్లో కూర్చున్న కొమ్మినేని శ్రీనివాసరావు, వీవీఆర్ కృష్ణంరాజు, సజ్జల మాట్లాడిన మాటలు యావత్ సభ్య సమాజం తలదించుకునేలా ఉన్నాయి. సభ్య సమాజం అసహ్యించుకునేలా వారి వ్యాఖ్యలున్నాయి. ఇలాంటి వారిని జగన్ రెడ్డి కాపాడుతున్నాడంటే.. జగన్ రెడ్డికి మహిళల పట్ల ఉన్న గౌరవం ఏంటో అర్థం అవుతుంది. వైసీపీ హయాంలో రాజధానిగా అమరావతిని కొనసాగించాలని ఉద్యమం చేస్తే.. అమరావతి మహిళలను నాడు ఎన్నో రకాలుగా అవమానించేలా మాట్లాడారు. ఐదేళ్ల వైసీపీ పాలనలో అనేక చోట్ల మహిళలపై దాడులు, అఘాయిత్యాలు జరిగినా జగన్ రెడ్డి కనీసం స్పందించలేదు. పెయిడ్ ఆర్టిస్టులను పెట్టుకొని మీడియాను నడుపుతున్న జగన్ రెడ్డి.. ప్రతి సారీ మహిళలను కించపరిచే విధంగా వ్యవహరిస్తున్నారు. దీనిపై రాష్ట్రంలోని ప్రతి తల్లి, చెల్లి ఆలోచించాలి. నాడు కల్తీ మద్యంతో వేలాదిమందిని పొట్టన పెట్టుకున్నాడు. నేడు సిగ్గులేకుండా మహిళలపై ఇష్టం వచ్చినట్లు మాట్లాడుతున్నారు. జగన్ రెడ్డి ఇచ్చిన స్క్రిప్ట్ మేరకే సజ్జల మాట్లాడుతున్నాడు. నిరసన తెలుపుతున్న వారంతా సంకరజాతి వారు, పిశాచులు, రాక్షసులని నోరు పారేసుకుంటున్న సజ్జలది మానవజాతా కాదా అనే అనుమానం వస్తోంది. తాడేపల్లి ప్యాలెస్ నుంచి వచ్చే కుక్క బిస్కెట్ల కోసం మహిళలను అగౌరవపరచిన సజ్జల రామకృష్ణారెడ్డే అసలైన సంకరజాతి. రాష్ట్ర మహిళలను వేశ్యలతో పోల్చినా ఖండించని సజ్జలే సంకరజాతి. తల్లిని, చెల్లిని మెడపట్టి బయటకు గెంటిన తాడేపల్లి పెద్దలది సంకరజాతి. నిరుద్యోగ యువత రాత్రింబవళ్లు శ్రమించి ఏపీపీఎస్సీ పరీక్షలు రాస్తే అందులో అర్హులను పక్కనపెట్టిన వైసీపీ నేతలే అసలు సిసలైన సంకరజాతి. కమీషన్ల కోసం కల్తీ మందును విక్రయించి 30 వేల మంది మహిళల తాళిబొట్లు తెంచిన వైసీపీ లిక్కర్ మాఫియానే సంకరజాతి. వక్ఫ్ భూములు అన్యాక్రాంతం చేసి మైనారిటీలపై అక్రమ కేసులతో వేధించిన వైసీపీ నేతలే సంకరజాతి. 27 దళిత పథకాలను, 16 ఎస్టీ పథకాలను, 30 బీసీ పథకాలను, 11 మైనారిటీ పథకాలను రద్దు చేసి సంక్షేమ ఫలాలను దూరం చేసిన వైసీపీ నేతలే సంకరజాతి. పేదల రేషన్ బియ్యాన్ని మాయం చేసి విదేశాలకు తరలించినవారు, సెంటు పట్టాల పేరుతో ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీల భూములు లాక్కున్నవారు, రైతులు పండించిన పంటలను అమ్ముకోవడానికి కూడా కమీషన్ తీసుకున్న వైసీపీ నేతలే సంకరజాతి అని ఎమ్మెల్యే నసీర్ మండిపడ్డారు. ఇప్పటికైనా మహిళా లోకాన్ని క్షమించమని అడిగి ఇటువంటి చౌకబారు విమర్శలు మానుకోవాలి. నీచరాజకీయాలు చేస్తున్న వైసీపీ నేతలు త్వరలోనే తగిన మూల్యం చెల్లించుకుంటారు.

**సంఘవిద్రోహ శక్తిగా మారిన సజ్జల**

సొంత బాబాయి హత్య కేసులో నిందితులను కాపాడుతున్న వారిని, గొడ్డలిపోటును గుండెపోటుగా ప్రచారం చేసిన వారిని, సొంత చెల్లికి న్యాయం చేయలేని వారిని ఏ జాతి అని పిలవాలి? వైసీపీ హయాంలో కండకావరంతో, అధికారమదంతో వాడు వీడు, నరుకుతాం, చంపుతాం, భూస్థాపితం చేస్తాం, అడ్రస్ లేకుండా చేస్తాం అని మాట్లాడిన వైసీపీ నేతలని ఏమని పిలవాలి? వైసీపీ నేతలు వ్యవహరిస్తున్న తీరును, వారు మాట్లాడుతున్న మాటలను ప్రజలంతా గమనిస్తున్నారు. తప్పు చేసిన వారికి, చట్టాన్ని ఉల్లంఘించి వ్యవహరించిన వారందరికీ శిక్ష తప్పదు. వైసీపీ నేతలందరూ త్వరలోనే తగిన మూల్యం చెల్లించక తప్పదు. ప్రజా సమస్యలను వెలుగులోకి తీసుకొస్తూ గౌరవ మర్యాదలతో వ్యవహరిస్తూ అందరికీ ఆదర్శంగా రాజకీయాలు చేసే నేతలు చరిత్రలో నిలిచిపోతారు. పుచ్చలపల్లి సుందరయ్య, గౌతు లచ్చన్న, ఎన్జీ రంగా, చెన్నమనేని రాజేశ్వరరావు, వెంకయ్యనాయుడు వంటి నాయకులు తమ ప్రసంగాలతో తెలుగు ప్రజలకు ప్రత్యేక గుర్తింపు తీసుకొచ్చారు. కానీ వైసీపీ నేతలు తమ భాషతో జాతీయంగా, అంతర్జాతీయంగా తలవంపులు తెస్తున్నారు. సభ్య సమాజం తలదించుకునేలా సంస్కారహీనంతో చిల్లర మాటలు మాట్లాడే నేతలు రాజకీయంగా కనుమరుగవడం, ఆ పార్టీలు అంతరించిపోవడం ఖాయం. పుట్టలోనుంచి పాములు బయటకు వచ్చినట్లు వైసీపీ నేతల కుంభకోణాలు రోజుకొకటి బయటకు వస్తున్నాయి. మద్యం కుంభకోణం, ఏపీపీఎస్సీ కుంభకోణం, భూముల కుంభకోణం, ఇసుక అక్రమాలు, వంటి అంశాల నుంచి ప్రజల దృష్టిని మళ్ళించేందుకు నీచాతినీచంగా మాట్లాడుతూ సభ్య సమాజం తలదించుకునేలా వైసీపీ నేతలు వ్యవహరిస్తున్నారు. వైసీపీ నేతలు కనీసం పశ్చాత్తాపం వ్యక్తం చేయకుండా నియంతృత్వంతో, అదే ధోరణితో మాట్లాడుతున్నారు. రాష్ట్ర మహిళలను సంకరజాతి అంటూ వైసీపీ నేత, ప్రభుత్వ మాజీ సలహాదారు సజ్జల రామకృష్ణారెడ్డి చేసిన వ్యాఖ్యలను తీవ్రంగా ఖండిస్తున్నాం. సజ్జల, సాక్షి ప్యానలిస్టు కృష్ణంరాజు వ్యాఖ్యలపై జగన్ రెడ్డి, భారతీరెడ్డిలు ఇప్పటివరకు నోరు తెరవకుండా ఉండడం వారి దిగజారుడు రాజకీయాలకు నిదర్శనం. వారి వ్యాఖ్యలు తప్పని ఎందుకు చెప్పలేకపోతున్నారు? జాతీయ మహిళా కమిషన్ సైతం మహిళలపై కృష్ణంరాజు చేసిన వ్యాఖ్యలను ఖండించింది. జగన్ రెడ్డి మాత్రం నోరు మెదపక పోవడం దేనికి సంకేతం? మహిళలపై కనీస గౌరవం లేకుండా మొన్న రాష్ట్ర మహిళలను వేశ్యలతో పోల్చారు. నిన్న సంకరజాతితో పోల్చిన వైసీపీ నేత సజ్జల రామకృష్ణారెడ్డి సంఘ విద్రోహ శక్తిగా మారాడు. ఎవరి కళ్లల్లో ఆనందం చూడడానికి ఇటువంటి వ్యాఖ్యలు చేస్తున్నారో ప్రజలు గమనించాలి.

**రాష్ట్రంలో కల్లోలానికి కుట్రలు: నరసింహయాదవ్**

నరసింహ యాదవ్ మాట్లాడుతూ..నాడు వ్యవస్థలను జగన్ రెడ్డి నిర్వీర్యం చేసి ధ్వంసం చేశాడని దుయ్యబట్టారు. జగన్ రెడ్డి ధ్వంసం చేసిన వ్యవస్థలను అపారమైన అనుభవంతో నేడు సీఎం చంద్రబాబు నాయుడు గాడిలో పెడుతున్నారు. ఇది రాష్ట్ర ప్రజలందరూ చూస్తున్నారు. ప్రజలు ఎటువంటి పాలనను కోరుకున్నారో వారు కోరుకున్న విధంగా పాలన అందిస్తూ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్, మంత్రి నారా లోకేష్.. కేంద్రం సహకారంతో రాష్ట్రాన్ని ముందుకు తీసుకెళుతున్నారు. అరాచక పాలన అందించిన వైసీపీని ప్రజలు ఛీదరించుకొని 11 సీట్లకు పరిమితం చేసినా గుణపాఠం నేర్చుకోక పోగా.. నేడు మహిళలను అవమానిస్తున్నారు. జగన్ రెడ్డి కూడా తనకు ఒక మహిళే జన్మనిచ్చిందని మరిచి వ్యవహరిస్తున్నాడు. మా నాయకుడు, టీడీపీ నేతలు ఏనాడు కూడా మహిళల గురించి ఒక్క మాట కూడా అసభ్యంగా మాట్లాడలేదు. కానీ వైసీపీ నేతలు దేవాలయం లాంటి అసెంబ్లీలో భువనేశ్వరిపై అసభ్యంగా మాట్లాడారు. ఎన్ని కష్టాలు వచ్చినా చలించని మా నాయకుడు చంద్రబాబు నాయుడి మనో ధైర్యాన్ని దెబ్బతీసే విధంగా ఆయనతో కంటతడి పెట్టించారు.

నేడు మళ్లీ అమరావతికోసం ఆస్తులను త్యాగం చేసిన మహిళలను వేశ్యలంటూ, సంకర జాతి అంటూ మాట్లాడుతున్నారు. సజ్జల స్టేట్మెంట్ చూస్తే.. ప్రశాంతమైన రాష్ట్రంలో కల్లోలం సృష్టించాలని కుట్రచేస్తున్నట్లుగా కనపడుతోంది. వీరి మాటలపై పెద్ద ఎత్తున మహిళలు నిరసన తెలియజేస్తుంటే జగన్ రెడ్డికి, భారతీరెడ్డికి చీమకుట్టినట్లు గా కూడా లేదు. న్యాయం, ధర్మం నీతి, నిజాయతీ, గౌరవాలనేవి వైసీపీ నేతల డిక్షనరీలోనే లేవు. లేదంటే ఒక రాష్ట్రానికి ముఖ్యమంత్రిగా పనిచేసిన వ్యక్తి ఇలాంటి మాటలను కచ్చితంగా ఖండించేవారు. ఐదేళ్ల వైసీపీ పాలనలో రాష్ట్ర ఖాజాను కొల్లగొట్టారు. నేడు ప్రజలకు కూటమి ప్రభుత్వం మేలు చేస్తుంటే చూసి ఓర్వలేకపోతున్నారు. వైసీపీ నేతల వ్యాఖ్యలను మేధావులు, జాతీయ మహిళా కమిషన్ కూడా తప్పు పట్టింది. అయినా వైసీపీ నేతలు మారడంలేదు. మద్యం కుంభకోణంలో అన్ని వేళ్లు జగన్ వైపు చూపిస్తుంటే.. ఇలాంటి చిల్లర రాజకీయాలతో, మహిళలపై అసభ్యవ్యాఖ్యలతో ప్రజల దృష్టి మళ్లించాలనకునే నీచ ప్రయత్నాలను సభ్య సమాజం క్షమించదు. ప్రజాధనాన్ని లూటీ చేసిన సొమ్ములతో రాష్ట్రంలో గందరగోళాన్ని సృష్టించేందుకు కుట్రలు చేస్తున్నట్లు స్పష్టంగా తెలుస్తోంది. జగన్‌రెడ్డి, వైసీపీ నేతల తీరు రాక్షసులను తలపిస్తోంది. పురాణాల్లో మంచి కోసం రుషులు యజ్ఞాలు చేస్తుంటే రాక్షసులు భగ్నం చేసినట్లు.... నేడు రాష్ట్రంలో మంచి జరుగుతుంటే వైసీపీ రాకాసి మూక చూసి ఓర్వలేకపోతోంది. ప్రజలు దీన్ని అర్థం చేసుకొని మహిళా లోకాన్ని అవమానిస్తున్న వారికి తగిన బుద్ధి చెప్పాలని నరసింహ యాదవ్ విజ్ఞప్తి చేశారు.

## టీడీపీ కేంద్ర కార్యాలయంలో

# ఘనంగా బాలకృష్ణ జన్మదిన వేడుకలు

- కేక్ కట్ చేసి శుభాకాంక్షలు తెలిపిన నేతలు





అమరావతి (చైతన్యరథం): హిందూపురం ఎమ్మెల్యే, పద్మభూషణ్, నటసింహం నందమూరి బాలకృష్ణ 65వ పుట్టిన రోజు వేడుకలను గ్రంథాలయ పరిషత్ చైర్మన్ గోనుగుంట్ల కోటేశ్వరరావు ఆధ్వర్యంలో మంగళగిరిలోని టీడీపీ కేంద్ర కార్యాలయంలో మంగళవారం ఘనంగా నిర్వహించారు. భారీ కేక్‌ను కట్ చేసి బాలయ్యబాబుకు జన్మదిన శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా నేతలు మాట్లాడుతూ.. మానవత్వానికి నిలువెత్తు నిదర్శనం నందమూరి బాలకృష్ణ అని.. ఆయురారోగ్యాలతో ఆయన నిండు నూరేళ్ల జీవించి ప్రజా సేవతో పాటు, నటుడిగా మరెన్నో మంచి చిత్రాలను అందించాలని కోరారు. ఈ కార్యక్రమంలో టీడీపీ సీనియర్ నాయకులు రమణ, నాటక అకాడమీ చైర్మన్ గుమ్మడి గోపాలకృష్ణ, యాదవ కార్పొరేషన్ చైర్మన్ నరసింహ యాదవ్, బొద్దులూరి వెంకటేశ్వరరావు, ఎన్ఆర్ఐ వింగ్ సభ్యులు చప్పిడి రాజశేఖర్, ఎమ్ సత్యవాణి, తదితర నేతలు పాల్గొన్నారు.

# సేవాతత్పరుడు బాలకృష్ణ



**- ఎన్టీఆర్, చంద్రబాబు, బాలయ్యలతో పనిచేయడం అదృష్టం**
**- బాలకృష్ణ పుట్టినరోజు వేడుకల్లో మంత్రి ఆనం రామనారాయణరెడ్డి**
**- బాలకృష్ణ వీడియోలను ప్రదర్శించిన నుడా ఛైర్మన్ కోటంరెడ్డి**

నెల్లూరు, (చైతన్యరథం): సినీ, రాజకీయరంగాల్లో మకుటం లేని మహారాజు నందమూరి బాలకృష్ణ అని మంత్రి ఆనం రామనారాయణరెడ్డి అన్నారు. పద్మభూషణ్ నందమూరి నటసింహం బాలకృష్ణ పుట్టిన రోజు వేడుకల్లో పాల్గొనడం సంతోషంగా ఉందన్నారు. నెల్లూరులోని ఎన్టీఆర్ భవన్లో నుడా ఛైర్మన్ కోటంరెడ్డి శ్రీనివాసులు రెడ్డి ఆధ్వర్యంలో, టీడీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి చేజర్ల వెంకటేశ్వర్ రెడ్డి అధ్యక్షతన బాలకృష్ణ జన్మదిన వేడుకలు మంగళవారం ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా నగరం నలుమూలల నుంచి పెద్ద ఎత్తున యువత బైక్ ర్యాలీ నిర్వహించారు.. జై బాలయ్య.. జై శీనయ్య నినాదాలతో పార్టీ కార్యాలయానికి చేరుకున్నారు. అనంతరం ఎన్టీఆర్ విగ్రహానికి ముఖ్య నేతలు పూలమాలలు వేసి జేజేలు పలికారు. బాలకృష్ణ నటించిన సినిమాల్లోని కొన్ని సన్నివేశాలను ప్రదర్శించారు. ఈ సందర్భంగా మంత్రి ఆనం రామనారాయణ రెడ్డి మాట్లాడుతూ కోటంరెడ్డి శ్రీనివాసులురెడ్డి నాయకత్వం భవిష్యత్తు తరాలకు అవసరమన్నారు. స్వర్గీయ ఎన్టీ రామారావుతో, సీఎం చంద్రబాబు, నందమూరి బాలకృష్ణతో కలిసి పనిచేయడం తన అదృష్టమని ఆనం వ్యాఖ్యానించారు. బాలకృష్ణ పద్మభూషణ్ అవార్డు తీసుకున్న తరువాత జరుగుతున్న జన్మదిన వేడుకలు కావడం విశేషమన్నారు. ఏ కార్యక్రమానికి శ్రీకారం చుట్టినా దాన్ని విజయవంతం చేయడంలో నుడా ఛైర్మన్ కోటంరెడ్డి శ్రీనివాసులు రెడ్డి పాత్ర కీలకమన్నారు. విజయవాడ వెళ్లాల్సిన తనను పట్టుబట్టి బాలయ్య జన్మదిన వేడుకలకు తీసుకొచ్చారని గుర్తు చేశారు. ప్రతి ఏడాదిలా ఈసారి కూడా బాలయ్య పుట్టినరోజు వేడుకలు అంబారాన్ని అంటాయన్నారు. బాలకృష్ణ అభిమానులకు తోడుగా నీడగా కోటంరెడ్డి శ్రీనివాసులు రెడ్డి ఉన్నారని అభినందించారు.

నుడా ఛైర్మన్ కోటంరెడ్డి మాట్లాడుతూ తనలోని బాధను, భయాన్ని పోగొట్టి ధైర్యాన్ని ఆత్మవిశ్వాసాన్ని నింపే ఏకైక వ్యక్తి నందమూరి బాలకృష్ణ అన్నారు. రాజకీయంగా ఎదురైన ఎన్నో ఇబ్బందులను, ఒడిదుడుకులను బాలకృష్ణ సాన్నిహిత్యంతో ధైర్యంగా ఎదుర్కొన్నానన్నారు. తల్లి ఆశయాలను.. తండ్రి వారసత్వాన్ని పుణికి పుచ్చుకుని అన్ని వర్గాల ప్రజలకు సేవలందిస్తున్న వ్యక్తి బాలకృష్ణ అని ఆయన కొనియాడారు. బసవతారకం క్యాన్సర్ ఆసుపత్రికి నెల్లూరు జిల్లా నుంచి ఎంతోమంది అభాగ్యులను పంపించానని.. వారందరికీ ప్రాణం పోసిన గొప్ప వ్యక్తి బాలకృష్ణ అని అన్నారు. తనకి నుడా ఛైర్మన్ పదవి రావడానికి సీఎం చంద్రబాబు, లోకేష్, మంత్రులతో పాటు బాలకృష్ణ కూడా ప్రధాన కారణం అన్నారు.. అయన ఋణం తీర్చుకోలేనిదని కోటంరెడ్డి వ్యాఖ్యానించారు. ఐ లవ్ నెల్లూరు అని నినాదాన్ని ప్రజల్లోకి తీసుకెళ్లాలని ఆయన పిలుపునిచ్చారు. బాలకృష్ణ సిద్ధాంతాలను ప్రతి ఒక్కరికీ చేరవేసేందుకు సైనికుడిలా పోరాడతానని స్పష్టం చేశారు.

గూడూరు ఎమ్మెల్యే పాశం సునీల్ మాట్లాడుతూ కోటంరెడ్డి సూచనలతో తన ఎన్నికల ప్రచారానికి బాలకృష్ణ వచ్చారని అయన గుర్తు చేశారు. బాలకృష్ణ అభిమానులు, టీడీపీ నేతల ఆశీస్సులతో తాను గెలిచానని స్పష్టం చేశారు. కోటంరెడ్డి కుటుంబానికి, బాలకృష్ణకి విడదీయరాని బంధం ఉందన్నారు. సర్వేపల్లి నియోజకవర్గ టీడీపీ సమన్వయకర్త రాజగోపాల్ రెడ్డి, పోలంరెడ్డి దినేష్ రెడ్డి, ఆనం రంగముయ్య రెడ్డితో పాటు చేజర్ల వెంకటేశ్వర్ రెడ్డి, తదితరులు మాట్లాడుతూ యువ హీరోలకి రోల్ మోడల్ గా భవిష్యత్తు రాజకీయ నాయకులకి ఆదర్శప్రాయుడిగా సేవా రంగంలో మనసున్న మారాజుగా బాలకృష్ణ చరిత్రలో నిలిచిపోతారని కొనియాడారు. ఈ వేడుకల్లో కోటంరెడ్డి సంధ్యతో పాటు, జనసేన జిల్లా ప్రధాన కార్యదర్శి కిషోర్, బోదాటి రాదయ్య, బాలకృష్ణ అభిమాన సంఘం నేత రవి, బాలయ్య అభిమానులు కార్యకర్తలు పెద్దఎత్తున పాల్గొన్నారు.

# వ్యర్థాల సమర్థ నిర్వహణపై ప్రభుత్వం దృష్టి

**- మహారాష్ట్ర, ఉత్తరప్రదేశ్‌లో మంత్రి నారాయణ బృందం పర్యటన**
**- మహారాష్ట్రలోని పింప్రీ చించ్‌వాడలో వేస్ట్ టు ఎనర్జీ ప్లాంట్ సందర్శన**
**- లక్నో లో ఘన వ్యర్థాల నిర్వహణ పరిశీలన**



అమరావతి (చైతన్యరథం): ఆంధ్రప్రదేశ్‌ను డంపింగ్ యార్డ్ రహిత రాష్ట్రంగా మార్చేందుకు మున్సిపల్ శాఖ కసరత్తు చేస్తోంది. ముఖ్యంగా పట్టణాలు, నగరాల్లో ప్రతి రోజూ వచ్చే ఘన, ద్రవ వ్యర్థాల నిర్వహణను సమర్థవంతంగా చేయడం ద్వారా లక్ష్యాన్ని సాధించేందుకు ప్రణాళికలు రూపొందిస్తోంది. ఇప్పటికే రాష్ట్రంలో విశాఖపట్నం, గుంటూరులో చెత్త నుంచి విద్యుత్ తయారీ ప్లాంట్లు ఏర్పాటు చేయగా, వాటి ద్వారా ఘన వ్యర్థాల ద్వారా విద్యుత్ ఉత్పత్తి చేస్తున్నారు. త్వరలో మరో రెండు ప్లాంట్లు ఏర్పాటు చేసేందుకు సర్వం సిద్ధమయింది. అయితే ఘన వ్యర్థాల నుంచి కేవలం విద్యుత్ మాత్రమే కాకుండా కంపోస్ట్, ఇతర అవసరాలకు వినియోగించే పదార్థాలను కూడా తయారు చేస్తే మరింత ప్రయోజనం ఉంటుందని ప్రభుత్వం భావిస్తోంది. ఇందుకోసం పలు ప్రాంతాల్లో సాలిడ్ వేస్ట్ మేనేజ్‌మెంట్ ప్లాంట్లను పురపాలక, పట్టణాభివృద్ధి శాఖల మంత్రి నారాయణ సందర్శిస్తున్నారు. తాజాగా వ్యర్థాల నిర్వహణకు సంబంధించి అధ్యయనం చేసేందుకు మంత్రి నారాయణ బృందం మహారాష్ట్ర, ఉత్తరప్రదేశ్‌లో పర్యటించింది. సోమవారం సాయంత్రం మహారాష్ట్రలోని పూణే చేరుకున్న మంత్రి నారాయణ బృందం....అక్కడి నుంచి పింప్రి చించివాడ్ మున్సిపల్ కార్పొరేషన్‌లో ఉన్న వేస్ట్ టూ ఎనర్జీ ప్లాంట్‌ను సందర్శించింది. అక్కడ ఘన వ్యర్థాల నుంచి విద్యుత్ ఉత్పత్తిని ఏ విధంగా చేస్తున్నారో మంత్రి నారాయణ బృందానికి అక్కడి అధికారులు వివరించారు. ఈ పర్యటనలో మంత్రి నారాయణతో పాటుగా స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్ ఎండీ అనిల్ కుమార్ రెడ్డి కూడా పాల్గొన్నారు. పింప్రి చించివాడ్‌లోని వేస్ట్ టు ఎనర్జీ ప్లాంట్‌లో ప్రతిరోజు 14 మెగావాట్ల విద్యుత్తును ఉత్పత్తి చేస్తున్నారు. ఇదే ప్లాంట్‌లో విద్యుత్ తో పాటు బయోగ్యాస్‌ను కూడా ఉత్పత్తి చేస్తున్నారు. ప్లాంట్ పనితీరు, విద్యుత్ వినియోగంపై మున్సిపల్ మంత్రి నారాయణకు అక్కడి కార్పొరేషన్ అధికారులు వివరించారు.

ఇక మంగళవారం మంత్రి బృందం ఉత్తరప్రదేశ్ రాజధాని లక్నో చేరుకుంది. లక్నో చేరుకున్న మంత్రి నారాయణ బృందానికి మున్సిపల్ కార్పొరేషన్ మేయర్ సుష్మా ఖరాక్వాల్, కమిషనర్ గౌరవ్ కుమార్ ఘనస్వాగతం పలికారు. లక్నో వెళ్లిన మంత్రి బృందంలో స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్ ఛైర్మన్ పట్టాభి రామ్, మున్సిపల్ శాఖ డైరెక్టర్ సంపత్ కుమార్, గ్రీనింగ్ కార్పొరేషన్ ఎండి శ్రీనివాసులు, మంగళగిరి తాడేపల్లి మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ అలీమ్ భాష కూడా ఉన్నారు. లక్నోలో ప్రతిరోజు ఉత్పత్తి అవుతున్న ఘన వ్యర్థాలను పలు రకాలుగా విభజిస్తూ స్థానిక అవసరాలకు ఉపయోగిస్తున్నారు. శివ్ ప్రాంతంలో ఉన్న ప్లాంట్‌కు సంబంధించి ఘనవ్యర్థాలను ఏ విధంగా ఉపయోగిస్తున్నారనే అంశాలను అక్కడి మున్సిపల్ కార్పొరేషన్ అధికారులు పవర్ పాయింట్ ప్రెజెంటేషన్ ద్వారా మంత్రి నారాయణ బృందానికి వివరించారు. పవర్ పాయింట్ ప్రజెంటేషన్ తర్వాత మంత్రి నారాయణ బృందం క్షేత్రస్థాయి పరిశీలనకు వెళ్లి అక్కడ ఘన వ్యర్థాల నుంచి బయో గ్యాస్‌తో పాటు చెత్త నుంచి వచ్చే పౌడర్ ద్వారా ఇటుకులను కూడా తయారు చేస్తున్న వైనాన్ని పరిశీలించింది. ఆ తర్వాత లక్నోలో 200 ఎకరాల విస్తీర్ణంలో ఉన్న జ్ఞానేశ్వర్ మిశ్రా పార్కును మంత్రి నారాయణ బృందం సందర్శించింది. ఈ పార్కును లక్నో మున్సిపల్ కార్పొరేషన్ అద్భుతంగా నిర్మించింది.

# కొమ్మినేనికి రిమాండ్ గుంటూరు జైలుకు తరలింపు



గుంటూరు (చైతన్యరథం): రాజధాని అమరావతి మహిళలపై అసభ్యకర వ్యాఖ్యలు చేసిన కేసులో సాక్షి ఛానల్ యాంకర్ కొమ్మినేని శ్రీనివాసరావుకు రిమాండ్ విధిస్తూ మంగళగిరి కోర్టుఉత్తర్వులు జారీ చేసింది. మంగళవారం ఉదయం కొమ్మినేనిని పోలీసులు మంగళగిరి కోర్టులో హాజరుపర్చగా.. వాదనలు జరిగాయి. అనంతరం ఆయనకు కోర్టు 14 రోజుల పాటు రిమాండ్ విధించింది. దీంతో కొమ్మినేనిని గుంటూరు జిల్లా జైలుకు పోలీసులు తరలించారు. అమరావతి మహిళలు, అమరావతి ప్రాంతంపై అసభ్యకరమైన వ్యాఖ్యలతో సాక్షి ఛానల్‌లో నిర్వహించిన డిబేట్‌పై రాజధాని ప్రాంతం మహిళలతో రాష్ట్ర వ్యాప్తంగా మహిళలు నిరసన ర్యాలీలు చేపట్టారు. అనేక పోలీస్‌స్టేషన్‌లలో ఫిర్యాదులు చేశారు. అందులో భాగంగా తుళ్లూరు పోలీస్‌స్టేషన్‌లో టీడీపీ మహిళా నాయకురాలు కంభంపాటి శిరీష్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు సోమవారం ఉదయం హైదరాబాద్‌లో కొమ్మినేనిని ఆయన నివాసంలోనే అరెస్ట్ చేశారు. అనంతరం గుంటూరుకు తరలించిన పోలీసులు.. రాత్రి నల్లపాడు పోలీస్‌స్టేషన్‌లో విచారణ జరిపారు. ఆపై ఈరోజు ఉదయం గుంటూరు జీజీహెచ్‌లో వైద్య పరీక్షలు నిర్వహించిన తర్వాత మంగళగిరి కోర్టులో హాజరుపర్చారు. ఇరువర్గాల వాదనలు విన్న మంగళగిరి కోర్టు కొమ్మినేని శ్రీనివాస్‌కు 14 రోజుల పాటు రిమాండ్ విధించింది.

**రిమాండ్ రిపోర్టులోని అంశాలు ఇవే..**

అమరావతి మహిళలపై అసభ్యకర వ్యాఖ్యలు ముందస్తు ప్రణాళిక ప్రకారం కావాలనే దురుద్దేశంతో చేశారని రిమాండ్ రిపోర్ట్‌లో పోలీసులు పేర్కొన్నారు. దీని వెనుక ఉన్న కుట్రను ఛేదించాల్సిన అవసరం ఉందని రిమాండ్ రిపోర్ట్‌లో స్పష్టం చేశారు. దీర్ఘకాలిక ప్రణాళికలో భాగంగానే అమరావతిపై ఇటువంటి నిందలు మోపారని.. దీనిపై పూర్తిస్థాయిలో దర్యాప్తు చేయాల్సిన అవసరం దర్యాప్తు సంస్థలకు ఉందని ఈ సందర్భంగా అధికారులు పేర్కొన్నారు. సమాజంలో అశాంతి, ఉద్రిక్తతలను రెచ్చగొట్టేందుకు నేరపూరిత కుట్రతోనే ఇటువంటి వ్యాఖ్యలు చేశారని భావిస్తున్నట్లు పోలీసులు పేర్కొన్నారు. సాక్షి టీవీలో కొమ్మినేని శ్రీనివాసరావు ఆధ్వర్యంలోనే డిబేట్ జరిగిందని.. అదే డిబేట్‌లో వీవీఆర్ కృష్ణంరాజు అభ్యంతరకర వ్యాఖ్యలు చేశారని తెలిపారు. కొమ్మినేని శ్రీనివాసరావు ఆ వ్యాఖ్యలను ఖండించక పోవడమే కాకుండా సమర్థిస్తూ మాట్లాడారని.. అంతేకాకుండా తానూ పలు పత్రికల్లో ఈ వార్తలు చూశానని పరోక్షంగా కృష్ణంరాజును ప్రోత్సహించారని రిమాండ్ రిపోర్ట్‌లో పోలీసులు పేర్కొన్నారు. కొమ్మినేని శ్రీనివాసరావును పోలీసు కస్టడీలోకి తీసుకొని విచారిస్తే అన్ని విషయాలూ బయటకు వస్తాయని రిమాండ్ రిపోర్ట్‌లో స్పష్టం చేశారు. తాము విచారిస్తే ఆయన అసలు సహకరించలేదని.. దర్యాప్తు సంస్థలను తప్పుదోవ పట్టించే విధంగా జవాబులు చెప్పారని రిమాండ్ రిపోర్ట్‌లో పేర్కొన్నారు. రాష్ట్రంలో శాంతిభద్రతలను భగ్నం చేసేందుకు, అశాంతిని సృష్టించేందుకు చేసిన చర్యగా పోలీసులు అభివర్ణించారు. ఈ కారణంగానే కొమ్మినేని శ్రీనివాసరావును రిమాండ్‌కు పంపాలని.. ఈ కేసులో ఇంకా సాక్షులను సైతం విచారించాల్సిన అవసరం ఉందని రిమాండ్ రిపోర్ట్‌లో పోలీసులు స్పష్టం చేశారు.

మరోవైపు కొమ్మినేని తరఫు న్యాయవాది పొన్నవోలు సుధాకర్‌రెడ్డి సుదీర్ఘ వాదనలు వినిపించారు. ఆ వాదనలతో న్యాయమూర్తి ఏకీభవించలేదు.

# సింగపూర్‌లో ఘనంగా బాలయ్య జన్మదిన వేడుకలు



సింగపూర్ (చైతన్యరథం): నందమూరి తారక రామారావు వారసుడిగా సినీ రంగంలో తనదైన ముద్ర వేసిన నటసింహం నందమూరి బాలకృష్ణ 65వ పుట్టినరోజు వేడుకలు సింగపూర్‌లో తెలుగుదేశం ఫోరమ్ సింగపూర్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. బాలయ్య అభిమానులు, సింగపూర్ లో నివసిస్తున్న తెలుగు ప్రజలు పాల్గొని వేడుకలను పండగలా జరుపుకున్నారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ సినీ రంగంలో నాలుగు దశాబ్దాలకు పైగా అగ్రనటుడిగా ఉన్న బాలయ్యబాబు, తన అద్భుతమైన నటనతో ఎన్నో సూపర్ హిట్ సినిమాలు అందించారన్నారు. ఆయన నటించిన లెజెండ్, సింహా, అఖండ వంటి చిత్రాలు తెలుగు సినీ చరిత్రలో గుర్తుండిపోయే చిత్రాలుగా నిలిచాయి. బసవ తారకం హాస్పిటల్‌తో ఎంతో మంది పేద మధ్యతరగతి కుటుంబాలకు క్యాన్సర్ చికిత్స అందించి, పునర్జన్మని ప్రసాదించారు. సినీ రంగంతో పాటు రాజకీయ రంగంలోనూ బాలయ్యబాబు తనదైన ముద్ర వేశారు. తెలుగుదేశం పార్టీ తరఫున 2014, 2019, 2024 ఎన్నికల్లో హిందూపురం నియోజకవర్గం నుంచి మూడుసార్లు ఘన మెజారిటీతో ఎమ్మెల్యేగా గెలిచారు. ప్రజల సమస్యలపై తనదైన శైలిలో అసెంబ్లీలో గళం విప్పిన బాలయ్య, తన ముక్కుసూటి వ్యాఖ్యలతో అందరి ప్రశంసలు అందుకున్నారని కొనియాడారు. ఈ వేడుకల్లో సింగపూర్ టీడీపీ కుటుంబ సభ్యులు, సన్నిహితులు, అభిమానులు పాల్గొని బాలయ్యబాబుకు జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు.

## ప్రభుత్వాలెన్ని మారినా...

# మారనివి ఎన్టీఆర్ పథకాలు మాత్రమే

- తెలుగువారి ఆత్మ గౌరవానికి ఎన్టీఆర్ ఎనలేని కృషి చేశారు
- రాష్ట్ర అభ్యున్నతికి కష్టపడుతున్న సీఎం చంద్రబాబు
- జగన్ రాష్ట్రంలో ఉంటే... ఇంటికి చెదలు, పంటకు పురుగు పట్టినట్లే
- ఎన్టీఆర్ విగ్రహావిష్కరణ సభలో మంత్రి గొట్టిపాటి



అద్దంకి (చైతన్యరథం): ప్రభుత్వాలు మారినా... తరాలు మారినా... ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో మారనివి నందమూరి తారక రామారావు ప్రవేశ పెట్టిన సంక్షేమ పథకాలు మాత్రమే అని ఇంధన శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్ స్పష్టం చేశారు. బాపట్ల జిల్లా అద్దంకి మండలం పార్వతీపురంలో మంగళవారం తెలుగుదేశం వ్యవస్థాపకులు, మాజీ ముఖ్యమంత్రి ఎన్టీ రామారావు విగ్రహాన్ని మంత్రి గొట్టిపాటి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... తెలుగువారి ఆత్మ గౌరవం కోసం పుట్టిన పార్టీ తెలుగుదేశం అన్నారు. నాడు తెలుగువారి ఆత్మ గౌరవం కోసం ఎన్టీఆర్ కృషి చేస్తే... నేడు తెలుగువారి అభ్యున్నతి కోసం సీఎం చంద్రబాబు నాయుడు కష్ట పడుతున్నారని పేర్కొన్నారు. తెలుగు ప్రజల తలసరి ఆదాయం పెంచే దిశంగా సీఎం చంద్రబాబు ఎన్నో కార్యక్రమాలు చేపడుతున్నారన్నారు. చంద్రబాబు విజన్- 2020తోనే గ్రామాల్లోనూ సాఫ్ట్ వేర్ ఇంజనీర్లు పుట్టుకొచ్చారని మంత్రి గుర్తు చేశారు. విజన్ -2047పై జగన్ చేస్తున్న విమర్శలకు ప్రజలే సమాధానం చెబుతారన్నారు. గడిచిన 43 సంవత్సరాలుగా టీడీపీని నాశనం చేయాలని ఎందరో, ఎన్నో ప్రయత్నాలు చేసినా.. అన్ని ఆటుపోట్లకు ఎదురొడ్డి టీడీపీ నిలబడిందన్నారు. టీడీపీ సిద్ధంతాలు ఎప్పటికీ బతికే ఉంటాయని మంత్రి గొట్టిపాటి ఈ సందర్భంగా తెలిపారు.

**వేల ఎకరాలు త్యాగం చేసిన వారిని...**

33 వేల ఎకరాలను త్యాగం చేసిన రాజధాని మహిళలను జగన్ మీడియా, జగన్ పార్టీ అనరాని మాటలు అందని మంత్రి గొట్టిపాటి ఆవేదన వ్యక్తం చేశారు. ఇటువంటి పార్టీ సమాజంలో ఉంటే ఇంటికి చెదలు పట్టినట్లే అని చెప్పారు. వ్యవసాయానికి పురుగు పడితే ఎంత నష్టమో... జగన్ వల్ల ఈ రాష్ట్రానికి కూడా అంతే నష్టం జరుగుతుందని వివరించారు. మహిళలను గౌరవించడం కూడా తెలియని పార్టీలు రాజకీ యాలు చేస్తున్నాయని ఆయన మండిపడ్డారు. ఐదేళ్ల వైసీపీ ప్రభుత్వ హయాంలో రాష్ట్రంలో ఎంత విధ్వంసం జరిగిందో.., ప్రజలు ఎంత నష్ట పోయారో అందరూ చూశారన్నారు. కూటమి ప్రభుత్వంలో కుల, మతాలకు అతీతంగా అందరూ స్వేచ్ఛగా జీవిస్తున్నారని గొట్టిపాటి తెలిపారు. బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనారిటీలతో పాటు ప్రజలందరూ అభివృద్ధి చెందాలన్నదే కూటమి ప్రభుత్వ ధ్యేయం అన్నారు. కడప మహానాడు విజయవంతం కావడమే టీడీపీకి ప్రజల్లో ఉన్న ఆదరణకు నిదర్శనమని మంత్రి పేర్కొ న్నారు. అదే విధంగా తెలుగు ప్రజలు భూమిపై ఉన్నంత కాలం టీడీపీ వ్యవస్థాపకుడు ఎన్టీఆర్ వారి గుండెల్లో చిరస్థాయిగా నిలిచి ఉంటారని తెలిపారు.

**బాలకృష్ణ జన్మదిన వేడుకల్లో...**

ఎన్టీఆర్ విగ్రహావిష్కరణ తరువాత నందమూరి బాలకృష్ణ జన్మదిన వేడుకల్లో మంత్రి గొట్టిపాటి పాల్గొన్నారు. కేక్ కట్ చేసిన ఆయన.., అభిమానులకు శుభాకాంక్షలు చెప్పారు. సినీ రంగంతో పాటు రాజకీయ రంగంలోనూ రాణించిన బాలకృష్ణ తండ్రికి తగ్గ తనయుడని నిరూపించుకు న్నాడని పేర్కొన్నారు. అనంతరం స్థానిక రైతుకు వ్యవసాయంలో ఉపయోగపడే డ్రోన్‌ను మంత్రి గొట్టిపాటి చేతుల మీదుగా అందజేశారు.

# వ్యవసాయ అధికారులు క్షేత్రస్థాయిలో తిరగాలి

- రైతులకు అందుబాటులో ఉండి సలహాలివ్వాలి
- బీసీ సంక్షేమశాఖ మంత్రి సవిత సూచన
- రైతులకు సబ్సిడీ వేరుశనగ విత్తనాలు పంపిణీ చేసిన మంత్రి



పుట్టపర్తి (చైతన్యరథం): వ్యవసాయ అధికారులు క్షేత్రస్థాయిలో పర్యటించి రైతులకు తగు సలహాలు, సూచనలు ఇవ్వాలని రాష్ట్ర బీసీ సంక్షేమ శాఖ మంత్రివర్యులు సవిత సూచించారు. రైతుల కోసం ప్రభుత్వం ఎన్నో సంక్షేమ పథకాలు అమలుచేస్తోందన్నారు. శ్రీసత్యసాయి జిల్లా పుట్టపర్తి నియోజకవర్గం పుట్టపర్తి మండలం పెదపల్లి గ్రామంలో స్థానిక రైతు సేవా కేంద్రం వద్ద రాష్ట్ర ప్రభుత్వం రాయితీపై అందించిన వేరుశనగ విత్తన పంపిణీ కార్యక్రమంలో స్థానిక ఎమ్మెల్యే పల్లె సింధూర రెడ్డి, ఎన్డీఏ కూటమి నాయకులతో కలిసి మంత్రి సవిత పాల్గొన్నారు. రైతులకు వేరుశనగ విత్తనాలను పంపిణీ చేసిన అనంతరం మంత్రి సవిత మాట్లాడుతూ రైతుల సంక్షేమం కోసం ఎన్డీఏ కూటమి ప్రభుత్వం అనేక పథకాలను అమలు చేస్తోందన్నారు. రైతులకు అధిక దిగుబడులు వచ్చే విధంగా నాణ్యమైన విత్తనాలు, సాంకేతిక మద్దతు అందిస్తోందన్నారు. ప్రభుత్వం సబ్సిడీతో అందిస్తున్న వేరుశనగ విత్తనాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. అలాగే రైతులు సమయానికి సాగు పనులు ప్రారంభించాల్సిన అవసరం ఉందన్నారు. వ్యవసాయ అధికారులు రైతులకు పంట సాగు విషయంలో అవసరమైన సలహాలు, సూచనలు అందించాలని, గ్రామాల్లో రైతులకు అధికారులు అందుబాటులో ఉండాలని సూచించారు. ప్రతి నెల వివిధ సామాజిక భద్రత పెన్షన్లు ఒకటో తేదీ ఆదివారం వస్తే ముందు రోజే పంపిణీ చేస్తున్నామని తెలిపారు. ఉమ్మడి అనంతపురం జిల్లా రైతుల కష్టాలు చూసి చంద్రబాబు నాయుడు, కృష్ణా జలాలను రాయలసీమకు అందజేసిన మహనీయుడని తెలిపారు. ఉమ్మడి అనంతపురం జిల్లా రైతులు పండించిన పండ్లు ఇతర దేశాలకు సైతం ఎగుమతి అవుతున్నాయని మంత్రి తెలిపారు.

అనంతరం స్థానిక ఎమ్మెల్యే సింధూరరెడ్డి మాట్లాడుతూ డ్రిప్ వ్యవసాయం ద్వారా ఎస్సీ, ఎస్టీ రైతులకు ఐదు ఎకరాలు ఉన్నా ఉచితంగా డ్రిప్ పరికరాలు అందజేశామన్నారు. అన్నదాత సుఖీభవ పథకం కింద 20 వేల రూపాయలు అందచేయడా నికి ప్రభుత్వం చర్యలు చేపడుతోందన్నారు. రైతులు నాణ్యమైన విత్తనాలు పొంది మంచి ఫలితాలు సాధించాలన్నారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ అధికారి వైవి సుబ్బారావు, సర్పంచ్ మంగ్లీ బాయ్, జడ్పిటిసి మెంబర్ జి లక్ష్మీనరసమ్మ, ఆర్డీవో సువర్ణ సామకోటి ఆదినారాయణ, సోమశేఖర, ఆంజనేయులు, తదితరులు పాల్గొన్నారు.

# బీచ్ ఫెస్టివల్‌లో క్రీడలకు విశేష ఆదరణ

- మచిలీపట్నంలో దిగ్విజయంగా మసులా బీచ్ ఫెస్ట్
- క్రీడలకు మంత్రి కొల్లు రవీంద్ర పెద్దపీట
- -15 లక్షల మందికిపైగా విచ్చేసిన పర్యాటకులు, వీక్షకులు
- కృష్ణాజిల్లాలో క్రీడల అభివృద్ధే మంత్రి ధ్యేయం
- శాప్ ఛైర్మన్ అనిమిని రవినాయుడు



విజయవాడ (చైతన్యరథం): మంత్రి కొల్లు రవీంద్ర ఆధ్వర్యంలో ఈనెల 5,6,7,8 తేదీల్లో మచిలీపట్నంలోని మసులా బీచ్ ఫెస్టివల్‌లో నిర్వహించిన జాతీయ జల క్రీడలకు విశేష ఆదరణ లభించిందని శాప్ ఛైర్మన్ అనిమిని రవినాయుడు పేర్కొన్నారు. కనీవినీ ఎరుగని రీతిలో 15 లక్షల మంది పర్యాటకులు, వీక్షకులు హాజరవడం సంతోషదాయకమన్నారు. విజయవాడ లోని శాప్ ప్రధానకార్యాలయ కాన్ఫరెన్స్ హాలులో మసులా బీచ్ ఫెస్టివల్ క్రీడాపోటీల విజేతలు, నిర్వాహకులను ప్రశంసిస్తూ మంగళవారం అభినం దన సభ ఏర్పాటు చేశారు. పోటీల్లో గెలుపొందిన ఏపీ క్రీడాకారులకు, క్రీడలు నిర్వహించిన శాప్ అధికారులను, సిబ్బందిని, అసోసియేషన్ల నిర్వాహకులను శాప్ ఛైర్మన్ రవినాయుడుతోపాటు శాప్ ఎండీ పీఎస్ గిరీషా సత్కరించారు. తొలుత బీచ్ కబడ్డీ, బీచ్ వాలీబాల్, కెనాయింగ్ అండ్ కయాకింగ్ జాతీయ పోటీల్లో ఏపీ తరుపున తలపడి పతకాలు సాధించిన విజేతలను సత్కరించడంతోపాటు ఆర్థిక ప్రోత్సాహకాలను అందజేశారు. అనంతరం క్రీడాపోటీలను విజయవంతంగా పూర్తిచేసిన శాప్ అధికారులు, డీఎస్డీఓలు, కోచ్‌లు, సిబ్బందిని దుశ్శాలువాలతో సత్కరించారు. ఈ సందర్భంగా శాప్ ఛైర్మన్ మాట్లాడుతూ బీచ్ ఫెస్టివల్‌లో భాగంగా ఏర్పాటు చేసిన క్రీడల నిర్వహణ పట్ల ప్రజాప్రతినిధులు, ప్రజల నుంచి సర్వత్రా హర్షాతిరేకాలు వ్యక్తమవుతున్నాయన్నారు. ముఖ్యంగా స్పోర్ట్స్ అథారిటీకి మరింత గౌరవం లభించిందన్నారు. అంచనాలకు మించి 15లక్షల మంది వరకూ హాజరయ్యారన్నారు. బీచ్ ఫెస్టివల్‌లో జాతీయ స్థాయి పోటీలను నిర్వహించడం సరికొత్త అధ్యాయమని వివరించారు. శాప్ అధికారులు, డీఎస్డీఓలు, కోచ్‌లు, అసోసియేషన్ల నిర్వాహకుల సమిష్టి కృషి అభినందనీయమన్నారు. భవిష్యత్తులో ఇలాంటి క్రీడాపోటీలు మరిన్ని నిర్వహించాలన్నారు. అలాగే క్రీడల విజయవంతంలో అసోసియేషన్ల చొరవ ప్రశంసనీయమన్నారు. క్రీడాకారులకు, కోచ్‌లకు, అసోసియేషన్లకు ఆర్థిక ప్రోత్సాహకాలను విడివిడిగా అందించేందుకు రాష్ట్ర ప్రభుత్వం కృషి చేస్తుందన్నారు. కృష్ణా జిల్లాలో క్రీడల అభివృద్ధిపై మంత్రి కొల్లు రవీంద్ర ప్రత్యేక దృష్టి సారిస్తున్నారని అన్నారు.

**క్రీడాకారులకు అండగా శాప్..**

శాప్ ఎండీ పీఎస్ గిరీషా మాట్లాడుతూ బీచ్ ఫెస్టివల్‌లో వాటర్ గేమ్స్ విజయవంతంగా జరిగాయన్నారు. అలాగే పోటీల్లో ఆంధ్రప్రదేశ్ క్రీడాకారుల ప్రదర్శన భేష్ అన్నారు. ప్రతి ఏటా ఇదే మాదిరిగా స్పోర్ట్స్ అథారిటీ క్రీడలను నిర్వహించాలన్నారు. క్రీడలు, క్రీడాకారులకు శాప్ నుంచి పూర్తి సహకారం ఉంటుందన్నారు. బీచ్ ఫెస్టివల్ విజయవంతంలో అసోసియేషన్లను భాగస్వామ్యులను చేసిన శాప్ ఛైర్మన్ చొరవ హర్షణీయమన్నారు. ఈ కార్యక్రమంలో శాప్ ఏఓ ఆర్.వెంకటరమణ నాయక్, టీఎస్ఓ ఎస్వీ రమణ, ఎస్ఓలు కోటేశ్వరరావు, మహేష్, సురేంద్ర, కిషోర్, ఏడీ వేణు, అసోసియేషన్ల నిర్వాహకులు పాల్గొన్నారు.

## మీడియా ముసుగులో అసాంఘిక శక్తులను ప్రోత్సహిస్తున్న సాక్షి మీడియాను వెంటనే రద్దు చేయాలి

**●మహిళలపై అనుచిత వ్యాఖ్యలను తీవ్రంగా ఖండించిన ఎమ్మెల్యే గోరంట్ల...**




రాజమహేంద్రవరం (చైతన్యరథం): మీడియా ముసుగులో అసాంఘిక శక్తులను ప్రోత్సహిస్తున్న సాక్షి మీడియాను వెంటనే రద్దు చేయాలని, రాజధాని ప్రాంత మహిళలపై అనుచిత వ్యాఖ్యలు చేయడం హేయమైన చర్య అని రూరల్ శాసనసభ్యులు గోరంట్ల బుచ్చయ్య చౌదరి పేర్కొన్నారు. మంగళవారం రాష్ట్ర మహిళా ప్రధాన కార్యదర్శి మజ్జి పద్మావతి, రూరల్ మండలం తెదేపా అధ్యక్షులు మచ్చేటి ప్రసాద్ మరియు కూటమి పార్టీల నాయకుల ఆధ్వర్యంలో బొమ్మూరు ఎన్టీఆర్ విగ్రహం వద్ద నుండి బాలాజీపేట సెంటర్ వరకు నిర్వహించిన ర్యాలీ కార్యక్రమంలో ఎమ్మెల్యే గోరంట్ల, యువ నాయకులు రాష్ట్ర హెల్త్ వింగ్ ప్రధాన కార్యదర్శి గోరంట్ల రవిరామ్ కిరణ్‌తో కలిసి పాల్గొన్నారు. ఆ సందర్భంగా ఎమ్మెల్యే గోరంట్ల మాట్లాడుతూ... గత వైసీపీ ప్రభుత్వ హయాంలో జగన్మోహన్ రెడ్డి లక్షల కోట్లు దోచుకుని, సాక్షి మీడియాని, సోషల్ మీడియాని అడ్డం పెట్టుకుని తప్పుడు ప్రచారాలు చేశారని, గత ప్రభుత్వం నిర్వాకం వల్ల రాష్ట్రం చిన్నాభిన్నం అయిపోయిందని, ఆర్థికంగా దివాలా తీసిందని, మూడు రాజధానుల పేరుతో రాష్ట్రానికి రాజధాని లేకుండా చేశారని, పోలవరాన్ని నట్టేట ముంచేసారని ఎద్దేవా చేశారు. రాష్ట్రంలో అనేక ఇబ్బందులు ఉన్నప్పటికీ కూడా ప్రధానమంత్రి నరేంద్ర మోడీ సహకారంతో మన ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ సారథ్యంలో అమరావతి రాజధాని ప్రాంతమంతా శరవేగంగా అభివృద్ధి చెందుతుందని అనేక సంస్థలు పెట్టుబడులు పెట్టడానికి ముందుకు వస్తున్నాయని దేశంలోనే మంచి రాజధానిగా అమరావతి రూపుదిద్దుకుంటుందని ఇవన్నీ చూసి ఓర్వలేక జగన్మోహన్ రెడ్డి అమరావతిపై విషం చల్లుతున్నారని దుయ్యబట్టారు. ఇటీవల సాక్షి టీవీలో కొమ్మినేని శ్రీనివాసరావు లైవ్ షోలో విశ్లేషకుడు కృష్ణంరాజు అమరావతి రాజధానిని వేశ్యల రాజధానిగా మాట్లాడడం దిగజారుడు చర్య అని, వీరిని అరెస్టు చేయడమే కాకుండా కఠిన చర్యలు తీసుకోవాలని, ఇలాంటి వారిని ప్రోత్సహిస్తున్న వైయస్ భారతి, వైయస్ జగన్మోహన్ రెడ్డి మహిళలకు క్షమాపణ చెప్పాలని, అలాగే తప్పుడు కథనాలను ప్రచారిస్తున్న సాక్షి మీడియాని వెంటనే రద్దు చేయాలని డిమాండ్ చేశారు.

## మహిళలపై అనుచిత వ్యాఖ్యలు తగవు

శ్రీకాకుళం (చైతన్యరథం): అమరావతి మహిళలపై అనుచిత వ్యాఖ్యలు చేసిన జర్నలిస్టు వి.వి.ఆర్. కృష్ణంరాజు, సాక్షి ప్రతినిధి కొమ్మినేని శ్రీనివాసరావుపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని శ్రీకాకుళం నియోజకవర్గ తెలుగు మహిళా అధ్యక్షురాలు గొండు.స్వాతిశంకర్ అన్నారు. వైసీపీ అరాచకాలకు అడ్డువెయ్యాలని స్థానిక సూర్యమహాల్ కూడలి నుండి ఏడురోడ్ల కూడలి వరకు నిరసన తెలుపుతూ ధర్నా నిర్వహించారు. మహిళలపై అనుచిత వాక్యలు సరికాదని, యావత్ ప్రపంచమే దీన్ని ఖండిస్తోందన్నారు. మహిళలకు రక్షణ కరువైందని, కూటమి ప్రభుత్వం రాష్ట్రానికి చేస్తున్న అభివృద్ధిని చూడలేక, ఇలాంటి నీచమైన చర్యలు తగదన్నారు.

## అమరావతి మహిళలను కించపరిచిన వాళ్లను కఠినంగా శిక్షించాలి



అనకాపల్లి (చైతన్యరథం): రాజధాని అమరావతి మహిళలను కించపరిచేలా సాక్షి చానెల్ డిబేట్‌లో మాట్లాడిన జర్నలిస్టులు కృష్ణంరాజు, కొమ్మినేని శ్రీనివాసరావులను అరెస్టు చేయడమే కాకుండా చట్టప్రకారం కఠిన శిక్షలు పడేలా కేసులు నమోదు చేయాలని తెలుగు మహిళలు డిమాండ్ చేశారు. తెలుగు మహిళ జిల్లా అధ్యక్షురాలు ఆడారి మంజు ఆధ్వర్యంలో సాక్షి ప్రాంతీయ కార్యాలయం వద్ద, తరువాత పోలీస్‌స్టేషన్ ఎదుట నిరసన తెలియజేశారు. అమరావతి మహిళలపై అనుచిత వ్యాఖ్యలు చేయడం దారుణమని అన్నారు. అనంతరం పోలీస్‌స్టేషన్‌లోకి వెళ్లి పట్టణ సీఐ విజయ్‌కుమార్‌కు ఫిర్యాదు చేశారు. ఈ కార్యక్రమంలో తెలుగు మహిళ రాష్ట్ర ఉపాధ్యక్షురాలు కొణతాల రత్నకుమారి, నేతలు శంకర్ల పద్మలత, పెదపాటి కల్యాణి, బత్తుల లక్ష్మి, కె.ఈశ్వరమ్మ, కె.సత్యవతి, ఎస్.అమరావతి, పి.తులసి, శ్రీలత తదితరులు పాల్గొన్నారు.

## మహిళలపై అనుచిత వ్యాఖ్యల పట్ల

# రాష్ట్రవ్యాప్తంగా పెల్లుబికిన నిరసనలు

**● ఉత్తరాంధ్ర నుంచి అనంతపురం వరకు సాక్షి మీడియాకు వ్యతిరేకంగా అతివల ఆందోళనలు**

**● సాక్షి యాజమాన్యం క్షమాపణ చెప్పాలని డిమాండ్... ప్లకార్డులు చేతబట్టి నిరసనర్యాలీలు**

రాజధాని అమరావతి మహిళలపై అనుచిత వ్యాఖ్యలను నిరసిస్తూ రాష్ట్రవ్యాప్తంగా కూటమి పార్టీ నేతల ఆధ్వర్యంలో ఆందోళనలు నిర్వహించారు. సాక్షి కార్యాలయాల ముందు నిరసన తెలిపారు. రాష్ట్రంలో సాక్షి మీడియాను నిషేధించాలంటూ నినదించారు. ఆ పేపర్ ప్రతులను చింపి రోడ్లపై తగలబెట్టారు. ఇప్పటికైనా సాక్షి యాజమాన్యం స్పందించి క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. సాక్షి టీవీ ఛానల్‌లో అమరావతి మహిళలను కించపరిచే విధంగా చేసిన అనుచిత వ్యాఖ్యలపై రాష్ట్రవ్యాప్తంగా ఆందోళనలు కొనసాగుతూనే ఉన్నాయి. ఎన్టీఆర్ జిల్లా నందిగామలో కూటమి పార్టీల ఆధ్వర్యంలో నిరసన ర్యాలీ చేశారు. ఎమ్మెల్యే తంగిరాల సౌమ్య కార్యాలయం నుంచి స్థానిక గాంధీ సెంటర్ వరకు ర్యాలీగా వెళ్లారు. మాజీ సీఎం జగన్, జర్నలిస్ట్ కృష్ణంరాజు, సాక్షి టీవీ వ్యాఖ్యాత కొమ్మినేని శ్రీనివాసరావు చిత్రపటాలను చెప్పులతో కొడుతూ నిరసన తెలిపారు. భారతీరెడ్డి, జగన్ క్షమాపణలు చెప్పాలని డిమాండ్ చేశారు. సాక్షి మీడియాను రాష్ట్రంలో నిషేధించాలంటూ విజయవాడ చిట్టినగర్ సెంటర్‌లో యువత నిరసన చేపట్టారు. మహిళల్ని కించపరిచిన కొమ్మినేని, కృష్ణంరాజు, సాక్షి యాజమాన్యంపై కోడిగుడ్లు విసిరి నిరసన తెలిపారు. సాక్షి ఛానల్, పత్రికను మూసి వేయాలంటూ తిరువూరులో తెలుగు మహిళలు ఆందోళన చేపట్టారు.

**సాక్షి పత్రికను దగ్ధం:** గుంటూరు లాడ్జికూడలి అంబేడ్కర్ విగ్రహం వద్ద టీడీపీ నేతలు నిరసన చేపట్టారు. సాక్షి ప్రతులను తగులబెట్టి జగన్, భారతీరెడ్డి మహిళలకు క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. మహిళలను ఉద్దేశించి సజ్జల రామకృష్ణారెడ్డి మాట్లాడిన మాటలను ఖండించారు. అమరావతిని అప్రతిష్టపాలు చేస్తున్న సాక్షి మీడియాను నిషేధించాలని కేంద్ర సహాయక మంత్రి భూపతిరాజు శ్రీనివాస్ వర్మ డిమాండ్ చేశారు. పశ్చిమగోదావరి జిల్లా భీమవరంలో జనసేన కూటమి ఆధ్వర్యంలో జరిగిన ఆందోళనలో ఎమ్మెల్యే పులపర్తి రామాంజనేయులు, రాజ్యసభ మాజీ సభ్యురాలు తోట సీతారామలక్ష్మి ఆధ్వర్యంలో సాక్షి పత్రికను దగ్ధం చేశారు. సాక్షి మీడియా ద్వారా అవాస్తవాలను ప్రసారం చేస్తూ అప్రతిష్టపాలు చేస్తుందని మండిపడ్డారు.



ఒంగోలులో ప్లకార్డులతో ఆందోళన చేపడుతున్న మహిళలు

**ప్లకార్డులు చేతబట్టి ర్యాలీ:** తూర్పుగోదావరి జిల్లా రాజనగరంలోని సాక్షి కార్యాలయం వద్ద కూటమి శ్రేణులతో కలిసి అనపర్తి ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి, రాజనగరం ఎమ్మెల్యే బత్తుల బలరామకృష్ణ వేర్వేరుగా ఆందోళన చేపట్టారు. అమరావతి మహిళలను అవమానించిన సాక్షి జర్నలిస్టులు, యాజమాన్యంపై చర్యలు తీసుకోవాలని నినాదాలు చేశారు. కొత్తపేటలో తెలుగుమహిళల ఆధ్వర్యంలో ప్లకార్డులు చేతబట్టి ర్యాలీ నిర్వహించారు. మహిళలను కించపరుస్తూ డిబేట్‌లు నిర్వహించిన సాక్షి ఛానల్ మూసివేయాలంటూ నినాదాలు చేశారు. నిడదవోలులోని గణేష్ చౌక్ సెంటర్‌లో కూటమి నాయకులు ధర్నా చేపట్టారు. సాక్షి పత్రిక ప్రతులు చింపి, చెప్పులతో కొట్టి నిరసన తెలిపారు. అంబేడ్కర్ కోనసీమ జిల్లా ముమ్మిడివరంలో సాక్షి ప్రతులను చింపేసి జగన్, భారతీరెడ్డి, కొమ్మినేని శ్రీనివాసరావుతో పాటు సజ్జల రామకృష్ణారెడ్డికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు.


నరసన్నపేటలో సాక్షి మీడియాకు వ్యతిరేకంగా నిరసన చేపడుతున్న మహిళలు


మడకశిరలో మానవహారం చేపడుతున్న చిత్రం

**దుర్భాషలాడటం దారుణం:** మహిళలపై అనుచిత వ్యాఖ్యలు చేసిన వారిపై తక్షణమే చర్యలు తీసుకోవాలని విశాఖ జిల్లా పెందుర్తి జంక్షన్‌లో మహిళలు నిరసన చేపట్టారు. పాయకరావుపేటలో కూటమి పార్టీలకు చెందిన మహిళ నాయకులు భారీ ర్యాలీ నిర్వహించారు. రాజధాని అమరావతిపై విషం కక్కుతూ సాక్షి మీడియాలో వార్తలు ప్రచారం చేస్తున్నారని మండిపడ్డారు. శ్రీకాకుళం జిల్లా పలాసలో టీడీపీ ఆధ్వర్యంలో ఆందోళన చేపట్టారు. 3 రోడ్ల కూడలి వద్ద మానవహారంగా ఏర్పడి సాక్షి పత్రికకు నిప్పు పెట్టారు. పాతపట్నం నియోజకవర్గంలో మహిళలు నిరసన ర్యాలీ నిర్వహించారు. కృష్ణంరాజు, కొమ్మినేని శ్రీనివాసరావు మహిళలపై దుర్భాషలాడటం దారుణమని అన్నారు.

**సాక్షి టీవీ, పత్రికను బ్యాన్:** మహిళలను కించపరిచిన కొమ్మినేని, కృష్ణంరాజులపై కఠిన చర్యలు తీసుకోవాలని తెలుగుమహిళలు కర్నూలులో డిమాండ్ చేశారు. పాణ్యంలో మాధవి నగర్ వద్ద రహదారిపై నిరసన తెలిపారు. కడపలో తెలుగు మహిళలు ఆందోళన చేపట్టారు. సంధ్యాసర్కిల్ నుంచి కలెక్టరేట్ వరకు టీఎన్ఎస్ఎఫ్ నాయకుల ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించారు. అన్నమయ్య జిల్లా రాయచోటిలో మహిళలు భారీ ఎత్తున నిరసన చేపట్టారు. సాక్షి టీవీ, పత్రికను బ్యాన్ చేయాలని డిమాండ్ చేశారు. చిత్తూరు జిల్లా పుంగనూరులో టీడీపీ మహిళా నేతలు ర్యాలీ నిర్వహించారు. కదిరిలో మహిళలు ర్యాలీ నిర్వహించారు. సాక్షి ఛానల్‌ను రద్దు చేస్తూ యాజమాన్యంపై క్రిమినల్ కేసు నమోదు చేయాలని నినాదాలు చేశారు. రాప్తాడు పరిధిలోని కళ్యాణదుర్గం సమీపంలో మహిళలు భారీ ర్యాలీ నిర్వహించారు.


కనిగిరిలో నిరసన ర్యాలీ చేపడుతున్న మహిళలు


ధర్మవరం కళాజ్యోతి సర్కిల్లో సాక్షి పేపర్‌ను తగలబెడుతున్న చిత్రం

# మహిళలను కించపరిచిన సాక్షి మీడియాను వెంటనే రద్దు చేయాలి

**●రాష్ట్ర అభివృద్ధిపై విషం కక్కుతున్న వైసీపీ కాలనాగులు**
**●రాజకీయ లబ్ధి కోసం మహిళలపై వైసీపీ వెకిలి చేష్టలు**
**●మచిలీపట్నంలో తెలుగు మహిళల నిరసన**




మచిలీపట్నం (చైతన్యరథం): ఫుల్ టైం బెంగళూరులో గడుపుతూ పార్ట్ టైం రాజకీయాలు చేస్తున్న జగన్మోహన్ రెడ్డిని ప్రజలు ఛీ కొట్టిన తీరు మారడం లేదని తెలుగుమహిళలు ఆగ్రహం వ్యక్తం చేశారు. తెలుగుదేశం పార్టీ మచిలీపట్నం నియోజకవర్గం తెలుగు మహిళల ఆధ్వర్యంలో మహిళలను కించపరిచే విధంగా వార్తలు రాసిన సాక్షి మీడియాను వెంటనే రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ తెలుగుదేశం పార్టీ తెలుగు మహిళలు స్వర్గీయ ఎన్టీఆర్ విగ్రహం ఎదుట ప్లకార్డులతో నిరసన వ్యక్తం చేసి సాక్షి న్యూస్ పేపర్లను దగ్ధం చేసి పలువురు మహిళలు మీడియాతో మాట్లాడుతూ... రాష్ట్రానికి పెట్టుబడులు ఆకర్షణగా వస్తున్న తరుణంలో వైసీపీ అమరావతిపై విషం చిమ్ముతూ రాష్ట్రానికి పెట్టుబడులు రాకుండా చేయాలని చూస్తున్నారని అన్నారు. నేరాలు నియంత్రణలో ఉండి, మహిళలు కూటమి ప్రభుత్వంలో సురక్షితంగా జీవిస్తున్నారు. ఆర్థికంగా రాష్ట్రం బలోపేతం అవుతున్న తరుణంలో మహిళా లోకంలో చిచ్చుపెట్టే విధంగా జగన్మోహన్ రెడ్డి అమరావతి రాజధాని గురించి వారి నాయకులతో మహిళలపై అసభ్యకరంగా మాట్లాడించడం జగన్మోహన్ రెడ్డి, వైసీపీ నేతల సిగ్గుమాలిన చర్యకు నిదర్శనం అన్నారు. అభివృద్ధి, ప్రశాంతం అనే పదాలు నచ్చని వైసిపి ముఠా విష ప్రచారాలు చేస్తూ తన రాజకీయ పబ్బం గడుపు కుంటోంది అన్నారు. ప్రజలు ఓటు అనే ఆయుధంతో చంప దెబ్బ కొట్టిన వైసీపీ వారికి ఇంకా బుద్ధి రాలేదు అన్నారు. అవినీతి అక్రమార్జనతో కలుపు మొక్కల సాక్షి మీడియా ఆవిర్భవించి అబద్ధాలే పరమావధి గా నీచపురాతలు రాస్తోంది అన్నారు. తప్పుడు కథనాలు, అబద్ధపు ప్రచారాలు ప్రజల్లోకి పంపడమే సాక్షి పత్రిక ధ్యేయంగా పెట్టుకుని కూటమి ప్రభుత్వం పై వైసిపి వారు విషం చిమ్ముతున్నారు అన్నారు. శవ రాజకీయాలు వైసిపి నైజం అని కూటమి ప్రభుత్వంపై లేనిపోని అబద్ధాలు సృష్టించి, కుల చిచ్చులు పెట్టడం వైసిపి నేతల ధ్యేయం అన్నారు. రాష్ట్రంలో ఏదో జరిగిపోతున్నట్లు సాక్షి పత్రిక రాతలు రాసి ప్రజలను మోసం చేస్తోందని ప్రజలు గ్రహించాలి అన్నారు. వృద్ధులకు ఇచ్చిన పెన్షన్ల నుంచి రాష్ట్రానికి వస్తున్న లక్షల కోట్ల పెట్టుబడులపై కూడా సాక్షి పత్రిక నీచపురాతలు రాస్తూ జర్నలిజం విలువలు దిగజారుస్తున్నారు అని మండిపడ్డారు. జాతీయస్థాయిలో మహిళలపై నేరాల రేటు 66.4 శాతం కాగా మన రాష్ట్రంలో జగన్మోహన్ రెడ్డి పాలనలో 96.2 శాతం నమోదు అవడం మహిళా భద్రతలో వైసీపీ పాలనలో జగన్మోహన్ రెడ్డి డొల్లతనం తెలియజేస్తోంది అన్నారు.

# సాక్షికి వ్యతిరేకంగా కొవ్వూరులో కథం తొక్కిన మహిళలు

కొవ్వూరు (చైతన్యరథం): ఆంధ్రుల కలల రాజధాని "అమరావతి"ని "వేశ్యల రాజధాని" అని సాక్షి డిబేట్‌లో సాక్షి టీవి జర్నలిస్ట్ కృష్ణంరాజు, కొమ్మినేని అనే నీచులు మాట్లాడి ఆడబిడ్డలను అవమానించినందుకు, మహిళల శీలహననం చేయించినందుకు సాక్షి ఛానల్ ప్రసారాల అనుమతులు రద్దు చేయాలని కొవ్వూరులోని తెలుగుదేశం పార్టీ కార్యాలయం నుండి విజయ విహార సెంటర్ వరకు నియోజకవర్గ మహిళలు ధర్నార్యాలీ నిర్వహించి, విజయ విహార్ సెంటర్‌లో సాక్షి దినపత్రికను దహనం చేసి నిరసన తెలియజేసారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గంలోని మహిళలు పెద్దఎత్తున పాల్గొన్నారు. మహిళలకు సంఘీభావం తెలియజేస్తూ కొవ్వూరు నియోజకవర్గం శాసనసభ్యులు ముప్పిడి వెంకటేశ్వరరావు, కూటమి నాయకులు పాల్గొన్నారు.



# రాష్ట్ర మహిళలకు జగన్ క్షమాపణలు చెప్పాలి...
## శాసనసభ్యులు దేవ వరప్రసాద్

మల్కిపురం (చైతన్యరథం): రాష్ట్ర మహిళలకు జగన్మోహన్‌రెడ్డి క్షమాపణ చెప్పాలని రాజోలు నియోజకవర్గం సభ్యులు దేవ వరప్రసాద్ అన్నారు. మల్కిపురం సెంటర్‌లో యన్.డి నాయకులతో కలసి దేవ వరప్రసాద్ సాక్షి ఛానల్‌కు వ్యతిరేక నినాదాలు చేస్తూ నిరసన ర్యాలీ చేసారు. ఈ సందర్భంగా దేవవరప్రసాద్ మాట్లాడుతూ... ఇటీవల కొమ్మినేని శ్రీనివాస్‌రావు సాక్షి లైవ్‌షోలో రాజధాని అమరావతి మహిళలపై అనుచిత వ్యాఖ్యలు చేసిన జర్నలిస్ట్ కష్టంరాజుపై మరియు ఈ వ్యాఖ్యలను ప్రోత్సహించిన సాక్షి ఛానల్ పైన చర్యలు తీసుకోవాలని, జగన్మోహన్‌రెడ్డి భారతిరెడ్డిలు ఆంధ్ర రాష్ట్ర మహిళ లోకానికి క్షమాపణ చెప్పాలని అన్నారు. అమరావతి నగరంపై కావాలని బురదజల్లే ప్రయత్నం చేస్తున్నారని, ఇది కేవలం ఉద్దేశపూర్వకంగా పథకం ప్రకారంగా చేస్తున్న తప్పుడు ప్రచారం అని ఈ వ్యాఖ్యలపై మహిళల అవమానంగా భావిస్తున్నారని అన్నారు. ఈ కార్యక్రమంలో పలువురు ఎన్డీయే కూటమి నేతలు పాల్గొన్నారు.



# అమరావతి మహిళలపై వ్యాఖ్యలకు నిరసన...
## నిందితుడిని అరెస్టు చేయాలని ఆందోళన

బాపట్ల(చైతన్యరథం): సాక్షి లైవ్ డిబేట్‌లో అమరావతి మహిళలను కించపరిచేలా మాట్లాడిన కృష్ణంరాజును తక్షణమే అరెస్టు చేయాలని బాపట్లలో ఆందోళన నిర్వహించారు. ఎంతో ప్రాముఖ్యత గల అమరావతి ప్రాంతాన్ని కించపరిచే విధంగా మాట్లాడ టాన్ని ఖండించారు. బాపట్ల అంబేద్కర్ సర్కిల్ సెంటర్‌లో తెలుగు దేశం పార్టీ ఆధ్వర్యంలో నిరసన వ్యక్తం చేశారు. ఈ కార్యక్ర మంలో బాపట్ల పార్లమెంట్ మహిళా ప్రధాన కార్యదర్శి పల్లం సరోజిని, టీఎన్ఎస్ఎఫ్ బాపట్ల పార్లమెంట్ అధ్యక్షుడు మువ్వా శరత్, బాపట్ల పార్లమెంట్ తెలుగు యువత అధ్యక్షుడు శ్రీధర్, బాపట్ల పార్లమెంట్ ఆర్గనైజింగ్ సెక్రటరీ రావిపాటి సంధ్య, చీరాల నియోజకవర్గ టీడీపీ అధ్యక్షురాలు కొమ్మబోయిన రజిని, బాపట్ల నియోజకవర్గ టీడీపీ మహిళా అధ్యక్షురాలు చెన్నుపాటి హైమా వతి, కూచిపూడి ఝాన్సీరాణి, నజ్మా, రాంబాబు, సుబ్బలక్ష్మి, నాగమల్లేశ్వరి, కట్టా సుజాత, ఇందు, రమాదేవి, గోపి, లుదియా, జయ తదితరులు పాల్గొన్నారు.



# మహిళలను అవమానించిన వారిని కఠినంగా శిక్షించాలి

**●సాక్షి యాజమాన్యం మహిళలకు బహిరంగ క్షమాపణ చెప్పాలి**
**●మానవహారం చేసి సాక్షి ప్రతులు చింపివేత**
**●రామచంద్రపురంలో కదం తొక్కిన మహిళా లోకం**




రామచంద్రపురం (చైతన్యరథం): అమరావతి మహిళలపై అనుచిత వ్యాఖ్యలు చేసిన కొమ్మినేని శ్రీనివాసరావు, కృష్ణంరాజులను కఠినంగా శిక్షించడంతోపాటు, సాక్షి యాజమాన్యం మహిళా లోకానికి బేషరతుగా క్షమాపణ చెప్పాలని రామచంద్రపురం నియోజకవర్గం మహిళా నాయకులు డిమాండ్ చేస్తూ భారీ నిరసన ప్రదర్శన నిర్వహించారు. ఈ ర్యాలీ స్థానిక లైన్స్ క్లబ్ కళ్యాణ మండపం వద్ద ప్రారంభమై మెయిన్ రోడ్డు మీదుగా రాజగోపాల్ సెంటర్ వరకు సాగింది. అనంతరం మానవహారం నిర్వహించి సాక్షి యాజమాన్యానికి వ్యతిరేకంగా నినాదాలు చేసి, సాక్షి ప్రతులను చింపివేశారు. ఈ సందర్భంగా మహిళా నాయకురాలు జాస్తి విజయలక్ష్మి, గజలక్ష్మి, బల్లా లక్ష్మి, నెక్కంటి జానకి లక్ష్మి, వంజరపు రాజేశ్వరి తదితరులు మాట్లాడుతూ స్త్రీ పవిత్రతను, అమ్మతనాన్ని అవమానించిన సాక్షి వ్యాఖ్యాత కొమ్మినేని శ్రీనివాసరావు, కృష్ణంరాజులను కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. ప్రజా రాజధాని అమరావతి పట్ల జరుగుతున్న కుట్రలో భాగమేనని ఆరోపించారు. మాతృమూర్తులను అవమానిస్తే సాక్షి యాజమాన్యం భారతి రెడ్డి, జగన్ రెడ్డి కనీసం క్షమాపణలు చెప్పకపోగా నిందితులకు అండగా ఉండడం బాధాకరం అన్నారు. ఆస్తికోసం కన్న తల్లిని, సొంత చెల్లిని తరిమేసిన వ్యక్తికి మహిళల త్యాగాలు, గొప్పతనం తెలియవు అని, మహిళల గౌరవాన్ని కించి పరిచే విధంగా తన సొంత మీడియా సాక్షి పత్రికల్లో ప్రచురింప చేస్తున్న జగన్ రెడ్డి, భారతీరెడ్డిలు మహిళల త్యాగాలను గొప్పతనాన్ని ఎన్నటికీ తెలుసుకోలేరని అన్నారు. అమరావతిని, అక్కడి మహిళలను కించపరుస్తూ జుగుప్సాకరంగా మాట్లాడిన వారు అసలు మనుషులేనా అని ఆగ్రహం వ్యక్తంచేశారు. మహిళల్ని ఘోరంగా అవమానించడం జగన్ సహా వైకాపా నేతల పైశాచికానందానికి పరాకాష్టని మండిపడ్డారు. ఆంధ్ర రాష్ట్ర రాజధాని అమరావతి దేవతల కొలువున్న ప్రాంతం కాదని వేశ్యలు ఉన్న ప్రాంతమని జగన్ రెడ్డి, భారతి రెడ్డిల సాక్షి మీడియా ప్రచురించడం సిగ్గుచేటన్నారు. మహిళల్ని అవమానపరుస్తూ చేసిన వాక్యలు క్షమించరానివని, ఇటువంటి కుట్ర రాజకీయాలకు పాల్పడిన నేరానికి జగన్ రెడ్డి, ఆయన సతీమణి భారతీ రెడ్డి మహిళా లోకానికి బేషరతుగా క్షమాపణలు చెప్పాలని, కృష్ణంరాజును వెంటనే అరెస్టు చెయ్యాలని, కొమ్మినేని లాంటి ఉన్మాదులపై తక్షణమే చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో రామచంద్రపురం నియోజవర్గంలోని పెద్ద ఎత్తున మహిళలు పాల్గొన్నారు.

# రాష్ట్ర మహిళలకు వై.ఎస్.భారతిరెడ్డి, కృష్ణంరాజు బహిరంగ క్షమాపణలు చెప్పాలి

**●విజయవాడ వెస్ట్ టీడీపీ కార్యాలయం నుంచి చిట్టినగర్ వరకు నిరసన ర్యాలీ**



విజయవాడ (చైతన్యరథం): ఎమ్మెల్యే జగన్ రెడ్డి, సాక్షి నిర్వాహకురాలు వై.ఎస్.భారతి రెడ్డి మెప్పు కోసం అమరావతి రాజధాని నిర్మాణ పనులు అడ్డుకునేందుకు, విషం చిమ్మే కుట్రలో భాగంగా సాక్షి మీడియాలో మహిళలను కించపరిచే విధంగా మాట్లాడితే సహించేది లేదు. సాక్షి టీవీ ఛానెల్‌లో అమరావతి మహిళలను అవమానపరిచే విధంగా మాట్లాడిన ఎనలిస్ట్ కృష్ణంరాజు, అమరావతి రాజధాని పై విషం చిమ్మేందుకు సహకరించినందుకు సాక్షి మీడియా నిర్వాహకురాలు వై.ఎస్.భారతి రెడ్డి రాష్ట్ర ప్రజలకు బహిరంగ క్షమాపణలు చెప్పాలని మహిళ, యువజన విద్యార్థి సంఘాలు,అమరావతి మహిళలు డిమాండ్ చేశారు. మహిళలను అవమానపరిచే విధంగా మాట్లాడి భావ స్వేచ్ఛ ప్రకటన వుందని చెప్పుకోవటం సిగ్గు చేటన్నారు. ఇష్టం వచ్చినట్లు మాట్లాడితే ఎవరు సహించేది లేదని, దేనికైనా ఒక హద్దు వుంటుందని హెచ్చరించారు. పశ్చిమ నియోజకవర్గంలో మంగళవారం మహిళ, యువజన విద్యార్థి సంఘాలు, అమరావతి మహిళల ఆధ్వర్యంలో సాక్షి ఛానెల్‌లో ప్రసారమైన వ్యాఖ్యలకు నిరసనగా భారీ ర్యాలీ జరిగింది. ఈ నిరసన ర్యాలీ పంజా సెంటర్ దగ్గర గల గణపతి రావు రోడ్డు లోని పశ్చిమ నియోజకవర్గ తెలుగుదేశం పార్టీ కార్యాలయం నుంచి చిట్టినగర్ సెంటర్ వరకు సాగింది. అమరావతి మహిళలను కించపరిచే విధంగా వ్యాఖ్యలు చేసిన ఎనలిస్టు కృష్ణంరాజు, సాక్షి మీడియా నిర్వాహకురాలు వై.ఎస్.భారతి రెడ్డిలపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలంటూ నినాదాలు చేశారు.

# అభివృద్ధి, సంక్షేమ నమూనా... ప్రత్తిపాటి ఏడాది పాలన

● గత పాలకుల తప్పులు సరిచేసి, ప్రజాసంక్షేమాన్ని, నియోజకవర్గ అభివృద్ధిని పట్టాలెక్కించిన ప్రత్తిపాటి



చికలూరిపేట (చైతన్యరథం): ఐదేళ్ల వైసీపీ పాలనలో అవినీతి.. అక్రమాలు.. నేరాలకు నిలయంగా మారిన రాష్ట్రాన్ని రక్షించుకోవాలన్న ధృఢచిత్తంతో, బటన్ నొక్కుడు ముసుగులో తమ జీవితాల్ని యాచించే స్థితికి తీసుకొస్తున్న పాలకులు కుయుక్తులకు చరమగీతం పాడాలన్న కృతనిశ్చయంతో 2024 సార్వత్రిక ఎన్నికల్లో ఆంధ్రప్రదేశ్ ప్రజలు చరిత్రలో నిలిచిపోయేలా కూటమిపార్టీలకు కనివినీ ఎరుగని విజయం కట్టబెట్టారు. ఆ విజయపరంపరలో భాగంగా రాష్ట్రంలోని ప్రధాన నియోజకవర్గాల్లో ఒకటైన పల్నాడు జిల్లా చిలకలూరిపేట నుంచి మాజీమంత్రి ప్రత్తిపాటి పుల్లారావు 30వేల పైచిలుకు భారీ మెజారిటీతో విజయం సాధించారు. నీతి..నిజాయితీ.. నిబద్ధతలే ప్రామాణికంగా, ఇచ్చినమాటకు కట్టుబడే వ్యక్తిగా పేరుపొందిన ప్రత్తిపాటి.. ఎన్నికల వేళ ప్రజలకు ఇచ్చిన ప్రతి హామీకి బద్ధుడై, ప్రజాప్రతినిధిగా తన ప్రస్థానాన్ని ప్రారంభించారు. సరిగ్గా ఏడాది క్రితం 2024 జూన్ -4న ఎన్నికల ఫలితాలు వెలువడితే, జూన్ 12న కూటమి ప్రభుత్వం కొలువుదీరింది. ఆ రోజు నుంచి చిలకలూరిపేట నియోజకవర్గంలో మొదలైన ప్రత్తిపాటి అభివృద్ధి ప్రస్థానం.. సంక్షేమ ఒరవడి నేటికీ నిరంతరాయంగా కొనసాగుతూనే ఉంది. ప్రజల్లో ఒకడిగా ఎల్లవేళలా వారికి అందుబాటులో ఉంటూ, కేంద్ర.. రాష్ట్రప్రభుత్వాల సహకారంతో ఆయన నియోజకవర్గ అభివృద్ధే లక్ష్యంగా, సంక్షేమమే పరమావధిగా తన పనితీరు కొనసాగిస్తున్నారు.

**జాతీయ రహదారి -16 బైపాస్ నిర్మాణంతో మారిన నియోజకవర్గ రూపురేఖలు...**

చిలకలూరిపేట బైపాస్ నిర్మాణంలో భాగంగా కోల్‌కతా-చెన్నై జాతీయ రహదారి -16 విస్తరణలో కీలకమైన 16.38 కిలోమీటర్ల ఆరువరసల బైపాస్ నిర్మాణం పూర్తిచేయడం, ప్రధాని చేతుల మీదుగా జాతికి అంకితం చేయడం ఎమ్మెల్యే ప్రత్తిపాటి పట్టుదలకు నిదర్శనమనే చెప్పాలి. ఈ బైపాస్ నిర్మాణానికి అవసరమైన భూసేకరణకోసం తొలినుంచీ ప్రత్తిపాటి రైతుల పక్షానే నిలిచారు. వారితో సంప్రదింపులు జరుపుతూ... వారికి ఎలాంటి సమస్యలు లేకుండా అధికారుల్ని ఒప్పించి బైపాస్ విస్తరణకు మార్గం సుగమం చేశారు. ప్రతి రైతుతో స్వయంగా మాట్లాడిన ప్రత్తిపాటి, వారికి తగిన నష్టపరిహారం ఇప్పించేలా జాతీయ రహదారుల ప్రాధికార సంస్థ (ఎన్.హెచ్.ఏ.ఐ) అధికారుల్ని ఒప్పించడంలో కీలకంగా వ్యవహరించారు. ఈ బైపాస్ నిర్మాణం పూర్తితో చిలకలూరిపేట ప్రధాన కేంద్రం రూపురేఖలే మారిపోయాయి. బైపాస్ అందుబాటులోకి రావడంతో నియోజకవర్గం వాణిజ్య, వ్యవసాయరంగాలకు కీలకంగా మారింది. ప్రజలకు, చెన్నై-కోల్ కతా జాతీయ రహదారిపై ప్రయాణించే వాహనాలకు ట్రాఫిక్ సమస్యలు తీరిపోయాయి.

**కూటమిప్రభుత్వంలో ఠంఛన్‌గా నెలానెలా రూ.4వేల పింఛన్..**

గత ఎన్నికల ప్రచారంలో భాగంగా సామాజిక పింఛన్ పెంచుతామన్న చంద్రబాబు.. అధికారం చేపట్టిన వెంటనే రూ.3వేల పింఛన్ ను రూ.4వేలకు పెంచారు. అదే పింఛన్‌ను గతంలో రూ.200 నుంచి రూ.2వేలకు పెంచింది కూడా టీడీపీ ప్రభుత్వమే. జగన్ ఐదేళ్లలో ముక్కిమూలిగి ఏడాదికి రూ.250 చొప్పున వెయ్యి పెంచి చేతులుదులుపుకోవడమేగాక పార్టీల ముసుగులో రాజకీయాలు చేసి అర్హులైన ఎందరికో పింఛన్ ఎగ్గొట్టాడు. ప్రత్తిపాటి ఆధ్వర్యంలో నియోజకవర్గవ్యాప్తంగా నెలకు రూ.15.08కోట్ల పింఛన్ వివిధరకాల లబ్ధిదారులకు అందుతోంది. ఈ ఒక్క ఏడాదిలోనే కేవలం పింఛన్లకే కూటమిప్రభుత్వం రూ.34వేలకోట్లు ఖర్చుచేస్తే, ప్రత్తిపాటి నియోజకవర్గవ్యాప్తంగా రూ.181కోట్లు అందించడం జరిగింది.

**కొండవీడు కోట అభివృద్ధిపై ప్రత్తిపాటి ప్రత్యేక శ్రద్ధ**

నియోజకవర్గంలోని ప్రధాన ఆధ్యాత్మిక, పర్యాటక కేంద్రమైన కొండవీడు కోటను అన్నివిధాల అభివృద్ధి చేసి, జాతీయ స్థాయి పర్యాటక కేంద్రంగా తీర్చిదిద్దాలని ప్రత్తిపాటి గట్టిపట్టుదలతో ఉన్నారు. గతంలో 2018లో ప్రత్తిపాటి హయాంలోనే కొండవీడు ఘాట్ రోడ్డును టీడీపీ ప్రభుత్వం పూర్తిచేసింది. రూ.40కోట్లు వెచ్చించి అద్భుతమైన రోడ్డు వేయడం జరిగింది. నెలరోజుల క్రితం ప్రత్తిపాటి ఎంపీ లావు కృష్ణదేవరాయలుతో కలిసి ఢిల్లీలో కేంద్రపర్యాటక మంత్రి గజేంద్ర సింగ్ షెకావత్‌ను కలిసి కొండవీడు అభివృద్ధిపై చర్చించారు. ఎమ్మెల్యే, ఎంపీ విజ్ఞప్తి స్పందించిన షెకావత్ ప్రపంచ వారసత్వ పర్యాటక కేంద్రంగా కొండవీడును గుర్తించి అభివృద్ధికి సహకరిస్తామని హామీ ఇచ్చారు.

**స్వయం ఉపాధి రుణాల పంపిణీలో జోరు...**

యువత, మహిళలు, నిరుద్యోగులు తమ సొంత కాళ్లపై తాము నిలబడి, తెలివితేటలతో ఎదగాలన్నదే ప్రత్తిపాటి ఆలోచన. ఒకరి కింద పనిచేసే బదులు ఎవరికి వారు తమకు చేతనైన వృత్తి, ఉపాధి రంగాల్లో రాణించి, పదిమందికి ఉపాధి కల్పించాలన్న సదాశయంలో భాగంగా ఈ సంవత్సరం నియోజకవర్గవ్యాప్తంగా విరివిగా ఉపాధి రుణాలు, బ్యాంక్ లింకేజ్ రుణాలు పంపిణీ చేయడం జరిగింది. పల్నాడు జిల్లాలో మరే నియోజకవర్గంలో లేని విధంగా కూటమిప్రభుత్వం ఏర్పడిన ఏడాదికే నియోజకవర్గంలో రూ.360కోట్ల రుణాల పంపిణీతో చిలకలూరిపేట అగ్రస్థానంలో నిలిచింది.

**సీఎం.ఆర్.ఎఫ్... రూ.4కోట్లకు పైగా సాయం అందించిన ప్రత్తిపాటి**

వివిధ రకాల అనారోగ్య సమస్యలతో బాధపడుతూ, దీర్ఘకాల వ్యాధులతో ప్రాణాలు అరచేతిలో పెట్టుకొని బ్రతికే ఎందరికో మెరుగైన కార్పొరేట్ వైద్యం అందేలా ప్రత్తిపాటి చొరవచూపారు. తనను అడిగినవారికి లేదనకుండా, ప్రభుత్వం అందిస్తోన్న సీఎం.ఆర్.ఎఫ్ (ముఖ్యమంత్రి సహాయనిధి) సాయం బాధితులకు వేగంగా అందేలా చర్యలు తీసుకున్నారు. ఆ విధంగా ఈ ఒక్క సంవత్సరంలోనే నియోజకవర్గవ్యాప్తంగా 400మందికి దాదాపు రూ.4,24,71,000ల విలువైన చెక్కులు అందించారు. సీఎం.ఆర్.ఎఫ్‌లో భాగమైన అత్యవసర చికిత్సల నిమిత్తం దాదాపు 57 మంది రోగులకు రూ.1.85కోట్ల విలువైన ఎల్.వో.సీలు అందించారు.

**బడుగు... బలహీన వర్గాల విద్యార్థుల భవిత కోసం కేంద్రీయ విద్యాలయం ఏర్పాటు...**

మట్టిలో మాణిక్యాలను వెలికి తీయడంకోసం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల సహకారంతో 2014-19 మధ్య టీడీపీ ప్రభుత్వంలోనే ఇర్లపాడులో కేంద్రీయ విద్యాలయ నిర్మాణాన్ని ప్రత్తిపాటి ప్రారంభించారు. తొలుత గణపవరంలో తాత్కాలిక భవనాల్లో తరగతులు ప్రారంభించిన అధికారులు...తర్వాత ఎమ్మెల్యే ప్రత్తిపాటి చొరవతో ఇర్లపాడులో శాశ్వత భవనాల నిర్మాణానికి శ్రీకారం చుట్టారు. నర్సరీ నుంచి ఇంటర్ వరకు నాణ్యమైన విద్యాబోధన అందించేలా 49 గదులతో సువిశాలమైన భవనం నిర్మాణం 2019 నాటికి 80 శాతానికి పైగా పూర్తయింది. తర్వాత వైసీపీ ప్రభుత్వం రావడంతో పనులు నిలిచిపోయాయి. మరలా 2024లో కూటమిప్రభుత్వ రాకతో విద్యాలయం పనులు సంపూర్తిగా ముగిశాయి. రూ.29 కోట్లతో విద్యాలయాన్ని విద్యార్థుల కోసం అందుబాటులోకి తీసుకొచ్చిన ఘనత ప్రత్తిపాటికే దక్కుతుంది.

**అమృత్ పథకంలో భాగంగా తాగునీటి పైపులైన్ల ఏర్పాటుకు రూ.116.80 కోట్లు మంజూరు**

అమృత్ పథకం కింద పట్టణంలోని తాగునీటి అవసరాలకు రూ.116.80కోట్లు మంజూరయ్యాయి. ఎన్.ఎస్.పీ రైట్ కెనాల్ నుంచి నేరుగా చిలకలూరిపేట ఓవర్ హెడ్ ట్యాంక్‌కు 38 కిలోమీటర్ల పొడవున పైపులైన్లు వేయాల్సి ఉంది. ఈ పనులు త్వరలోనే ప్రారంభం కానున్నాయి. అలానే రెండు ఎస్.టీ.పీ ప్లాంట్ ఏర్పాటుకు రూ.40.84 కోట్లు మంజూరయ్యాయి. డంప్ యార్డ్‌లో రూ.16కోట్లతో ఇటీవలే నూతన వ్యర్థాల నిర్వహణ కేంద్రాన్ని ప్రారంభించడం జరిగింది. గతప్రభుత్వంలో పోగుపడిన వేల టన్నుల చెత్త తరలింపు ప్రక్రియను కూడా ప్రారంభించడం జరిగింది. డీ.పీ.ఎస్ (భవనాల క్రమబద్ధీకరణ)కు సంబంధించి రూ.4కోట్లు మంజూరవగా, 15వ ఆర్థిక సంఘం నిధులు రూ.5 కోట్లు మంజూరయ్యాయి. 15వ ఆర్థికసంఘం నిధులతో పట్టణంలో రోడ్లు, డ్రైనేజ్ ల నిర్మాణం చేపట్టాల్సి ఉంది.

**రూ.75 లక్షలతో 15 గ్రామాలు, 10వార్డుల ప్రజల కోసం తాగునీటి ప్లాంట్..**

2017-18లో ప్రత్తిపాటి మంత్రిగా ఉన్నప్పుడు రూ..5 కోట్లతో పట్టణ శివార్లలోని మంచినీటి చెరువు వద్ద ఎన్టీఆర్ సుజల స్రవంతి ప్లాంట్ ఏర్పాటు చేయడం జరిగింది. దాతల సహకారంతో పాటు రూ.30లక్షల సొంత నిధులు వెచ్చించి, మొత్తం రూ.75లక్షలతో ప్రత్తిపాటి వాటర్ ప్లాంట్ ఏర్పాటు చేయించారు. చిలకలూరిపేట, నాదెండ్ల మండలాల్లోని 15 గ్రామాలు, మున్సిపాలిటీ పరిధిలోని 10 వార్డుల ప్రజలకు స్వచ్ఛమైన, సురక్షిత తాగునీరు అందించడం కోసమే ప్లాంట్ ఏర్పాటుచేయడం జరిగింది.

**ఏరియా వైద్యశాలలో వివిధరకాల అభివృద్ధిపనులు..త్వరలోనే ప్రారంభం**

చిలకలూరిపేట పట్టణవాసులతో పాటు, చుట్టపక్కల ఉండే అనేక గ్రామాల ప్రజలకు నాణ్యమైన వైద్యాన్ని ఉచితంగా అందించడంకోసం టీడీపీ హయాంలోనే ప్రత్తిపాటి 100 పడకల ఆసుపత్రి నిర్మాణానికి బీజం వేశారు. ప్రత్తిపాటి చొరవకు ప్రభుత్వ సహకారం తోడై అనుకున్నట్లుగా సకాలంలోనే ఆసుపత్రి నిర్మాణం పూర్తై, ప్రజలకు మెరుగైన వైద్యసేవలు అందుబాటులోకి వచ్చాయి. అలాంటి ఆసుపత్రిని మరింత అభివృద్ధి చేయాలన్న సదుద్దేశంతో ఇటీవలే ప్రభుత్వంతో సంప్రదించి రూ.10కోట్ల నిధులు సాధించారు మన ప్రత్తిపాటి.

**కొత్త రోడ్లతో పట్టణంతో పాటు మారిన పల్లెల రూపురేఖలు..**

ఏడాది పాలనలో ప్రత్తిపాటి నాయకత్వంలో నియోజకవర్గవ్యాప్తంగా రోడ్ల నిర్మాణం, మరమ్మతులు జోరుగా జరిగాయి. మున్సిపాలిటీ పరిధిలో రూ.1 కోటితో వివిధ వార్డుల్లో సీసీ రోడ్లు.. డ్రైన్లు నిర్మించడం జరిగింది. మరో 7కోట్ల నిధుల్ని మున్సిపాలిటీ అభివృద్ధికోసం ప్రభుత్వం ఇప్పటికే మంజూరు చేసింది. తాగునీటి సమస్యల పరిష్కారంలో భాగంగా మరో 50లక్షలతో వివిధపనులు (తాగునీటి పైపులు, బోర్ల ఏర్పాటు..మరమ్మతులు.. చెరువుల ఆధునికీకరణ, ట్యాంకర్ల ద్వారా నీటి సరఫరా,) పూర్తిచేయడం జరిగింది. గ్రామాలు, మండల కేంద్రాల్లో ఇప్పటికీ కొన్ని రోడ్ల నిర్మాణ పనులు చురుగ్గా జరుగుతున్నాయి.

**ఉపాధి హామీపథకం కింద 91రకాల పనులు**

ఎన్.ఆర్.ఈ.జీ.ఎస్ (జాతీయ ఉపాధి హామీ పథకం)లో భాగంగా నియోజకవర్గవ్యాప్తంగా 91 రకాల పనులు చేయడం జరిగింది. నీటికుంటలు.. రోడ్ల నిర్మాణంతో పాటు కాలువల మరమ్మతులు పూర్తిచేయడం జరిగింది. రూ.152 లక్షలతో గోకులం షెడ్లు... రూ.26లక్షలతో ఇంకుడు గుంతల నిర్మాణం.. పంటకాలువలు.. చెరువుల మరమ్మతులకు రూ.2.90 కోట్ల విలువైన పనులు చేయడం జరిగింది.. రైతులకు రూ.1.40కోట్ల విలువైన యాంత్రీకరణ పరికరాల పంపిణీ..

**మధ్యాహ్నభోజన పథకం..స్కూళ్ల అభివృద్ధి..**

ఈ ఏడాదిలో మధ్యాహ్న భోజన పథకానికి రూ.2.20కోట్లు వెచ్చించడం జరిగింది. మనబడి : మనభవిష్యత్, పీఎం.శ్రీ స్కూల్, సీ.ఆర్.సీ గ్రాంట్ సహా వివిధ పథకాల పరిధిలో రూ.96లక్షలు వరకు వెచ్చించడం జరిగింది.

**అన్నా క్యాంటీన్ల పునరుద్ధరుణతో పేదల ఆకలి తీర్చిన ప్రత్తిపాటి..**

చిలకలూరిపేట పట్టణంలో ప్రత్తిపాటి మూడు క్యాంటీన్లు ఏర్పాటు చేయించారు. వాటి నిర్వహణకు ఈ ఏడాదిలో రూ.40లక్షల వరకు వెచ్చించారు. ఐ.సీ.డీ.ఎస్ పరిధిలో వివిధ సంక్షేమ పథకాలకు రూ.17లక్షలు ఖర్చుచేశారు. అర్హులైన లబ్ధిదారులకు ప్రాజెక్ట్ పరిధిలో లబ్ధి చేకూర్చడం జరిగింది.

**ఆర్ అండ్ బీ, పరిధిలో రూ.9కోట్లకు పైగా వ్యయంతో అభివృద్ధి పనులు..**

2024-25 సంవత్సరానికి గాను ఆర్ అండ్ బీ పరిధిలో రూ.5.87కోట్లతో 19పనులు చేపట్టడం జరిగింది. 2025-26 కు గాను 3.60కోట్లతో చేపట్టిన మరో 2 పనులు ప్రస్తుతం కొనసాగుతున్నాయి. ఆర్.డబ్ల్యూఎస్ పరిధిలో రూ.1.71కోట్లు వెచ్చించి, 24 పనులు పూర్తిచేయడం జరిగింది. ఎన్..ఎస్.పీ పరిధిలో రూ.కోటితో మరో 20పనులు పూర్తిచేశారు. నక్కవాగు.. ఓగేరు వాగు.. ఏడు మంగళవాగుల్లో పూడికతీత, తూటికాడ తొలగింపు పనులు చేపట్టి రైతులకు ఇబ్బంది లేకుండా చేయడం జరిగింది. అందుకోసం ఈ ఏడాది రూ.1.50 కోట్లు వెచ్చించారు.

**రూ.12 కోట్లతో పంచాయతీ రాజ్ శాఖ పరిధిలో రోడ్లు, డ్రైనేజ్‌ల నిర్మాణం..**

రూ.12కోట్లతో పంచాయతీ రాజ్ శాఖ పరిధిలో నియోజకవర్గంలోని పల్లెల్లో సీసీరోడ్లు, గ్రావెల్ రోడ్లు, మెటల్ రోడ్ల నిర్మాణం చేపట్టడం జరిగింది. ఇప్పటికీ కొన్ని పనులు జరుగుతున్నాయి. రోడ్లతో పాటు అవసరమైన చోట డ్రైనేజ్‌ల నిర్మాణం కూడా చేపట్టారు. జరుగుతున్న పనుల్ని స్వయంగా పరిశీలించిన ఎమ్మెల్యే ప్రత్తిపాటి, నాణ్యతప్రమాణాల ప్రకారం రోడ్లు, డ్రైనేజ్‌లు నిర్మించాలని, ప్రభుత్వానికి చెడ్డపేరువచ్చేలా వ్యవహరిస్తే సహించేది లేదని కాంట్రాక్టర్లను, అధికారుల్ని ఆదేశించడం జరిగింది.

**స్కాలర్ షిప్పులకు రూ.1.53కోట్లు.... రూ.42లక్షలతో టిడ్కో సముదాయాల్లో మౌలికవసతుల కల్పన**

విద్యార్థుల భవిష్యత్ కు మేలు చేసేలా పోస్ట్ మెట్రిక్ స్కాలర్ షిప్పుల చెల్లింపులకు రూ.1.53 కోట్లు చెల్లించడం జరిగింది. గత ప్రభుత్వం గాలికి వదిలేసిన టిడ్కో గృహాల్లో మౌలికవసతుల కల్పనకు కూటమిప్రభుత్వం నిధులు విడుదల చేసింది. ఆ విధంగా వచ్చిన నిధుల్లో రూ.42లక్షలతో పేదల గృహ సముదాయాల్లో వివిధ అభివృద్ధి పనులు చేయించడం జరిగింది. ఇలా ఇంకా అనేక పథకాలకు, అభివృద్ధి కార్యక్రమాలు.. సంక్షేమపథకాలకు. అర్హులైన లబ్ధిదారులకు నియోజకవర్గవ్యాప్తంగా కోట్లరూపాయల కేటాయింపులు... వ్యయాలు జరిగాయి. మునుముందు కూడా ప్రజా సమస్యల పరిష్కారం.. నియోజకవర్గ అభివృద్ధే ప్రధాన అజెండాగా ప్రత్తిపాటి ప్రతి అడుగు పడుతుంది.. పడనుంది.

## సీతానగరంలో మంత్రి నారా లోకేష్ సొంత నిధులతో కర్మకాండల సత్రం

### •స్థానిక ప్రజల అభ్యర్థన మేరకు సుమారు రూ.8 లక్షలతో నిర్మిస్తున్న మంత్రి నారా లోకేష్



తాడేపల్లి టౌన్ (చైతన్యరథం): ఐటీ, విద్య శాఖల మంత్రి నారా లోకేష్ సొంత నిధులతో సీతానగరంలోని పుష్కర ఘాట్ వద్ద కర్మకాండల సంత్రం నిర్మిస్తున్నారు. కర్మకాండల సత్రం లేక స్థానిక ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. విషయంను స్థానిక నాయకులు మంత్రి నారా లోకేష్ దృష్టికి తీసుకువెళ్లగా వెంటనే స్పందించిన ఆయన తన సొంత నిధులు రూ. 8లక్షలతో కర్మకాండల సత్రం నిర్మిస్తున్నారు. ఆ పనులు శరవేగంగా కొనసాగుతున్నాయి. సత్రంలో తగిన సదుపాయాలను కూడా ఏర్పాటు చేస్తున్నారు. సత్రం పూర్తి అయితే తాడేపల్లి ప్రజలకు ప్రయోజనకరంగా ఉంటుంది. మంగళగిరి నియోజకవర్గ ప్రజల సమస్యల పరిష్కారానికి మంత్రి నారా లోకేష్ గత ఆరేళ్లుగా ఎంతో కృషి చేస్తున్నారు. సొంత నిధులతో ఇప్పటికే ఎన్నో సేవా కార్యక్రమాలను నిర్వహిస్తున్నారు. తమకాళ్ల మీద తాము నిలబడుతూ ఉపాధి పొందుతున్న బడుగుజీవులకు తోడ్పాటు అందించాలని సొంత నిధులతో వివిధ రకాల విలువైన బండ్లను చేయించి అందిస్తున్నారు. వివిధ రకాల ఉపాధి కోసం మంగళగిరి నియోజకవర్గంలో నారా లోకేష్ అందించిన తోపుడు బండ్లు, టిఫిన్ బండ్లు, ఇస్త్రీ బండ్లు, కూరగాయల బండ్లు ఆయా కుటుంబాల జీవనోపాధికి ఎంతగానో దోహదపడుతున్నాయి. నియోజకవర్గంలో ప్రజల దాహార్తి తీర్చేందుకు జలధార వాటర్ ట్యాంకర్లు, వైద్యసేవలకు ఆరోగ్యరథాలు, ఆకలి తీర్చేందుకు అన్నాక్యాంటీన్లు, స్త్రీశక్తి పథకం ద్వారా మహిళలకు కుట్టుమిషన్లు, చిరువ్యాపారులకు తోపుడుబళ్లు, చేనేతలకు రాట్నాలు, స్వర్ణకారులకు పనిముట్లు, వికలాంగులకు ట్రైసైకిళ్లు, పాదచారులు సేదదీరేందుకు సిమెంటు బల్లలు ఇలాంటి 27సంక్షేమ కార్యక్రమాలను విజయవంతంగా అమలు చేస్తూ అన్ని సామాజికవర్గాల ప్రజలను ఆదుకుంటున్నారు.

## మహిళల జోలికొస్తే ఖబడ్దార్... కుటిల యత్నాలు చేస్తే సహించం

### • జగన్, సజ్జల, కృష్ణంరాజు కొమ్మినేని దిష్టిబొమ్మలతో పాటు సాక్షి ప్రతుల దగ్ధం

### • గుంటూరు తూర్పు ఎమ్మెల్యే నసీర్ ఆధ్వర్యంలో మహిళల నిరసన



గుంటూరు (చైతన్యరథం): వైసీపీ నేత సజ్జల రామకృష్ణారెడ్డి ఆధ్వర్యంలో దేవతలు నడియాడిన పుణ్యభూమి అమరావతి రాజధాని గురించి దెయ్యాలు మాట్లాడుతుంటే సహించబోమని గుంటూరు తూర్పు ఎమ్మెల్యే నసీర్ హెచ్చరించారు. అమరావతి రాజధాని మహిళలపై జర్నలిస్ట్ కృష్ణంరాజు, కొమ్మినేని, సాక్షి యాజమాన్యం చేసిన అనుచిత వ్యాఖ్యలను ఖండిస్తూ ఎమ్మెల్యే నసీర్ ఆధ్వర్యంలో భారీ ఎత్తున మహిళలు మంగళవారం స్థానిక హిమనీ సెంటర్‌లో నిరసన కార్యక్రమం చేపట్టారు. జగన్ సజ్జల కృష్ణంరాజు కొమ్మినేని దిష్టిబొమ్మలతో పాటు సాక్షి దినపత్రిక ప్రతులను దగ్ధం చేశారు ఈ సందర్భంగా సాక్షి మీడియా ఛానళ్లను మూసివేయాలని నినదించారు. అమరావతి రాజధానిపై అనుచిత వ్యాఖ్యల వెనుక సజ్జల స్క్రిప్ట్ ఉందని ఎమ్మెల్యే నసీర్ మండిపడ్డారు. రాష్ట్ర రాజధాని నిర్మాణం కోసం భూములను త్యాగం చేసిన గొప్ప చరిత్ర కలిగిన ప్రాంతం అమరావతి అని చెప్పారు. రాజధాని ప్రాంతంలో మహిళలపై నీచంగా మాట్లాడిన కొమ్మినేని కృష్ణంరాజు, సాక్షి యాజమాన్యం తీరును యావత్ రాష్ట్రం ఖండిస్తోందని తెలిపారు. రాష్ట్రంలో 10 నెలల కాలంలో కూటమి ప్రభుత్వం చేసిన అభివృద్ధి,, సంక్షేమాన్ని చూసి ఓర్వలేక జగన్, సజ్జల అండ్ కో చేస్తున్న కుటిలయత్నాలను చూసి అందరూ ఛీ కొడుతున్నారన్నారు. సజ్జల మాట్లాడే తీరు దారుణంగా ఉందని, ఈ విధానాల్ని ఎట్టి పరిస్థితుల్లో సహించబోమని స్పష్టం చేశారు. మహిళల ఆత్మగౌరవాన్ని దెబ్బతీస్తే ఖబడ్దార్ అని హెచ్చరించారు.

## సాక్షి మీడియాను రాష్ట్రంలో నిషేధించాలంటూ గన్నవరంలో మహిళల నిరసన ర్యాలీ

### •మహిళలు నిరసన తెలుపుతుంటే 'సంకరజాతి' అంటారా అంటూ సజ్జలపై ఫైర్

### •"వేశ్యలు" అంటూ చేసిన ఈ వ్యాఖ్యలను ఉపేక్షించే పరిస్థితే లేదు




గన్నవరం (చైతన్యరథం): రాజధాని అమరావతి ప్రాంత మహిళలను ఉద్దేశించి సాక్షి టీవీ ఛానల్‌లో కృష్ణంరాజు అనే జర్నలిస్ట్ తీవ్ర అభ్యంతరకరమైన వ్యాఖ్యలు చేయడంపై గన్నవరం నియోజకవర్గ ఎన్డీఏ కూటమి మహిళా నేతలు నిరసన ర్యాలీ చేపట్టి తీవ్ర స్థాయిలో మండిపడ్డారు. గన్నవరం నియోజకవర్గ శాసనసభ్యులు యార్లగడ్డ వెంకట్రావు నేతృత్వంలో గన్నవరంలోని వారి క్యాంప్ కార్యాలయం నుండి బస్టాండ్ మీదుగా గాంధీ బొమ్మ సెంటర్ వరకు మంగళవారం ఉదయం గన్నవరం నియోజకవర్గ ఎన్డీఏ కూటమి మహిళా నేతలు సాక్షి మీడియాను బ్యాన్ చేయాలని డిమాండ్ చేస్తూ నిరసన ర్యాలీ చేపట్టారు. రాజధాని గురించి, అక్కడి మహిళల వ్యక్తిత్వాన్ని కించపరిచేలా 'వేశ్యలు' అంటూ చేసిన దారుణమైన వ్యాఖ్యలను ఎట్టి పరిస్థితుల్లోనూ ఉపేక్షించబోమని స్పష్టం చేశారు. రాజకీయ, మీడియా ముసుగులో సాగుతున్న ఇలాంటి వికృత చేష్టలను తీవ్రంగా ఖండిస్తున్నట్లు గన్నవరం నియోజకవర్గ ఎన్డీఏ కూటమి మహిళా నేతలు తెలిపారు. "తన సొంత మీడియా చానల్ ద్వారా జరిగిన ఈ దారుణాన్ని ఒక మాజీ ముఖ్యమంత్రిగా ఉన్న వ్యక్తి ఇప్పటికీ ఖండించకపోవడం, స్త్రీ జాతికి క్షమాపణ చెప్పకపోవడం మరింత విచారకరమని అన్నారు. ఆడబిడ్డలను గౌరవించే సంస్కృతి మనదనీ, స్త్రీమూర్తులను ఆరాధించే సమాజం మనదనీ, ముఖ్యంగా మన తెలుగు ప్రజల విషయానికి వస్తే ఆడబిడ్డను, అమ్మను ఎంతో ఆదరణతో చూస్తామని, అలాంటి మన రాష్ట్రంలో రాజకీయ కక్షతో, మీడియా విశ్లేషణల పేరుతో నిస్సిగ్గుగా ఏకంగా మన తల్లులు, చెల్లెళ్లపై దారుణ వ్యాఖ్యలు చేయడం క్షమించరాని నేరమని తెలిపారు. వైసీపీ ఎప్పుడూ అనుసరించే ఈ విష సంస్కృతిపై తిరుగుబాటుగా గత ఎన్నికల్లో ప్రజలు తీర్పు ఇచ్చినా వారి వైఖరిలో మార్పు రాలేదని సుస్పష్టం అయింది అన్నారు. రాజధానిపై విషం చిమ్మే కుట్రలో గట్టు దాటి మహిళల మనోభావాలను గాయపరచిన వారిపై అత్యంత కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. గత విధ్వంస ప్రభుత్వం పై రాజధాని మహిళల పోరాటాన్ని మనసులో పెట్టుకుని ఆ ప్రాంత మహిళలపై ఉద్దేశ్యపూర్వకంగా, నీచాతినీచంగా చేసిన ఈ వ్యాఖ్యలు మొత్తం మహిళా సమాజాన్నే అవమానించే విధంగా ఉన్నాయని ఆగ్రహం వ్యక్తం చేశారు.

## మహిళలపై అనుచిత వ్యాఖ్యలు చేసిన వ్యక్తులను శిక్షించాలి

### • వినుకొండలో మహిళా సంఘాల నాయకుల డిమాండ్



వినుకొండ (చైతన్యరథం): రాజధాని అమరావతి ప్రాంత మహిళలపై అనుచిత వ్యాఖ్యలు చేసిన వివిఆర్ కృష్ణంరాజు, కొమ్మినేని శ్రీనివాస్‌రావు, ప్రసారం చేసిన సాక్షి టీవీ యాజమాన్యం వై.ఎస్ భారతిపై కఠిన చర్యలు తీసుకోవాలని మహిళ సంఘాల నాయకులు డిమాండ్ చేశారు. దీనిలో భాగంగా మహిళలపై వ్యాఖ్యలను ఖండిస్తూ మంగళవారం వినుకొండ పట్నంలో మహిళలు నిరసన ర్యాలీ చేపట్టారు. ఈ సందర్భంగా కౌన్సిలర్, మహిళా సంఘం నాయకులు షేక్. షకీలా మాట్లాడుతూ... రాష్ట్రంలో అరాచక పాలనను పారద్రోలి వైసీపీని 11 స్థానాలకు పరిమితం చేసిన బుద్ధి రాలేదన్నారు. రాష్ట్రంలోని మహిళలను కించపరిచే విధంగా భారతిరెడ్డి తన ఛానల్‌లో చేయించిన అసభ్యకర వ్యాఖ్యలను సభ్య సమాజం ఖండిస్తున్నాను. మహిళల పట్ల అసభ్యకరంగా వ్యవహరిస్తున్న సాక్షి పత్రిక ఛానల్‌ను ప్రజలు బహిష్కరించాలని, అనుమతులను తొలగించాలని డిమాండ్ చేశారు. అలాగే వైశ్య అనే పదాన్ని శాశ్వతంగా తొలగించి, మహిళను వ్యక్తిగతంగా దూషణకు పాల్పడిన వారిపై కఠిన చర్యలు తీసుకునేందుకు ప్రత్యేక చట్టం చేయాలని డిమాండ్ చేశారు. మహిళలని కించపరిచే విధంగా ప్రసారం చేసిన సాక్షి మీడియా యాజమాన్యం వైయస్ భారతి, జగన్‌రెడ్డిలు బెషరతుగా మహిళలకు బహిరంగ క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా వినుకొండ తాసిల్దార్ సురేష్ నాయక్‌కు మహిళలు వినతి పత్రం అందజేశారు. కూటమి మహిళలు పాల్గొన్నారు.

## మహిళలను దూషించిన వారిపై అంత ప్రేమఎందుకు జగన్‌రెడ్డి : ఎమ్మెల్యే గళ్ళా మాధవి




గుంటూరు (చైతన్యరథం): ఆంధ్రప్రదేశ్ మహిళలను దూషించిన కృష్ణంరాజు, కొమ్మినేని శ్రీనివాసరావు, సజ్జల రామకృష్ణారెడ్డిపై జగన్‌రెడ్డి ఆయన భార్య వై.ఎస్ భారతీలకు అంత ప్రేమ? ఎందుకుని గుంటూరు పశ్చిమ నియోజకవర్గ ఎమ్మెల్యే గళ్ళా మాధవి నిలదీశారు. మంగళవారం గుంటూరు పశ్చిమ నియోజకవర్గంలో గళ్ళా మాధవి ఆధ్వర్యంలో లక్ష్మీపురం మదర్ థెరిస్సా విగ్రహం నుండి లాడ్జి సెంటర్ అంబేద్కర్ విగ్రహం వరకు మహిళల మరియు ఎన్డీయే కూటమి నేతల భారీ నిరసన ర్యాలీ నిర్వహించారు. వై.ఎస్‌భారతీ, జగన్మోహన్‌రెడ్డి, సజ్జల రామకృష్ణరెడ్డి, కొమ్మినేని శ్రీనివాసరావు, కృష్ణంరాజులకు వ్యతిరేకంగా పెద్ద ఎత్తున నినాదాలు చేశారు. లాడ్జి సెంటర్‌లో సాక్షి పత్రికలను దహనం చేశారు. ఈ సందర్భంగా మేయర్ కోవెలమూడి రవీంద్ర, దాసరి జ్యోతి, తాళ్ళ వెంకటేశ్ యాదవ్, కనపర్తి శ్రీనివాస్ రావు, కసుకుర్తి హనుమంతురావులు మాట్లాడుతూ... గత ఐదేళ్లూ మహిళలను అనేక ఇబ్బందులకు గురిచేసిన వైసీపీ పార్టీ, ఛానల్ సాక్షి ఇప్పుడూ అదే పంథా కొనసాగిస్తోందని మహిళలు మండిపడ్డారు. ఘటనపై జగన్, ఆయన భార్య భారతీరెడ్డి కనీసం క్షమాపణ చెప్పకపోవడం దారుణమని, అమరావతి మీద మొదటి నుంచి విషం చిమ్ముతున్న సాక్షి, ఇప్పుడూ ప్రణాళిక ప్రకారం రాజధాని మహిళలపై సభ్య సమాజం తలదించుకునేలా అనుచిత వ్యాఖ్యలు చేయించిందని ఆగ్రహం వ్యక్తం చేశారు.

## సత్తెనపల్లిలో సాక్షికి వ్యతిరేకంగా మహిళల నిరసన



సత్తెనపల్లి (చైతన్యరథం): మహిళలను వేశ్యలు అని పిలవడం సిగ్గుచేటు అని మహిళలను వారి త్యాగాలకు జరిగిన ఘోర అవమానం ఇదని, సత్తెనపల్లిలో సాక్షికి వ్యతిరేకంగా మహిళలు నిరసన చేపట్టారు. రాష్ట్రంలో స్త్రీ ద్వేషాన్ని ఎట్టి పరిస్థితుల్లోనూ సహించబోమన్న సత్తెనపల్లి నియోజకవర్గ మహిళలు మంగళవారం నిరస ర్యాలీ చేపట్టారు. అమరావతి రాజధాని మహిళల గురించి మాట్లాడటాన్ని ఖండిస్తూ సాక్షి ఛానల్ మరియు సాక్షి పత్రికను తక్షణమే మూసివేయాలంటూ నిరసన ర్యాలీ చేపట్టారు. మహిళలకు క్షమాపణలు తెలియజేయాలని సజ్జల రామకృష్ణరెడ్డిని అరెస్ట్ చేయాలని డిమాండ్ చేశారు.

# బాలయ్యపై తరతరాలకు తరగని అభిమానం

నెల్లూరు, (చైతన్యరథం): పద్మభూషణ్ నందమూరి బాలకృష్ణ పుట్టినరోజు సందర్భంగా నెల్లూరులోని టీడీపీ జిల్లా కార్యాలయంలో ఘనంగా వేడుకలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సర్వేపల్లి సమన్వయకర్త సోమిరెడ్డి రాజగోపాల్ రెడ్డి పాల్గొని బాలకృష్ణకి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తన చిన్నతనంలో బాలకృష్ణ ఆదిత్య 369, భైరవద్వీపం సినిమాలు చూశానన్నారు. కాలేజీ రోజుల్లో సమరసింహారెడ్డి, నరసింహనాయుడు వంటి బ్లాక్‌బస్టర్ చిత్రాలు ఆరాధనీయంగా మిగిలాయన్నారు. ఇప్పుడు నా కుమారుడు అఖండ, డాకూ మహారాజ్ సినిమాలకు ఫ్యాన్ అయ్యాడని వివరించారు. అఖండ చూసి త్రిశూలం పట్టుకుని ఇంటికి వచ్చాడన్నారు. డాకూ మహారాజ్ చూసాక గుర్రం కావాలంటున్నాడని, బాలయ్య బాబు నటన అన్ని తరాలను





ఆకట్టుకుంటోంది," అన్నారు. బాలకృష్ణ సేవా కార్యక్రమాలను కూడా ప్రశంసిస్తూ, బసవతారకం కేన్సర్ ఆసుపత్రి ద్వారా వేలాది మందికి వైద్యసేవలందిస్తున్నారన్నారు. రాజకీయాల్లో హ్యాట్రిక్ ఎమ్మెల్యేగా విజయాన్ని అందుకుని నిజంగా ఆయన్ను చూసి అభిమానులంతా గర్వపడుతున్నారన్నారు. ఈ వేడుకలు కోటంరెడ్డి శ్రీనివాసులరెడ్డి ఆధ్వర్యంలో వైభవంగా నిర్వహించారు. బాలయ్య బాబు పట్ల నెల్లూరులో ఉన్న అభిమానాన్ని ప్రతిబింబించేలా జూనియర్ బాలయ్యగా కోటంరెడ్డి శీనన్నను అభివర్ణించడం విశేషం. శ్రీ లక్ష్మీ నరసింహ స్వామి ఆశీస్సులతో బాలయ్య బాబు నిండు నూరేళ్లు ఆయురారోగ్యాలతో వర్ధిల్లాలి, అని ఆకాంక్షించారు.

## ఘనంగా బాలయ్య జన్మదిన వేడుకలు

### ఉచిత గుండె వైద్య శిబిరం ఏర్పాటు చేసిన మంత్రి సవిత

పెనుకొండ, (చైతన్యరథం): హిందూపురం శాసనసభ్యులు బాలకృష్ణ జన్మదినం సందర్భంగా పెనుకొండ లోని క్యాంపు కార్యాలయంలో కేక్ కట్ చేసి జన్మదిన వేడుకలు జరిపి శుభాకాంక్షలు రాష్ట్ర బీసీ సంక్షేమ చేనేత జౌళి శాఖ మంత్రి సవితమ్మ తెలియచేశారు. నందమూరి బాలకృష్ణ వీరాభిమానులు గోవింద, మూర్తి ఆధ్వర్యంలో స్థానిక క్లబ్‌లో కిమ్స్ సవేర హాస్పిటల్ వారితో ఉచిత గుండె వైద్య శిబిరం నిర్వహించారు. ఉచిత గుండె వైద్య శిబిరాన్ని దాదాపుగా 200 మంది వైద్య సేవలు వినియోగించుకున్నారు. ఈ సందర్భంగా వైద్య శిబిరాన్ని మంత్రి సవిత పరిశీలించారు. ఈ కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ నాయకులు కార్యకర్తలు నందమూరి బాలకృష్ణ వీరాభిమానులు పాల్గొన్నారు.





## జీవనశైలిలో వ్యాధుల నివారణకు యోగానే పరిష్కారం

### టీడీపీ డివిజన్ ఇంచార్జ్ డాక్టర్ గణేష్ కుమార్

నెల్లూరు, (చైతన్యరథం): 47వ డివిజన్ ఇంచార్జ్ డాక్టర్ గణేష్ కుమార్, సచివాలయ సిబ్బంది ఆధ్వర్యంలో యోగాంధ్ర అవగాహన ర్యాలీ నిర్వహించారు. ముఖ్య అతిథులుగా టిడిపి రాష్ట్ర ఉపాధ్యక్షుడు ధర్మవరం సుబ్బారావు పాల్గొన్నారు. మన జీవనశైలిలో వ్యాధుల నివారణకు యోగానే పరిష్కారమని, యోగా ప్రతి ఒక్కరి జీవితంలో భాగస్వామ్యం చేసుకోవాలని 47 డివిజన్ టీడీపీ ఇన్చార్జ్ ధర్మవరం గణేష్ కుమార్ పిలుపునిచ్చారు.

మంత్రి డాక్టర్ పొంగూరు నారాయణ ఆదేశాల మేరకు ఈ కార్యక్రమాన్ని చేపట్టామన్నారు. ముఖ్యఅతిథి ధర్మవరపు సుబ్బారావు యోగాంధ్రా అవగాహన ర్యాలీని గుప్తా పార్క్ సెంటర్ వద్ద ప్రారంభించారు, అక్కడి నుంచి ములుముడి బస్టాండ్ సెంటర్ చిన్న బజార్ వరకు ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ధర్మవరం సుబ్బారావు మాట్లాడుతూ భారతదేశ పురాతనయోగా సాధన ప్రతి ఒక్కరూ అలవరుచుకుని పాటిస్తే ఆరోగ్యంగా జీవిస్తారని అన్నారు.ప్రధాని నరేంద్ర మోదీ ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ఆదేశాల మేరకు నెలరోజుల పాటు ఈ యోగాపై ప్రజలకు అవగాహన కల్పించేందుకు అనేక కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని అన్నారు. ఈ నెల 21వ తేదీ ఐదు లక్షల మందితో విశాఖపట్నంలో నిర్వహిస్తున్న 11వ అంతర్జాతీయ యోగా దినోత్సవంలో ప్రధానమంత్రి నరేంద్ర మోదీ పాల్గొంటున్నట్లు ఆయన చెప్పారు. యోగాను జీవితంలో ఒక భాగం చేసుకోవాలని ఆయన పిలుపునిచ్చారు. యోగా వల్ల శారీరకంగా, మానసికంగా ఆరోగ్యకర జీవనం గడపవచ్చునని అన్నారు. నగరంలోని ప్రతి డివిజన్ లో ప్రజలందరు యోగా కనీసం అరగంటసేపు వారి దినచర్యగా అలవాటు చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఈ కార్యక్రమంలో సచివాలయ సిబ్బంది అద్నిన్లు మెహర్నిసా , అలీ, మోసెస్, లక్ష్మి, నాగలక్ష్మి , టీడీపీ మహిళా శక్తి టీం సారిక, శ్వేత, అలేఖ్య, సుహాసిని, బూత్ ఇంచార్జ్ లు, బీఎల్ఏలు, యూత్ టీం, స్థానిక ప్రజలు తదితరులు పాల్గొన్నారు.



## దర్శి లో ఘనంగా నందమూరి బాలకృష్ణ 63వ జన్మదిన వేడుకలు

దర్శి, (చైతన్యరథం):పట్టణంలోని దర్శి టీడీపీ ఇన్చార్జి డాక్టర్ గొట్టిపాటి లక్ష్మీ నివాసం వద్ద విశ్వవిఖ్యాత నటసార్వభౌమ శ్రీ నందమూరి తారక రామారావు తనయుడు పద్మ భూషణ్ అవార్డు గ్రహీత, 3 సార్లు హిందూపురం శాసనసభ్యులు గెలిచి హ్యాట్రిక్ కొట్టిన నందమూరి బాలకృష్ణ 63వ జన్మదిన వేడుకలు ఘనంగా జరిగాయి. దర్శి నియోజకవర్గ టీడీపీ ఇంచార్జి డాక్టర్ గొట్టిపాటి లక్ష్మీ, టీడీపీ యువ నాయకులు డాక్టర్ కడియాల లలిత్ సాగర్ కేక్ కట్ చేసిబాలకృష్ణకు జన్మదిన శుభాకాంక్షలు తెలియజేసారు. ఈ కార్యక్రమంలో దర్శి మార్కెట్ యార్డ్ చైర్మన్ దారం నాగవేణి- సుబ్బారావు, దర్శి మున్సిపల్ చైర్మన్ నారపుశెట్టి పిచ్చయ్య, దర్శి మండల టిడిపి అధ్యక్షులు మరెళ్ల వెంకటేశ్వర్లు, దర్శి టౌన్ అధ్యక్షులు చిన్న, గుర్రం బాలకృష్ణ, నియోజకవర్గం లోని వివిధ హోదాల్లో ఉన్న టీడీపీ నాయకులు, బాలకృష్ణ అభిమానులు, కూటమి శ్రేణులు పాల్గొన్నారు.

## మహిళలపై మానసిక దాడి ప్రజాస్వామ్యానికి చేటు

### వింజమూరులో రోడ్డెక్కిన నారీ మణులు

వింజమూరు, (చైతన్యరథం): మహిళలపై దాడి ప్రజాస్వామ్యానికి చేటని, మహిళలపై అసభ్యకరంగా ప్రచారం చేసిన సాక్షి ఛానల్ ను వెంటనే రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ వింజమూరులో నారీమణులు నడుం బిగించి వింజమూరులో భారీ ర్యాలీ నిర్వహించారు. మంగళవారం సాయంత్రం స్థానిక బంగ్లా సెంటర్ నుండి కొత్త బస్టాండ్ సెంటర్ వరకు, సాక్షి ఛానల్‌కు, ప్రతినిధులకు, వ్యతిరేకంగా నినాదాలు చేస్తూ, ఫ్లే కార్డులు ప్రదర్శిస్తూ స్వచ్ఛందంగా భారీ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా మహిళలు మాట్లాడుతూ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, తన ప్రసంగంలో దేవతల రాజధాని అమరావతి అని మాట్లాడడం జీర్ణించుకోలేని, వైయస్ జగన్మోహన్ రెడ్డి, ప్రోద్బలం ఆయన సతీమణి భారతి రెడ్డి, సాక్షి ప్రతినిధి కొమ్మినేని శ్రీనివాసరావు, జర్నలిస్ట్ కృష్ణంరాజు పర్యవేక్షణలో డిబేట్ ఏర్పాటు చేసి, మహిళా లోకాన్ని కించపరిచే విధంగా, వేశ్యల రాజధాని అమరావతి అని సంబోధించడం వారి పైశాచికానందానికి నిదర్శనమన్నారు. దానికి కొమ్మినేని శ్రీనివాసరావు మద్దతు పలకడం, వారి సైకోతనానికి పరాకాష్ట అన్నారు. మహిళల అవమానపరిచిన వారిపై ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, కఠినంగా వ్యవహరించాలని ముఖ్యమంత్రిని కోరారు.



## టీడీపీలోకి 20 వైకాపా కుటుంబాలు

ఆదోని, చైతన్యరథం): పట్టణంలో మీనాక్షి నాయుడు నివాసంలో పెద్ద తుమ్మలం గ్రామానికి చెందిన వైసీపీ కి చెందిన 20 కుటుంబాలు వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీని వీడి ఆదోని నియోజవర్గ ఇన్చార్జి మాజీ ఎమ్మెల్యే మీనాక్షి నాయుడు అన్న గారి సమక్షంలో పార్టీలో చేరడం జరిగింది పార్టీలో చేరిన వారు చాకలి సురేష్, కుప్పయ్య, పూజ ఆంజనేయ,ఈరన్న, పింజరి నబి, తిమ్మయ్య, ముక్రయరయ్య, రాజు, హరిజన నాగరాజు, హరిజన చిన్నయ్య, చిన్న, ఉదయ, హరిజన ముగ్గరయ్య, హరిజన హుసేని, హరిజన ఆనంద్, చిన్న శీను, హరిజన బుక్కయ్య,తదితరులను తెలుగుదేశం పార్టీ కండువాలు కప్పి సాధారంగా పార్టీలోకి ఆహ్వానించారు.



మడకశిరలో ఎమ్మెల్యే ఎమ్మెస్ రాజు ఆధ్వర్యంలో నటసింహం బాలయ్య జన్మదిన వేడుకలు

# వీపీఆర్ సేవల్లో మరో ముందడుగు

### త్వరలో వీపీఆర్ నేత్ర ప్రారంభం, జిలావాసులందరికీ కంటి వైద్య పరీక్షలు, కోవూరు ఎమ్మెల్యే ప్రశాంతి - దివ్యాంగులకు సేవలో సంతోషం ఉంది, 950 మందికి ట్రై సైకిళ్ల అందజేత

కోవూరు, (చైతన్యరథం): దివ్యాంగులకు సేవ చేయడంలో తమకు ఎంతో సంతోషం ఉంటుందని కోవూరు నియోజకవర్గ ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతి రెడ్డి అన్నారు. మంగళవారం నెల్లూరులోని వీపీఆర్ నివాసంలో కోవూరు నియోజకవర్గానికి సంబంధించి 12 మంది దివ్యాంగులకు వీపీఆర్ ఫౌండేషన్ తరపున



ఎలక్ట్రిక్ ట్రై సైకిల్స్ అందజేశారు. ఈ సందర్భంగా దివ్యాంగులతో ఆమె ప్రత్యేకంగా ముచ్చటించారు. వారి యోగక్షేమాలు తెలుసుకున్నారు. అనంతరం ఎమ్మెల్యే ప్రశాంతమ్మ మీడియాతో మాట్లాడుతూ జిల్లాలో ఇప్పటివరకు 950 మంది దివ్యాంగులకు ట్రై సైకిల్స్ అందించామని, ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి ఆలోచనల నుంచి ఈ కార్యక్రమం వచ్చిందన్నారు. ఈ కార్యక్రమం భవిష్యత్తులోనూ ఇలాగే కొనసాగుతుందని వెల్లడించారు. త్వరలోనే ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్ రెడ్డి వీపీఆర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో మరో వినూత్న కార్యక్రమానికి శ్రీకారం చుడుతున్నారని చెప్పారు. వీపీఆర్ నేత్ర అనే కార్యక్రమంలో భాగంగా జిల్లాలోని ప్రతి ఒక్కరికి కంటి వైద్య పరీక్షలు నిర్వహిస్తారని వెల్లడించారు. ఇలాంటి కార్యక్రమాలు చేయడం ద్వారా తాను, అలాగే ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్ రెడ్డి ఎనలేని సంతోషాన్ని పొందుతున్నట్లు పేర్కొన్నారు. నడవలేని దివ్యాంగులకు ట్రై సైకిల్స్ ఎంతో ఉపయోగపడుతున్నాయని వివరించారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు చెముకుల కృష్ణ చైతన్య, కోడూరు కమలాకర్ రెడ్డి, బెజవాడ వంశీ రెడ్డి, ఆవుల వాసు, ఇతర ముఖ్య నాయకులు తదితరులు పాల్గొన్నారు.



# వెల్లువెత్తిన నిరసనలు... రగిలిన ఆగ్రహ జ్వాలలు




పుట్టపర్తి, (చైతన్యరథం):అమరావతి రాజధాని మహిళలను కించపరిచే విధంగా వ్యాఖ్యలు చేయడం సరికాదని పుట్టపర్తి నియోజకవర్గ ఎమ్మెల్యే పల్లె సింధూర రెడ్డి వైసీపీ నేతలకు హితవు పలికారు. ప్రతి ఇంట్లో మహిళను ఏ విధంగా గౌరవిస్తామో ఆదే విధంగా రాష్ట్రంలో ఉన్న ప్రతి మహిళను తమ ఇంటి ఆడ బిడ్డలా చూసుకోవాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందన్నారు. అమరావతి మహిళలను కించపరిచే విధంగా వేశ్యల రాజధాని అని సాక్షి పత్రిక, టీవీ చానల్ ప్రసారాల్లో కోట్లాది ప్రజలను అవమాన పరిచేలా వ్యాఖ్యలు చేసిన సాక్షి ప్రతినిధులు, వాటిని ప్రోత్సహించిన సాక్షి యాజమాన్యంపై చర్యలు తీసుకోవాలని కోరుతూ పుట్టపర్తి మున్సిపాలిటీలో వందలాది మంది మహిళలు, టీడీపీ అనుబంధ సంఘాల మహిళా కార్యకర్తలు ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే పల్లె సింధూర రెడ్డి ర్యాలీ చేస్తున్న మహిళలకు మద్దతు తెలిపారు. ఎమ్మెల్యే పల్లె సింధూర రెడ్డి మాట్లాడుతూ, హిందూ మహిళలను



కించపరిచే విధంగా వేశ్యల రాజధాని అని సాక్షి లో వ్యాఖ్యలు చేయడం హేయమైన చర్యగా అభివర్ణించారు. జగన్ సతీమణి భారతి గారు కూడా ఒక మహిళా అదే ప్రాంతంలో నివాసం ఉన్నారనే విషయాన్ని గుర్తు పెట్టుకోవాలని వైసీపీ నేతలకు సూచించారు. మహిళలను ప్రతి ఒకరు గౌరవించుకోవాల్సిన బాధ్యత మనందరిపై ఉందన్నారు. ఏ పార్టీలో మహిళలు ఉన్నా వారిని గౌరవం ఇవ్వాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. మన ఇంట్లో కూడా మహిళలు, అడ బిడ్డలు ఉన్నారు అనే విషయాన్ని ప్రతి మనిషి గుర్తు పెట్టుకోవాలి. నోరు ఉందని మహిళలను కించపరిచే విధంగా మాట్లాడటం మంచిది కాదని హితవు పలికారు. మహిళలపై కించపరిచే విధంగా వ్యాఖ్యలు సాక్షి ప్రతినిధులు, యాజమాన్యాలపై చర్యలు తీసుకోవాలని ప్రభుత్వాన్ని కోరారు. మహిళల ను కించపరిచే విధంగా వ్యాఖ్యలు చేసిన వారిపైన, సాక్షి





యాజమాన్యంపై చర్యలు తీసుకోవాలని కోరుతూ పలువురు మహిళలు స్థానిక పోలీస్ స్టేషన్ లో ఫిర్యాదు చేశారు. ఈ కార్యక్రమంలో మహిళా కార్యకర్తలు పద్మ, అయిషా, భాగ్య, ఆశ, మాబు, ప్రతిభ, సాయి లీల, జ్యోతి, స్నేహలత, లక్ష్మీ కుమారి, రాధమ్మ, బుక్కపట్నం మాజీ సర్పంచ్ యశోదమ్మ, జిల్లా మండలం మహిళా నాయకురాలు కార్యకర్తలు పాల్గొన్నారు,

### అనంతపురంలో...

అనంతపురం, (చైతన్యరథం): అమరావతి ప్రాంత మహిళలపై అనుచిత వ్యాఖ్యల నేపథ్యంలో సాక్షికి వ్యతిరేకంగా నిరసనాగ్రహాలు కొనసాగుతున్నాయి. అనంతపురంలో ప్రజా సంఘాలు, తెలుగుదేశం పార్టీ ఆధ్వర్యంలో జరిగిన నిరసన కార్యక్రమం పెద్ద ఎత్తున సాగింది. నగరంలోని టవర్ క్లాక్ వద్ద నుంచి అంబేద్కర్ విగ్రహం వరకు ఈ ప్రదర్శన నిర్వహించారు. సప్తగిరి సర్కిల్ వద్ద బైఠాయించి సాక్షి పత్రికలను దహనం చేశారు. అమరావతి వేశ్యల రాజధాని అంటూ సాక్షి డిబేట్లో విశ్లేషకుడు కృష్ణంరాజు చేసిన వ్యాఖ్యల మీద తీవ్ర స్థాయిలో ఆగ్రహం వ్యక్తం చేశారు. సభ్యతా సంస్కారం లేని ఒక వ్యక్తి ఇలాంటి వ్యాఖ్యలు చేస్తుంటే సీనియర్ జర్నలిస్టుగా ఉన్న కొమ్మినేని శ్రీనివాసరావు ఎందుకు ఖండించలేదని వారు నిలదీశారు. కొమ్మినేని శ్రీనివాసరావుని అరెస్టు చేసిన విధంగానే కృష్ణంరాజును కూడా వెంటనే అరెస్టు చేసి కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. మరోవైపు ఈ వ్యాఖ్యల మీద సాక్షి పత్రిక నడుపుతున్న భారతీ రెడ్డి తో పాటు జగన్ రెడ్డిలు కూడా దీనికి క్షమాపణ చెప్పాలన్నారు. అమరావతి ప్రాంతం మీద మొదటి నుంచి ఏదో ఒక రకంగా కుట్రలు పన్నుతున్నారని ఇప్పుడు ఏకంగా మహిళలను కించపరిచే విధంగా ఇలాంటి వ్యాఖ్యలు చేయడం వారి పైశాచికానందానికి నిదర్శనం అన్నారు. దేవతల రాజధానిగా గుర్తింపు పొందిన అమరావతిని ఈ స్థాయిలో కించపరుస్తున్నారంటే వీరికి సభ్యత సంస్కారం ఉందా అని నిలదీశారు. వెంటనే సాక్షి పత్రికను, టీవీని రెండు రాష్ట్రాల్లో బ్యాన్ చేయాలని మహిళా నేతలు డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు, తెలుగు మహిళలు, విద్యార్థి సంఘాలు, పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

### కడపలో మహిళల భారీ నిరసన ర్యాలీ

**కడప:** జిల్లాలో మహిళలు సాక్షి మీడియాలో వెలువడిన అనుచిత వ్యాఖ్యలను ఖండిస్తూ భారీ ర్యాలీ నిర్వహించారు. కడప నగరంలోని సంధ్య సర్కిల్ నుండి కలెక్టరేట్ వరకు కొనసాగిన ఈ ర్యాలీలో వందలాది మంది మహిళలు పాల్గొన్నారు. ర్యాలీలో పాల్గొన్న మహిళలు అమరావతి మహిళలపై చేసిన అనుచిత వ్యాఖ్యలకు బాధ్యత వహించాల్సిన వారిని వెంటనే అరెస్టు చేయాలని, వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మహిళల ఆత్మగౌరవాన్ని కించపరిచే ప్రయత్నాలు అంగీకారయోగ్యం కాదని స్పష్టం చేశారు. ఈ ఘటనపై వివిధ మహిళా సంఘాలు, సామాజిక వర్గాలు కూడా తీవ్రంగా స్పందిస్తున్నాయి.










### రాప్తాడులో..

అమరావతి వేశ్యల రాజధాని అంటూ నీచమైన వ్యాఖ్యలు చేయడమే కాకుండా.. ఇంకా దానిని సమర్ధించుకుంటున్నారంటూ సజ్జల రామకృష్ణారెడ్డి పై రాప్తాడు నియోజకవర్గ మహిళలు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. అమరావతి రాజధాని మహిళల శీల హననం గురించి సాక్షి మీడియాలో చర్చ జరపడమే కాకుండా ఆ చర్చను సమర్థించుకుంటున్న తీరుకు నిరసనగా అనంతపురం రూరల్ పరిధిలో తెలుగుదేశం మహిళలు నిరసన కార్యక్రమం చేపట్టారు. సాక్షి ఛానల్ ను, సాక్షి పత్రికను తక్షణమే మూసివేయాలంటూ కళ్యాణదుర్గం రోడ్డులోని నరిగమ్మ దేవస్థానం నుంచి మహిళలు నిరసన ర్యాలీ నిర్వహించారు. ఈ ర్యాలీలో తెలుగు మహిళలు, టి.ఎన్.ఎస్.ఎఫ్, తెలుగు యువత, ముఖ్య నాయకులు పాల్గొన్నారు. రాజా హోటల్ వరకు ఈ నిరసన ప్రదర్శన సాగింది. రోడ్డుపై సాక్షి ప్రతులను దహనం చేసి నిరసన వ్యక్తం చేశారు. ఈసందర్భంగా రాప్తాడు తెలుగు మహిళలు మాట్లాడుతూ అమరావతి రాజధాని పట్ల, రాజధాని ప్రాంతంలో ఉన్న మహిళల



పట్ల దుర్భాషలాడటమే కాకుండా ఇంకా దాని గురించి సమర్ధించుకుంటున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఒక ఛానల్ లో ఇంతనీచంగా మాట్లాడుతుంటే.. దాని యజమానులైన భారతీ రెడ్డి, జగన్ రెడ్డిలు ఇప్పటి వరకు ఖండించకపోవడం ఏంటని ప్రశ్నించారు. ఇప్పటికే కొమ్మినేనిని అరెస్ట్ చేశారని.. విశ్లేషకుడంటూ చెప్పుకునే కృష్ణంరాజును వెంటనే అరెస్ట్ చేసి శిక్షించాలన్నారు. వారు చేసిన వ్యాఖ్యలు యావత్ మహిళా లోకాన్ని అవమానపరచడమేనన్నారు. ఇలా మాట్లాడటమే కాకుండా సజ్జల రామకృష్ణారెడ్డి రాక్షసులంటూ మాట్లాడటం ఏంటని ప్రశ్నించారు. అమరావతి ప్రాంతంపై జగన్ రెడ్డి మొదటి నుంచి విషం చిమ్ముతున్నారు.. అందులో భాగంగానే ఇలాంటి వ్యాఖ్యలు చేయించారన్నారు. దీనిపై భారతీ, జగన్ రెడ్డి వెంటనే బహిరంగ క్షమాపణలు చెప్పాలన్నారు. అలాగే సాక్షి మీడియాను పూర్తిగా బ్యాన్ చేయాలని మహిళా నేతలు డిమాండ్ చేశారు.









# చెరువుల మరమ్మతులు, పునర్నిర్మాణ పనుల వేగం పెంచండి

**జలవనరుల శాఖ అధికారులకు ఎమ్మెల్యే పరిటాల సునీత ఆదేశజం**
**క్యాంప్ కార్యాలయంలో అధికారులతో ఎమ్మెల్యే సునీత సమావేశం**
**పేరూరు ప్రాజెక్టు, జైకా నిధుల గురించి ప్రత్యేకంగా చర్చ**

రాప్తాడు, (చైతన్యరథం): నియోజకవర్గ పరిధిలోని చెరువుల మరమ్మతులు, పునర్నిర్మాణ పనులను వేగవంతం చేయాలని జలవనరుల శాఖ అధికారులను ఎమ్మెల్యే పరిటాల సునీత ఆదేశించారు. అనంతపురంలోని తన క్యాంప్ కార్యాలయంలో రాప్తాడు నియోజకవర్గంలోని అనంతపురం, ధర్మవరం డివిజన్లకు సంబంధించిన జలవనరుల శాఖ అధికారులతో సమావేశం నిర్వహించారు. ప్రపంచబ్యాంక్ నిధులతో చేపట్టాల్సిన అభివృద్ధి పనులు, చెరువుల మరమ్మతులు, పునర్నిర్మాణం, పునరుద్ధణ కోసం అంచనాలు తయారు చేయడం వంటి వాటి గురించి చర్చించారు. ఈ సందర్భంగా చెరువుల పరిస్థితి గురించి అధికారులు ఎమ్మెల్యే సునీతకు వివరించారు. పేరూరు ప్రాజెక్ట్ అభివృద్ధిలో భాగంగా గత తెలుగుదేశం పార్టీ ప్రభుత్వం హయాంలో మంజూరైన 22కోట్ల జైకా నిధులు వినియోగం, వివరాలు, బ్యాలెన్స్ 6కోట్ల నిధులు వినియోగం గురించి కూడా చర్చించారు. పేరూరు ప్రాజెక్ట్ గేట్ల మరమ్మతు కోసం మంజూరైన 1.21 కోట్ల నిధులు ఎంతవరకు వినియోగించారని ఆరా తీశారు. భారీ వర్షాలకు తెగిన కనగానపల్లి చెరువు నిర్మాణం, జీడిపల్లి రిజర్వాయర్ నుంచి పేరూరు డ్యాంకు సాగునీరు అందించే పరిటాల రవీంద్ర సాగునీటి కాలువ దుబ్బార్లపల్లి దగ్గర నుంచి నసనకోట చెరువుకు నీళ్లు ఇవ్వడానికి కాలువ



త్రవ్వకం కోసం సర్వే నివేదిక వంటి వాటిపై కూడా ఆరా తీశారు. రామగిరి, కనగానపల్లి, రాప్తాడు మండలాలలో ప్రవహించే పండమేరు వాగుపై నెమలివరం దగ్గర, అవసరం ఉన్నచోట చెక్ డ్యాం లు నిర్మాణం గురించి ప్రతిపాదనలు సిద్ధం చేయాలని ఎమ్మెల్యే ఆదేశించారు. నడిమి వంక పరిధిలో రక్షణ గోడ నిర్మాణం గురించి చర్చించారు. రాప్తాడు నియోజకవర్గంలోని 32 చిన్న నీటిపారుదల చెరువుల మరమ్మతులు, పునర్నిర్మానం, పునరుద్దరణ కోసం ఆర్.ఆర్.ఆర్. స్కీమ్ కింద 19 కోట్లతో ఎస్టిమెట్స్ పంపామని అధికారులు వివరించారు. 7.50 కోట్ల ఏపీఐఐఏటీపీ నిధులనుంచి మంజూరైన గొందిరెడ్డిపల్లి , బొమ్మేపర్తి, కందుకూరు, మదిగుబ్బ, బి యాలేరు చెరువుల మరమ్మతులు గురించి చర్చించారు. వర్షాకాలం నేపథ్యంలో చెరువుల పటిష్టత గురించి ఎప్పటికప్పుడు పర్యవేక్షణ ఉండాలన్నారు. అవసరమైన వాటికి అంచనాలు సిద్ధం చేస్తే సంబంధిత మంత్రి దృష్టికి తీసుకెళ్లి పనులు చేపట్టేలా చేస్తామని ఎమ్మెల్యే సునీత అన్నారు.

# దేశ అంతరిక్ష చరిత్రలో కొత్త అధ్యాయం

## - శుభాంశుకు ఎయిర్ చీఫ్ మార్షల్ అమర్‌ప్రీత్ సింగ్ శుభాకాంక్షలు



న్యూఢిల్లీ: భారత వింగ్ కమాండర్ రాకేష్ శర్మ 1984లో అంతరిక్షంలోకి వెళ్లిన దాదాపు నాలుగు దశాబ్దాల తర్వాత, యాక్సియం-4 మిషన్‌లో భాగంగా భారత వ్యోమగామి శుభాంశు శుక్లా రోదసీ యాత్ర చేపట్టడానికి సిద్ధమవుతున్నారు. బుధవారం సాయంత్రం 5:30 గంటల (భారత కాలమానం ప్రకారం)కు ఈ ప్రయోగాన్ని చేపట్టనున్నారు. ఈ నేపథ్యంలో శుభాంశుతో మంగళవారం ఎయిర్ చీఫ్ మార్షల్ అమర్‌ప్రీత్ సింగ్ వీడియో కాల్లో మాట్లాడారు. అంతరిక్ష యాత్ర సురక్షితంగా, విజయవంతంగా పూర్తికావాలని కోరుకుంటున్నట్లు తెలిపారు. భారత అంతరిక్ష చరిత్రలో శుభాంశు కొత్త అధ్యాయం లిఖించాలని ఆకాంక్షించారు. ఎయిర్ చీఫ్ మార్షల్.. శుభాంశుతో వీడియో కాల్లో మాట్లాడుతున్న దృశ్యాన్ని ఇండియన్ ఎయిర్ ఫోర్స్ సోషల్ మీడియాలో షేర్ చేసింది. రోదసీ యాత్రకు సిద్ధమవుతున్న గ్రూప్ కెప్టెన్ శుభాంశు శుక్లాకు, అతడి బృందానికి ఇండియన్ ఎయిర్ ఫోర్స్ శుభాకాంక్షలు తెలిపింది.

యాక్సియం-4 మిషన్ కింద మరో ముగ్గురు ఆస్ట్రోనాట్లతో కలిసి శుక్లా మంగళవారం నింగిలోకి పయనం కావాల్సిఉంది. స్పేస్‌ఎక్స్ సంస్థకు చెందిన డ్రాగన్ వ్యోమనౌకలో వీరు రోదసిలోకి వెళుతున్న సంగతి తెలిసిందే. అయితే అంతరిక్ష ప్రయోగ కేంద్రం ఉన్న ఫ్లోరిడా ప్రాంతంలో వాతావరణం ప్రతికూలంగా ఉండటంతో దీనిని బుధవారానికి వాయిదా వేశారు. అప్పుడూ కుదరకపోతే ప్రత్యామ్నాయ అవకాశం గురువారం సాయంత్రం 5:07 గంటలకు వీరి ప్రయాణం ఉంటుందని స్పేస్‌ఎక్స్ సంస్థ పేర్కొంది. భూమి నుంచి బయల్దేరిన 28 గంటల తర్వాత ఈ వ్యోమనౌక.. అంతర్జాతీయ అంతరిక్ష కేంద్రం (ఐఎస్ఎస్) తో అనుసంధానమవుతుంది. శుభాంశు బృందం.. అక్కడే 14 రోజుల పాటు బస చేస్తుంది. భారరహిత స్థితిలో అనేక ప్రయోగాలు నిర్వహిస్తుంది. అక్కడి నుంచి ప్రధానమంత్రి నరేంద్ర మోదీ, పాఠశాల విద్యార్థులు, ఇతరులతో ముచ్చటించనుంది.

# అద్భుతం..అనిర్వచనీయం

## - శ్రీనగర్- కట్రా రైలు ప్రయాణంపై ఫరూక్ అబ్దుల్లా సంతోషం



శ్రీనగర్: దేశ రైల్వే నెట్‌వర్క్‌తో కశ్మీర్ ప్రాంతం అనుసంధానం కావటం ఎంతో సంతోషంగా ఉందని నేషనల్ కాన్ఫరెన్స్ అధ్యక్షుడు, జమ్ముకశ్మీర్ మాజీ ముఖ్యమంత్రి ఫరూక్ అబ్దుల్లా ఆనందం వ్యక్తం చేశారు. దశాబ్దాల కల నేరవేరటంతో కశ్మీర్ ప్రజలు కూడా ఆనందంగా ఉన్నారన్నారు. జమ్మూకశ్మీర్లోని శ్రీనగర్- కట్రా మార్గంలో ఇటీవల ప్రారంభమైన వందేభారత్ రైల్లో ఫరూక్ అబ్దుల్లా మంగళవారం ప్రయాణించారు. ఎట్టకేలకు దేశ రైల్వే నెట్‌వర్క్‌తో కశ్మీర్ మొత్తం అనుసంధానం కావడాన్ని చూసి తన కళ్లు చెమ్మగిల్లాయన్నారు. జులైలో ప్రారంభం కానున్న అమర్నాథ్ యాత్రకు వచ్చే భక్తులు ఈ రైలు సదుపాయాన్ని వినియోగించుకునే అవకాశం ఉందని, దాంతో వైష్ణోదేవీ ఆలయానికి పెద్ద ఎత్తున భక్తులు తరలివస్తారని ఆశాభావం వ్యక్తం చేశారు. దేశ రైల్వే నెట్‌వర్క్‌తో ఎట్టకేలకు కశ్మీర్ అనుసంధానం కావడం చూసి నా హృదయం ఉప్పొంగి పోయింది. నా కళ్లు చెమ్మగిల్లాయి. దీన్ని సాకారం చేసిన ఇంజినీర్లు, కార్మికులను అభినందిస్తున్నానని ఫరూక్ అబ్దుల్లా పేర్కొ న్నారు. జమ్మూ నుంచి కట్రా వరకు రైలు ప్రయాణం మంచి అను భూతి కలిగించిందని, చీనాబ్, అంజీ వంతెనలతోపాటు సొరంగాల గుండా ప్రయాణం నిజంగా అద్భుతంగా ఉందన్నారు. ఇది చిరకాలం నిలిచిపోయే అనుభవమన్నారు. ఇది ప్రజలు సాధించిన విజయమని, ఈ రైలు సర్వీసులతో ప్రయాణం మరింత సులభతరం కానుందని ఎన్‌సీ చీఫ్ పేర్కొన్నారు. స్థానికంగా వాణిజ్యం, పర్యా టకం పెరగడంతోపాటు ఇరు ప్రాంతాల మధ్య స్నేహబంధం మరింత బలోపేతం అవుతుందన్నారు. ఇదిలాఉంటే, జమ్మూకశ్మీ ర్లోని కట్రా, శ్రీనగర్ పట్టణాల మధ్య వందేభారత్ రైలు సేవలను ప్రధాని మోదీ జూన్ 6న ప్రారంభించారు. జమ్మూ ప్రాంతాన్ని కశ్మీర్‌తో కలిపే తొలిరైలు కూడా ఇదే కావడం విశేషం. ఉదంపూర్- శ్రీనగర్-బారాముల్లా రైల్ లింకు ప్రాజెక్టులో భాగంగా దీన్ని పూర్తిచేశారు.

# ప్రమాదానికి గురైన నౌకలో నలుగురు సిబ్బంది గల్లంతు



తిరువనంతపురం: కేరళ తీరానికి సమీపంలో ప్రమాదానికి గురైన కార్గో నౌకలో నలుగురు సిబ్బంది గల్లంతయ్యారు. సోమవారం సింగపూర్‌కు చెందిన ఎంవీ వాన్ హాయ్ -503 నౌకలో అకస్మాత్తుగా మంటలు చెలరేగాయి. మంటలను అదుపులోకి తీసుకువచ్చేందుకు సిబ్బంది తీవ్రంగా కృషి చేస్తున్నారు. ఈ ప్రమాదంలో నౌకలో ఉన్న 20 కంటైనర్లు సముద్రంలో పడిపోయినట్లు సమాచారం. అలాగే నౌకలో 22 మంది వరకు సిబ్బంది ఉండగా వారిలో నలుగురు గల్లంతయ్యారు. సోమవారం ఉదయం 9:20 గంటలకు ఈ అగ్ని ప్రమాదం జరిగింది. కేరళలోని కన్నూర్ జిల్లాలోని అఝిక్కల్ పట్టణ తీరం నుంచి 44 నాటికల్ మైళ్ల దూరంలో ఈ దుర్ఘటన జరిగింది. ఊహించని ఘటనతో నౌకలో ఉన్న సిబ్బంది తీవ్ర ఆందోళనకు గురయ్యారు. సమాచారం అందిన వెంటనే భారత నౌకాదళం స్పందించి హుటాహుటిన రక్షణ చర్యలు చేపట్టింది. నౌక అంతర్గత భాగంలోనే పేలుడు జరిగినట్లు ప్రాథమికంగా నిర్ధారణ అయింది. 270 మీటర్ల పొడవు, 12.5 మీటర్ల పొడవున్న ఈ నౌక ఈనెల 7న కొలంబో తీరం నుంచి బయల్దేరింది. ఇది మంగళవారం నాటికి ముంబయికి చేరుకోవాల్సి ఉండగా ఇంతలోనే ప్రమాదానికి గురైంది.

ప్రమాదం జరిగిన సమయంలో నౌకలో 22 మంది సిబ్బంది ఉన్నారు. అందులో 18 మంది సముద్రంలోకి దూకారు. వారిని భారత్ నేవీ, ఐఎన్ఎస్ సూరత్ కోస్టు గార్డ్స్ వాళ్లను రక్షించి మంగళూరు పోర్టుకు తీసుకువచ్చారు. నలుగురు సిబ్బంది గల్లంతయ్యారు. వారిలో ఇద్దరు తైవాన్, ఒకరు ఇండోనేషియా, ఒకరు మయన్మార్ వాసులుగా తెలుస్తోంది. కాగా ఈ ఘటనలో 5గురు గాయపడ్డారు. అందులో ఇద్దరి పరిస్థితి సీరియస్‌గా ఉన్నట్లు సమాచారం. వారిని ఆస్పత్రికి తరలించారు. గల్లంతైనవారికి కోసం గాలింపు చర్యలు చేపట్టారు. నౌక సముద్రంలో ఇంకా తేలియాడుతునే ఉంది. ప్రమాదానికి గల కారణాలు తెలియరాలేదు. కాగా గత 30 రోజుల్లో కేరళ సమీపంలో సరకు రవాణానౌక ప్రమాదానికి గురికావడం ఇది రెండోసారి. మే 24న లైబీరియా జెండాతో వెళున్న కార్గో నౌక తీరానికి 14.6 మైళ్లదూరంలో మునిగిపోయింది.

# ఉగ్రవాదాన్ని ప్రపంచ సమస్యగానే చూడాలి

## - విదేశాంగమంత్రి జై శంకర్

లక్సెంబర్గ్: ఉగ్రవాదం అనే దానిని ప్రపంచ సమస్యగానే చూడాలిగానీ.. అది ఆయా దేశాల మధ్య ద్వైపాక్షిక అంశం కాదని విదేశాంగ మంత్రి ఎస్ జైశంకర్ స్పష్టం చేశారు. చరిత్రను పరిశీలిస్తే.. ప్రపంచ వ్యాప్తంగా జరిగిన ఉగ్ర ఘటనలకు పాకిస్థాన్‌తో సంబంధాలు వెల్లడయ్యాయన్నారు. వారం రోజులపాటు ఐరోపా దేశాల పర్యటనలో భాగంగా ఆయన బెల్జియం, లక్సంబర్గ్‌లో మంగళవారం భారత సంతతి ప్రజలను ఉద్దేశించి మాట్లాడుతూ ఈ వ్యాఖ్యలు చేశారు. ఆ సమయంలో బెల్జియం విదేశాంగ మంత్రి మాక్సిమ్ ప్రెవోట్ కూడా ఆయనతో ఉన్నారు. దేశ పురోగతి, సుసంపన్నతను కాపాడేందుకు భారత్ చేస్తున్న ప్రయత్నాలను జైశంకర్ వారికి వివరించారు.



పహల్గాం ఉగ్రదాడి తర్వాత భారత ప్రభుత్వం చేపట్టిన ఆపరేషన్ సిందూర్‌పై ఆయన మాట్లాడుతూ .. ఉగ్రవాదం ఫలానా దేశానిది మాత్రమే అని అనుకోవద్దని సూచించారు. మీడియా కూడా పక్షపాత ధోరణికి ఎప్పుడూ అతీతంగా ఉండటం లేదు. సాధారణంగా భారత్-పాకిస్థాన్ సమస్యను ద్వైపాక్షికంగా లేదా కశ్మీర్ అంశంగానే మీడియా చూపుతోంది. వాస్తవానికి ఉగ్రవాద సమస్య ఇతర దేశాలకు వేరే విధంగా ఉంటుంది. ఈ కార్యకలాపాలను కొన్ని సంస్థలు నిర్వహిస్తాయి. కానీ కొన్ని దేశాలు ఉగ్రవాదాన్నే జాతీయ విధానంగా పెట్టుకుని పనిచేస్తున్నాయి. ఐరోపాలోని ప్రజలు దీనినే అర్థం చేసుకోవాలి. యూరప్‌లో కూడా ఉగ్రవాద ఘటనలు చోటు చేసుకొంటున్నాయి. కానీ, దానిని రెండు దేశాల మధ్య అంశంగా చూడరు. వారి పొరుగులోని ఏ దేశం ఉగ్రవాదాన్ని అధికారిక విధానంగా పెట్టుకోలేరు. ఉద్రవాదమనేది ఏ రెండు దేశాలకు సంబంధించిన అంశమని అనుకోను. ఉగ్రవాదం కేవలం భారత్‌కు సంబంధించిన సమస్యే కాదు. గత 20-30 ఏళ్లుగా చూడండి.. చాలా ఉగ్రదాడుల దర్యాప్తులన్నీ పాకిస్థాన్‌వైపే వేలెత్తి చూపుతున్నాయని జై శంకర్ వ్యాఖ్యానించారు.

గడువు ముగిసేలోపే అమెరికాతో ఒప్పందం..

అంతకుముందు జైశంకర్ ఫ్రాన్స్‌లో పర్యటించారు. అమెరికా టారిఫ్‌లపై విధించిన సస్పెన్షన్ గడువు ముగిసేలోపు తాము ఆ దేశంతో ద్వైపాక్షిక ఒప్పందం కుదుర్చుకొంటామని ఫ్రాన్స్‌కు చెందిన ఓ సంస్థకు వెల్లడించారు. ఏప్రిల్ 2వ తేదీన భారత్‌పై అమెరికా 26శాతం టారిఫ్‌లు విధించింది. ఆ తర్వాత దానిని జులై 9 వరకు సస్పెండ్ చేసింది.. వాస్తవానికి ఏప్రిల్ 2 నాటికే ద్వైపాక్షిక చర్చలు తాము మొదలు పెట్టినట్లు జై శంకర్ వెల్లడించారు.

# ఢిల్లీలో అగ్ని ప్రమాదం: ముగ్గురు మృతి

## - మంటల భయంతో అపార్ట్‌మెంట్ నుంచి దూకి ప్రాణాలు కోల్పోయిన తండ్రీపిల్లలు



న్యూఢిల్లీ: ఢిల్లీలోని ద్వారకా సెక్టార్‌లో మంగళవారం ఉదయం భారీ అగ్ని ప్రమాదం జరిగింది. ఒక అపార్ట్‌మెంట్ ఏడెనిమిది అంతస్తుల్లో మంటలు చెలరేగడంతో ఒకే కుటుంబానికి చెందిన ముగ్గురు ప్రాణాలు కోల్పోయారు. వారు ప్రాణభయంతో కిందికి దూకడంతో చనిపోయారు.

ఫ్లెక్సీ బోర్డ్ వ్యాపారం చేస్తోన్న యష్ యాదవ్ కుటుంబం శపథ్ సొసైటీలో నివసిస్తోంది. యష్‌కు పదేళ్ల లోపు వయసున్న ముగ్గురు పిల్లలు ఉన్నారు. అయితే వారు ఉంటున్న అంతస్తులో మంటలు చెలరేగడంతో భయభ్రాంతులకు గురయ్యారు. ప్రాణాలు కాపాడుకునేందుకు ఇద్దరు పిల్లలు. తండ్రి కిందికి దూకారు. వెంటనే వారిని ఆసుపత్రికి తరలించినా ప్రయోజనం లేకపోయింది. వారు ముగ్గురూ మృతి చెందినట్లు వైద్యులు ధ్రువీకరించారు. మంటల్లో చిక్కుకున్న యష్ భార్య, పెద్ద కుమారుడు గాయాలతో ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. ప్రస్తుతం శపథ్ సొసైటీలోని నివాసితులను అధికారులు అక్కడినుంచి తరలించారు. కాగా.. అపార్ట్‌మెంట్‌లో పెద్దఎత్తున మంటలు ఎగిసిపడిన దృశ్యాలు సోషల్ మీడియాలో వైరల్ అయ్యాయి. తొలుత పలువురు చిక్కుకున్నట్లు వార్తలు వచ్చాయి. వారిని రక్షించేందుకు అగ్నిమాపక విభాగం స్కైలిఫ్టులను మోహరించింది.

# నకిలీ పోలీస్ స్టేషన్‌తో దందాలు

పూర్ణియా: నకిలీ పోలీసు స్టేషన్‌ను ఏర్పాటు చేసి జనానికి ఏ మాత్రం అనుమానం రాకుండా ఏడాది పాటు మామూళ్లు వసూలు చేసుకున్నాడో ఘనుడు. ఈ ఘటన బీహార్‌లో జరిగింది. ఓ వ్యక్తి నకిలీ పోలీసు స్టేషన్‌ను ఏర్పాటుచేసి ఏడాదిపాటు యథేచ్ఛగా దందాలు చేసి, చివరికి విషయం బయటపడటంతో పరారయ్యాడు. పూర్ణియా జిల్లాలోని మోహని గ్రామంలో రాహుల్ కుమార్ షా అనే వ్యక్తి నకిలీ పోలీసు స్టేషన్ తెరిచాడు. ఉద్యోగాలు ఇస్తానంటూ ఆ గ్రామంలోని యువత నుంచి లక్షల రూపాయలు వసూలు చేశాడు.

గ్రామీణ రక్షాదళ్ రిక్రూట్‌మెంట్ పేరుతో కానిస్టేబుల్, చౌకీదార్ల అక్రమ నియామకాలు చేపట్టాడు. స్థానిక యువత నుంచి డబ్బులు వసూలు చేసి వారిని ఉద్యోగాల్లోకి తీసుకుంటున్నట్లు చెప్పాడు. వారికి పోలీసు యూనిఫాంలు, లాఠీలు, నకిలీ గుర్తింపు కార్డులు ఇచ్చాడు. వారితో గస్తీ విధులు, మద్యం అక్రమ రవాణాపై దాడుల వంటివి చేయించాడు. వచ్చిన డబ్బులో సగం తాను తీసుకొని.. మిగతా సగాన్ని తన కింది ఉద్యోగులకు పంచేవాడు. అక్రమ రవాణాదారుల నుంచి స్వాధీనం చేసుకున్న మద్యాన్ని.. లంచాలు తీసుకుని వాటిని మరలా వారికే ఇచ్చేసేవాడు. దాదాపు ఏడాదిపాటు ఇలా నకిలీ పోలీసుల ఆగడాలు సాగాయి. ఎట్టకేలకు గుట్టు బయటపడటంతో రాహుల్ పరారయ్యాడు. అతడి కోసం ముమ్మరంగా గాలిస్తున్నామని పోలీసులు తెలిపారు.

# ఆస్ట్రియాలో ఘోరం!

## - విద్యార్థి కాల్పులు: 11మంది దుర్మరణం




ఆస్ట్రియాలోని ఓ పాఠశాలలో కాల్పులు కలకలం సృష్టించాయి. పాఠశాలలోకి చొరబడిన ఓ విద్యార్థి జరిపిన కాల్పుల్లో దాదాపు 11మంది ప్రాణాలు కోల్పోయినట్టు తెలుస్తోంది. ఆస్ట్రియా అంతర్గత వ్యవహారాలశాఖ పేర్కొన్న వివరాల ప్రకారం.. ఆస్ట్రియాలోని గ్రాజ్ నగరంలోని ఓ పాఠశాలలో మంగళవారం ఉదయం ఓ విద్యార్థి చొరబడి రెండు తరగతుల్లో విచక్షణారహితంగా కాల్పులకు తెగబడ్డాడు. దీంతో 11మంది ప్రాణాలు కోల్పోగా.. దాదాపు 30కి పైగా విద్యార్థులు, ఉపాధ్యాయులు తీవ్రంగా గాయపడ్డారు. అతడిని నియంత్రించడానికి ప్రయత్నించిన మహిళా ఉపాధ్యాయురాలిపై పలుమార్లు కాల్పులు జరపడంతో ఆమె తీవ్రంగా గాయపడింది. క్షతగాత్రులను ఆస్పత్రికి తరలించి, చికిత్స అందిస్తున్నామన్నారు. అనంతరం తనను తాను కాల్చుకొని మరణించాడని.. అతడి మృతదేహం పాఠశాలలోని బాత్రూంలో లభ్యమైందని పేర్కొన్నారు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నామన్నారు. ఎటువంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా పాఠశాల వద్ద భద్రతా దళాలు మోహరించాయి. 2015 జూన్‌లో గ్రాజ్ ప్రాంతంలో ఇదే తరహాలో జరిగిన కాల్పుల ఘటనలో ముగ్గురు ప్రాణాలు కోల్పోయారు. అది జరిగి పదేళ్లు అవుతుండడంతో దానికి గుర్తుగా విద్యార్థి ఈ కాల్పులకు తెగబడి ఉంటాడని అధికారులు అనుమానం వ్యక్తం చేస్తున్నారు.

## ఉక్రెయిన్‌పై మళ్లీ రష్యా డ్రోన్లు

### ఇస్కాండర్-కె క్రూయిజ్‌లనూ ప్రయోగించిన రష్యా



ఉక్రెయిన్‌పై రష్యా వరుస డ్రోన్ దాడులతో విరుచుకుపడుతోంది. ఇన్నాళ్లలో ఎన్నడూ లేనంత తీవ్రస్థాయిలో భీకర దాడులు చేస్తోంది. రాత్రి వేళ ఉక్రెయిన్‌పై 315 షాహెద్ డ్రోన్లను ప్రయోగించింది. ఈ దాడుల్లో ఏడుగురు ప్రాణాలు కోల్పోయారు. 34 మంది తీవ్రంగా గాయపడినట్లు కీవ్ వాయుసేనను ఉటంకిస్తూ అంతర్జాతీయ మీడియా కథనాలు పేర్కొన్నాయి. 315 డ్రోన్లతో పాటు ఉత్తర కొరియాకు చెందిన కేఎన్-23 బాలిస్టిక్ క్షిపణులు, ఐదు ఇస్కాండర్-కె క్రూయిజ్లను ప్రయోగించింది. ఉక్రెయిన్ రాజధాని నగరం కీవ్‌ను లక్ష్యంగా చేసుకొని దాడులు నిర్వహించింది. 213 డ్రోన్లు, ఏడు క్షిపణులను నేల కూల్చినట్లు ఉక్రెయిన్ వైమానిక దళం వెల్లడించింది. రాడార్ల నుంచి 64 డ్రోన్లు అదృశ్యమైనట్లు మీడియా పేర్కొంది. రష్యా దాడులతో దక్షిణ నగరంలో ఉన్న ప్రసూతి ఆస్పత్రి, వైద్య పరికరాలు తీవ్రంగా దెబ్బతిన్నాయి. కాగా.. 479 డ్రోన్లతో విరుచుకుపడిన రష్యా.. మరోసారి భీకర దాడులు నిర్వహించింది. ఇటీవల జరిగిన దాడిలో 20 క్షిపణులను ప్రయోగించిందని.. మధ్య, పశ్చిమ ఉక్రెయిన్‌లో ప్రదేశాలను ఇవి లక్ష్యంగా చేసుకొన్నట్లు కీవ్ వాయుసేన వెల్లడించింది. మాస్కో ప్రయోగించిన వాటిల్లో 277 డ్రోన్లు, 19 క్షిపణులను మార్గమధ్యలోనే తమ ఎయిర్ డిఫెన్స్ వ్యవస్థలు కూల్చేసినట్లు ఉక్రెయిన్ పేర్కొంది. మొత్తంలో కేవలం 10 డ్రోన్లు లేదా క్షిపణులు మాత్రమే లక్ష్యాలను తాకినట్లు వెల్లడించింది.

## పుతిన్.. మంచి వ్యక్తి

### ఎరాల్ మస్క్ ఆసక్తికర వ్యాఖ్యలు



ప్రపంచ కుబేరుల్లో ఒకరైన ఎలాన్ మస్క్ తండ్రి ఎరాల్ మస్క్ రష్యా అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్‌ను ఉద్దేశిస్తూ ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. పుతిన్ చాలా మంచివ్యక్తి అంటూ కొనియాడారు. అలాంటి వ్యక్తిపై మీడియా తప్పుడు కథనాలు ప్రచురితం చేస్తోందని ఆరోపించారు. రష్యాలో నిర్వహించిన ఫోరం ఆఫ్ ద ఫ్యూచర్ 2050 కార్యక్రమంలో ఎరాల్ మస్క్ పాల్గొన్నారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడారు. "పుతిన్ నిలకడ స్వభావం కలిగినవారు. ఒక మంచి మనిషి. కానీ, పాశ్చాత్య మీడియా ఆయనతోపాటు రష్యాపైనా బురద జల్లుతోంది. శత్రుదేశంలా చిత్రీకరించేందుకు అవాస్తవ కథనాలు ప్రసారం చేస్తోంది. ఆయన గురించి ప్రచురితమైన ఆ వార్తలన్నీ అర్థం లేనివి" అని వ్యాఖ్యానించారు. ఆయన చేసిన ఈ వ్యాఖ్యలు నెట్టింట వైరల్ మారాయి. రష్యా విదేశాంగ మంత్రి సెర్గీ లావ్రోవ్, యూకే పార్లమెంట్ మాజీ సభ్యుడు జార్జ్ గల్లోవే అమెరికా రేడియో హోస్ట్ అలెక్స్ జోన్స్ ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. కాగా.. అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్, ఎలాన్ మస్క్ మధ్య విభేదాలు తీవ్రంగా మారిన సంగతి తెలిసిందే. దీనిపై ఎరాల్ మస్క్ ఇటీవల స్పందించారు. గత కొన్ని నెలలుగా పరిపాలనకు సంబంధించిన విషయాల్లో మస్క్, ట్రంప్ తీవ్ర ఒత్తిడిని ఎదుర్కొంటున్నారన్నారు. అయితే ట్రంప్ తీసుకువచ్చిన బిల్లు నేపథ్యంలో మస్క్ తీవ్ర అసహనానికి గురయ్యాడని.. అందుకే అధ్యక్షుడిపై ఆరోపణలు చేస్తున్నాడని తెలిపారు. ఈ విషయంలోనే వారిద్దరి మధ్య గొడవ వచ్చిందన్నారు. ఇరువురూ వివాదాలను పక్కనపెట్టి కలిసి పని చేయాలని తాను ఆశిస్తున్నట్లు తెలిపారు.

## విస్తరిస్తున్న 'యాంటీ ఐస్'

### అమెరికాలో ఇతర ప్రాంతాల్లోనూ ఆందోళనలు



అమెరికాలో ఇమిగ్రేషన్ అండ్ కస్టమ్స్ అధికారుల చర్యలకు వ్యతిరేకంగా లాస్ ఏంజెలెస్‌లో మొదలైన ఆందోళనలు మెల్లగా ఇతర ప్రాంతాలకూ వ్యాపిస్తున్నాయి. శాన్ ఫ్రాన్సిస్కో, న్యూయార్క్, సియాటెల్, డల్లాస్, లూయిస్‌విల్లే, శాన్ ఆంటోనియో, షికాగో తదితర ప్రదేశాల్లో ఆందోళనలు చోటుచేసుకొన్నట్లు సీఎన్ఎన్, టైమ్స్ మ్యాగజైన్ పేర్కొన్నాయి. శాన్ ఫ్రాన్సిస్కోలో 150మందిని అరెస్టు చేయగా.. న్యూయార్క్ కూడా పలువురిని అదుపులోకి తీసుకొన్నట్లు పేర్కొన్నాయి. శాన్ ఫ్రాన్సిస్కో సివిక్ సెంటర్ వద్ద సోమవారం రాత్రి వేలమంది ప్రదర్శన నిర్వహించారు. వారు ఇమిగ్రేషన్ అండ్ కస్టమ్స్ ఎన్‌ఫోర్స్‌మెంట్ రైడ్స్‌ను వ్యతిరేకిస్తూ నినాదాలు చేశారు.

రోజుకు కనీసం 3,000 మంది అక్రమ వలసదారులను అదుపులోకి తీసుకోవాలంటూ ట్రంప్ కార్యవర్గం ఇటీవల ఆదేశాలు జారీ చేయడంతో ఆందోళనలు మొదలయ్యాయి. ఈ క్రమంలో శుక్రవారం లాస్ ఏంజెలెస్ నగరంలో లాటిన్ ప్రజలు అత్యధికంగా ఉండే ప్రదేశాల్లో ఐసీఈ అధికారులు దాడులు మొదలుపెట్టారు. ఇక్కడ దక్షిణ లాస్ ఏంజెలెస్‌లో దాదాపు 82శాతం హిస్పానిక్ ప్రజలే ఉంటారు. అక్కడ జరిగిన ఒక్క ఆపరేషన్లోనే 44మంది అక్రమ వలసదారులను ఐసీఈ అధికారులు అరెస్టు చేశారు. ఇక గ్రేటర్ లాస్ ఏంజెలెస్‌లో జరిగిన కార్యక్రమంలో డజన్ల కొద్దీ అక్రమ వలసదారులను అదుపులోకి తీసుకొన్నట్లు అధికారులు ఎక్స్‌లో పోస్టు చేశారు. నాటినుంచి లాస్ ఏంజెలెస్, పారామౌంట్, కాంప్టన్ ప్రాంతాల్లో యాంటీ ఐస్ ఆందోళనలు మొదలయ్యాయి. డెటెన్షన్ సెంటర్ వద్ద ఆందోళనకారులు గుమిగూడారు. అదే సమయంలో ట్రంప్ 2,000 మంది నేషనల్ గార్డ్లను మోహరిస్తానని ప్రకటించడం.. సమస్యను మరింత తీవ్రం చేసింది. కాలిఫోర్నియా గవర్నర్ గవిన్ న్యూసమ్ నేషనల్ గార్డ్స్ అవసరం లేదని తేల్చిచెప్పారు. కానీ, ట్రంప్ వినలేదు. తాజాగా 700 మంది మెరైన్లు, అదనంగా మరో 2,000 మంది నేషనల్ గార్డులను మోహరించాలని నిర్ణయించారు. వాస్తవానికి అమెరికాలో నేషనల్ గార్డ్ అనేది ఓ హైబ్రీడ్ విభాగం. ఇది రాష్ట్ర, ఫెడరల్ ప్రభుత్వాలతో కలిసి పనిచేస్తుంది. గవర్నర్ ఆదేశాలతో రాష్ట్రాల్లో నేషనల్ గార్డులను రంగంలోకి దించుతారు. కానీ, ఈసారి అమెరికా అధ్యక్షుడు ట్రంప్ తనకున్న అరుదైన అధికారాలను వినియోగించి వీరిని లాస్ ఏంజెలెస్‌లో మోహరించారు. 1965 తర్వాత ఇలా జరగడం ఇదే తొలిసారి.

## ట్రంప్ మదిలో మస్క్ భయాలు!



అమెరికా అధ్యక్షుడు ట్రంప్, వ్యాపార దిగ్గజం ఎలాన్ మస్క్ మధ్య తలెత్తిన అభిప్రాయభేదాలు ప్రపంచవ్యాప్తంగా చర్చనీయాంశమయ్యాయి. ట్రంప్ ప్రభుత్వంలో కీలకంగా వ్యవహరించిన మస్క్.. ఆ బాధ్యతల నుంచి వైదొలగడం, పరస్పరం బహిరంగ విమర్శలు చేసుకోవడం వారిద్దరి మధ్య సంబంధాలను మరింత బలహీన పరిచాయి. ఈ నేపథ్యంలో ప్రముఖ అమెరికా రచయిత, ట్రంప్ తొలిసారి అధ్యక్షుడిగా ఉన్నప్పుడు ఆయన జీవిత చరిత్ర 'ఫైర్ అండ్ ఫ్యూరీ' పుస్తకం రాసిన మైకేల్ వోల్ఫ్ కీలక వ్యాఖ్యలు చేశారు. ట్రంప్ మనసులో మస్క్ భయపు బీజాలు నాటినట్టు వ్యాఖ్యాంచారు. ప్రస్తుతం ఉపాధ్యక్షుడిగా ఉన్న జేడీ వాన్స్.. అధ్యక్ష పదవిని ఎత్తుకుపోతారనే భయం ట్రంప్ మదిలో నాటుకుందన్నారు. వాన్స్ తన విధేయతను నిరూపించుకోవాల్సిన సమయం వచ్చిందని లేదంటే ఆయన పోస్టుకే ముప్పు పొంచి ఉందన్నారు. స్థానిక మీడియా నిర్వహించిన ఓ పాడ్‌కాస్ట్‌లో వోల్ఫ్.. అమెరికాలోని తాజా పరిస్థితులపై తన అభిప్రాయాలను పంచుకున్నారు. "ట్రంప్ ప్రభుత్వ ఏర్పాటులో మస్క్ కీలకంగా వ్యవహరించారు. ఆయన ప్రోత్సాహంతోనే జేడీ వాన్స్‌ను ఉపాధ్యక్షుడిగా ట్రంప్ అంగీకరించారు. అంతేకాకుండా రిపబ్లికన్ నేతల నుంచి వాన్సుకు గట్టి మద్దతు ఉంది. భవిష్యత్‌లో అగ్ర రాజ్యానికి వాన్సే అధ్యక్షుడవుతారని మస్క్ గతంలోనూ వ్యాఖ్యానించారు. ఈ తరుణంలో ప్రభుత్వం నుంచి బయటకు వచ్చిన మస్క్ పరోక్షంగా జేడీ వాన్స్‌ను ఎగదోసే ప్రయత్నం చేస్తారు" అని వోల్ఫ్ అభిప్రాయపడ్డారు.

జేడీ వాన్స్.. తస్మాత్ జాగ్రత్త

జేడీ వాన్స్‌వల్ల తన సీటుకు ఎసరు ఉంటుందని ముందునుంచే అనుమానిస్తున్న ట్రంప్.. ఇప్పుడు మరింత జాగ్రత్త పడతారని చెప్పుకొచ్చారు. ఈ క్లిష్ట పరిస్థితుల్లో వాన్స్ తన సీటును కాపాడుకోవాల్సిన అవసరముందని, అందుకు తాను అధ్యక్షుడికి విధేయుడినని నిరూపించుకోవాల్సి ఉంటుందని అన్నారు. లేదంటే ఉపాధ్యక్ష పదవి వేరొకరికి వెళ్లినా ఆశ్చర్యపోనక్కర్లేదని వ్యాఖ్యానించారు. ట్రంప్ నిత్యం ముఖస్తుతిని కోరుకుంటారని, అందులో వాన్స్ ఎంత వరకు విజయం సాధిస్తారో చూడాలని వోల్ఫ్ వ్యాఖ్యానించారు.

ట్రంప్ మనసులో ఏముందో.. జేడీ వాన్స్ మాత్రం ఆయనతో చక్కగానే సంబంధాలు కొనసాగిస్తున్నారు. తాజా పరిస్థితుల నేపథ్యంలో ఎక్స్ వేదికగా స్పందిస్తూ.. జీవితంలో ఏ వ్యక్తీ చేయనంత సాయం తనకు ట్రంప్ చేశారని పేర్కొన్నారు. ఆయనతో కలిసి పని చేయడం, ఆయన పక్కన నిల్చోవడం గర్వంగా ఉందని పేర్కొన్నారు. మరోవైపు వోల్ఫ్ వ్యాఖ్యలను శ్వేతసౌధం కమ్యూనికేషన్స్ డైరెక్టర్ స్టీవెన్ సుంగ్ ఖండించారు. అవన్నీ కట్టుకథలని కొట్టిపారేశారు. అతడిని ఓ తెలివి తక్కువ రచయితగా అభివర్ణిస్తూ.. మతిస్థిమితం కోల్పోయి ఏవేవో మాట్లాడుతున్నారని వ్యాఖ్యానించారు.

# పని చేసుకుంటూ పోడవమే..

ఎప్పటిలాగే.. బసవతారకం ఆసుపత్రిలో పుట్టినరోజు వేడుకలు జరుపుకున్నారు అగ్ర కథానాయకుడు బాలకృష్ణ. ఎన్టీఆర్ దంపతుల విగ్రహాల వద్ద నివాళులర్పించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ వయసు కేవలం ఒక నంబర్ మాత్రమేన్నారు. బాలకృష్ణ అంటే ఏంటో ఇకనుంచి చూపిస్తానన్నారు. "నా దృష్టిలో నంబర్ పెద్ద విషయం కాదు. నా వయసు అందరికీ తెలిసిందే. తల్లిదండ్రుల దీవెనలతో 64 ఏళ్లు పూర్తి చేసుకున్నా. మా నాన్న కోరిక మేరకు ఒకసారి మెడిసిన్ ఎంట్రెన్స్ రాశాను. మెడిసిన్ చదవలేదు కానీ.. సినిమాల్లో డాక్టర్ పాత్రలు చేశాను. 15 ఏళ్ల క్రితం బసవతారకం ఆసుపత్రికి ఛైర్మన్ అయ్యాను. అంతర్జాతీయ ప్రమాణాలతో కూడిన వైద్యం అందించేలా కృషి చేస్తున్నాం. బాలకృష్ణ అంటే ఏంటో ఇక నుంచి చూపిస్తాను. నాకు చాలా పొగరని అందరూ అనుకుంటారు. అవును నన్ను చూసుకొనే నాకు పొగరు. బిరుదులకు నేను అలంకారమేమోగానీ.. బిరుదులు నాకు అలంకారం కాదు. బిరుదులు వస్తుంటాయి.. కానీ మన పని మనం చేసుకుంటూ పోవాలి" అన్నారు బాలకృష్ణ.

నేడు బాలకృష్ణ పుట్టినరోజు సందర్భంగా సినీ, రాజకీయ ప్రముఖులు విషెస్ తెలిపారు. అభిమానుల కోసం పుట్టినరోజు కానుకగా ఆయన నటిస్తోన్న 'అఖండ 2' నుంచి పవర్ఫుల్ టీజర్‌ను చిత్రబృందం పంచుకుంది. ప్రస్తుతం అది భారీ వ్యూస్తో సోషల్ మీడియాలో ట్రెండింగ్‌లో ఉంది. సెప్టెంబర్ 25న ఈ సినిమా విడుదల కానుంది.



**సరికొత్త కథా ప్రపంచంతో..**

ఇదిలావుంటే.. బాలయ్య చేయనున్న సినిమాలపైనా సాలిడ్ అప్డేట్స్ వచ్చాయి. తాజాగా అఖండ 2 టీజర్‌తో ట్రెండింగ్‌లోవున్న బాలయ్య.. తన కెరీర్ 111వ సినిమాని దర్శకుడు గోపీచంద్ మలినేనితో చేస్తున్న సంగతి తెలిసిందే. వీరిద్దరి కలయికలో ఒక కొత్తరకం సినిమా రాబోతుందన్న టాక్ వినిపిస్తుంది. ముఖ్యంగా గోపీచంద్ మలినేని అయితే ఇది వరకు చేయని ఒక కొత్త సబ్జెక్టుని ఎంచుకున్నట్టుగా టాక్. ఇలా ఒక భారీ హిస్టారికల్ డ్రామాకి కొత్త ప్రపంచంతో వీరు సన్నద్ధమవుతున్నట్టుగా రూమర్స్ వినిపిస్తున్నాయి. మరి ఇదే జానర్లో సినిమా ఉంటుందో లేదో వేచి చూడాలి.




# సంజీవని ఘట్టమే స్ఫూర్తిగా..?

మహేశ్ బాబు కథానాయకుడిగా రాజమౌళి దర్శకత్వంలో యాక్షన్ అడ్వెంచర్ మూవీ రూపొందుతున్న సంగతి తెలిసిందే. ఇప్పటికే రెండు కీలక షెడ్యూల్స్ పూర్తి చేసుకోగా, మూడో షెడ్యూల్ త్వరలోనే ప్రారంభం కానుంది. తాజాగా కథా నేపథ్యం గురించి వార్త ఒకటి వైరల్ అవుతోంది. ఇతిహాసగాథ రామాయణంతో ఈ కథ ముడిపడి ఉంటుందని టాలీవుడ్ టాక్. ముఖ్యంగా ప్రాణాలను నిలబెట్టే సంజీవని కోసం మహేశ్‌బాబు సాహసాలు చేస్తారని అంటున్నారు. 'ప్రపంచాన్ని చుట్టి వచ్చే సాహసికుడి కథ' అని రాజమౌళి ఇప్పటికే ప్రకటించారు. హాలీవుడ్ సిరీస్ 'ఇండియానా జోన్స్' తరహాలో ఉంటుందని అర్థం వచ్చేలా చిత్ర రచయిత విజయేంద్రప్రసాద్ పలు ఇంటర్వ్యూల్లో తన అభిప్రాయాన్ని పంచుకున్నారు. ఇప్పుడు కథా నేపథ్యం రామాయణం పాయింట్‌తో ముడిపడి ఉన్నట్టు వార్తలు రావడంతో మరింత ఆసక్తి రేపుతోంది. ముఖ్యంగా సంజీవని ఔషధం, దానిని హనుమాన్ తీసుకురావడం రామాయణంలో అత్యంత ఉద్వేగానికి గురిచేసే ఘట్టం. ఇంద్రజిత్ చేసిన దాడిలో మూర్ఛపోయిన లక్ష్మణుడిని తిరిగి మామూలువాడిని చేయడానికి సంజీవనిని హనుమాన్ తీసుకువస్తాడు. ఈ క్రమంలో ఏకంగా ద్రోణగిరి పర్వతాన్ని తన చేతులతో తీసుకొచ్చే ఎపిసోడ్ చదివినా, టీవీలో చూసిన ఒళ్లు గగుర్పొడుస్తుంది. సరిగ్గా ఇలాగే హనుమాన్ తరహాలో మహేశ్ బాబు పాత్రను డిజైన్ చేసుకున్నారని టాక్. ఇదే తరహాలో చిరంజీవి 'జగదేక వీరుడు అతిలోక సుందరి'లో ఒక ఎపిసోడ్ ఉంటుంది. అలాంటిది సినిమా మొత్తం ఈ పాయింట్ చుట్టూనే తిరిగితే ఇక అంతకుమించిన థ్రిల్ ఏముంటుంది. పైగా రాజమౌళి సినిమాల్లో యాక్షన్ ఏస్థాయిలో ఉంటుందో, ఎమోషనన్స్ అంతకన్నా బలంగా ఉంటాయి.



ఇప్పటివరకూ ఈ సినిమాకు సంబంధించి అధికారికంగా ప్రకటించిన విషయాలు చాలా తక్కువ. మరి ఈ విషయంలో నిజమెంతో తెలియాలంటే ఇంకొన్ని రోజులు వేచి చూడాల్సిందే. మరి ఎవరి ప్రాణాలను నిలబెట్టడానికి మహేశ్ బాబు సాహసం చేయబోతున్నాం"నేది సర్వత్ర ఆసక్తికరం. ఇందులో ప్రియాంక చోప్రా, పృథ్వీరాజ్ సుకుమారన్ కీలక పాత్రలు పోషిస్తున్నప్పటికీ..ఇంతవరకు వాళ్ల పాత్రలకు సంబంధించి ఏ అధికారిక ప్రకటన వెలువడలేదు. కాగా, ఇప్పుడీ సినిమాలో ప్రముఖ నటుడు ఆర్ మాధవన్ భాగం కానున్నట్లు సమాచారం అందుతోంది. దీంట్లోని ఓ కీలక పాత్ర కోసం చిత్ర బృందం ఆయన్ని సంప్రదించినట్లు తెలిసింది. త్వరలోనే ఆయన సెట్స్‌లోకి అడుగు పెట్టనున్నట్లు ప్రచారం సాగుతోంది.

**ఓటీటీలోకి సంతానం**

# హారర్ కామెడీ

సంతానం, గౌతమ్ మేనన్ ప్రధాన పాత్రల్లో నటించిన చిత్రం 'డీడీ నెక్స్ట్ లెవెల్'. ప్రేమ ఆనంద్ దర్శకత్వంలో రూపొందిన ఈచిత్రం మే 16న ప్రేక్షకుల ముందుకువచ్చి భయపెడుతూనే నవ్వులు పంచింది. ఇప్పుడీ సినిమా ఓటీటీ వేదికగా తెలుగు ప్రేక్షకుల ముందుకురానుంది. జూన్ 13 నుంచి జీ5లో స్ట్రీమింగ్ కానుంది.

*కథేంటంటే:* కృష్ణమూర్తి (సంతానం) ఓ యూట్యూబ్ ఛానల్ రన్ చేస్తుంటాడు. అందులో నిజాయతీగా సినిమాల రివ్యూలు ఇస్తూ అందరి ప్రశంసలు అందుకుంటాడు. ఒకసారి 'డీడీ నెక్స్ట్ లెవెల్' అనే సినిమా స్క్రీనింగుకు హాజ రుకావాలని కృష్ణమూర్తికి ప్రత్యేక ఆహ్వానం వస్తుంది. దీంతో కుటుంబంతో కలిసి ఆ సినిమా చూడడానికి వెళ్తాడు. అక్కడికి వెళ్లాక అది దెయ్యాల థియేటర్ అని తెలుస్తుంది. అక్కడికి వెళ్తే బయటకు రావడం అసాధ్యమని తెలుసుకుంటాడు. ఒకప్పుడు తాను రివ్యూ ఇచ్చిన సినిమా నిర్మాత తనపై పగ తీర్చుకోవడానికే ఇలా చేశాడని తెలుసుకుంటాడు. దీంతో ఆ థియేటర్ నుంచి ఎలాగైనా బయటపడాలని ప్రయత్నిస్తాడు. అక్కడి నుంచి ఎలా బయటపడ్డాడు.. అసలు అందులో దెయ్యాలు ఉన్నాయా.. అనేది కథ.







# డంప్‌యార్డులో షూటింగ్.. రష్మికకు ఏమైందో నాకు తెలీదు..

డంప్‌యార్డులో దాదాపు 7 గంటల పాటు చిత్రీకరణలో పాల్గొన్నా రష్మిక ఇబ్బంది గా ఫీలవలేదని, ఆమెకు అసలు చెడు వాసనే రాలేదంటూ ధనుష్ నవ్వులు పూయించారు. ఈ ఇద్దరు, నాగార్జున ప్రధాన పాత్రల్లో దర్శకుడు శేఖర్‌కమ్ముల రూపొందించిన సినిమా 'కుబేర మూవీ 20న విడుదల కానుంది. ఈ సందర్భంగా చిత్రంలోని 'పీ పీ డుమ్ డుమ్' పాట విడుదల వేడుకను ముంబయిలో మంగళవారం నిర్వహించారు. "నా కెరీర్లో 'కుబేర' చాలా ప్రత్యేకమైంది. ఈ సినిమా చిత్రీకరణ ఎన్నో విషయాలు నేర్పింది. ఈ చిత్రంతో మంచి వ్యక్తులు పరిచయమయ్యారు. ఈ మూవీలో నేను బెగ్గర్‌గా నటించా. ఈ పాత్ర కోసం ఎంతో రీసెర్చ్, హోమ్ వర్క్ చేశా అని చెప్పను (నవ్వులు). శేఖర్ కమ్ముల సర్ చెప్పింది చేసుకుంటూ వెళ్లా. సవాలుతో కూడిన ఈ ప్రయాణాన్ని ఆస్వాదించా. శేఖర్ మంచి మనిషి. అందరితోనూ స్నేహపూర్వకంగా ఉంటారు. ఆయన 20 నిమిషాల్లో ఈ సినిమా స్క్రిప్ట్ వినిపించారు. ఆయనెంత పాజిటివ్‌గా ఉంటారో అప్పుడే అర్థమైంది. ఓ డంప్ యార్డులో దాదాపు 7 గంటలపాటు నేను, రష్మిక షూటింగులో పాల్గొన్నాం. అక్కడ అంత సేపు ఉన్నా ఆమె బాగానే ఉంది. నాకేం వాసన రావట్లేదు అని చెప్పింది.మరి ఆమెకుఏమైందో నాకు తెలియదు(నవ్వులు). ఇలా ఎన్నో మంచి జ్ఞాపకాలు పంచింది చిత్రం. కుబేర మూవీ మాకు పెద్ద ఛాలెంజ్ అంటూ వచ్చిన కొన్ని వార్తలు చదివా. అదేం కాదు. మేం సరదాగా చిత్రీకరణ పూర్తి చేశాం. నేను ఎక్కడినుంచి వచ్చానో.. మళ్లీ అక్కడికి వెళ్లి గత జ్ఞాపకాలు నెమరువేసుకున్నానంతే" అని ధనుష్ పేర్కొన్నారు. సినిమా సినిమాకు వైవిధ్యం ఎలా చూపించగలుగుతున్నారు? అని ప్రశ్నించగా.. "నేను ప్రాసెసర్లాంటి వాడిని. ఆయా పాత్రల విషయంలో దర్శకులు ఎక్కువగాకష్టపడతారు.వారి ఇచ్చిన ఇన్‌పుట్స్‌ను నేను ప్రాసెస్ చేశా. ఈ విషయంలో క్రెడిట్ మొత్తం నా డైరెక్టర్స్‌కే అని తెలిపారు.

రష్మిక మాట్లాడుతూ.. "ఇంతకుముందు వేర్వేరు సినిమాల్లో నేను పోషించిన గీతాంజలి, శ్రీవల్లి, మహారాణి యేసుబాయిలాంటి పాత్రల్లాగే 'కుబేర'లో ప్లే చేసిన రోల్ కూడా ప్రేక్షకులకు గుర్తుండి పోతుంది. ఒక్కో డైరెక్టర్‌గా ఒక్కో విజన్. దర్శకులు చెప్పినట్టుగానే నేను నటిస్తా. నాగార్జున, ధనుష్‌లతో కలిసి నటించడం ఆనందంగా ఉంది" అని అన్నారు.